thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 17 కరీంనగర్ శుక్రవారం, 28 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సమాచార కమిషన్ పదవులను తక్షణమే భర్తీ చేయండి

న్యూఢిల్లీ : సమాచార కమిషన్లలో పలు పదవులు ఖాళీగా ఉండడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వాటిని తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. పదవులు ఖాళీగా ఉంటే ఆ సంస్థలు ఉండి ఏమి ఉపయోగమని జస్టిస్ సూర్యకాంత్, జస్టి స్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం వ్యాఖ్యానించిం ది. సమాచార కమిషనర్లు లేకపోవడంతో తెలంగాణ, త్రిపుర, ఝార్ఖండ్‌ల్లో సమాచార కమిషన్లు క్రియారహితంగా మారాయని అభిప్రాయపడింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ పదవుల్లో కేవలం బ్యూరోక్రాట్లను మాత్రమే నియమిస్తుండడంపై ప్రశ్నించింది. అన్ని వర్గాల ప్రముఖులకు అవకాశం కల్పించాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ల పదవులు భర్తీ కావడం లేదంటూ అంజలి భరద్వాజ్, మరికొందరు పిటిషన్ దాఖలు చేశారు.

## చివరి రోజు పేలిన మాటల తూటాలు

# దద్దరిల్లిన సభ!




## ఇదే ఫస్ట్‌టైమ్.. అసెంబ్లీలో హైవోల్టేజ్ కామెంట్స్..

హైదరాబాద్, మార్చి 27: తెలంగాణ అసెంబ్లీలో వాడి వేడిగా చర్చ జరిగింది. మునుపెన్నడూ లేని స్థాయిలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల తూటాలు పేలాయి. ఇటు నుంచి సీఎం రేవంత్ రెడ్డి.. అటు నుంచి కేటీఆర్ ఒకరొకరు కౌంటర్లు ఇస్తూ సభను మరింత రక్తి కట్టించారు. తొలుత మాట్లాడిన కేటీఆర్.. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం తీవ్రంగా స్పందించారు. కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కక్ష సాధింపులకు పాల్పడితే కేటీఆర్ కుటుంబం అంతా జైల్లోనే ఉండేదన్నారు. కక్ష సాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం తమకు లేదని.. దేవుడు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు.

**అసెంబ్లీలో సీఎం ప్రసంగం..** కక్ష సాధింపుల ఆలోచన ప్రభుత్వానికి లేదు. కక్ష సాధింపులకు పాల్పడితే మీరంతా చంచల్‌గూడ జైల్లోనే.. చర్లపల్లి జైల్లోనే ఉండేవారు. సలహాలు ఇస్తారనుకుంటే.. ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారు. అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేస్తే రూ. 500 ఫైన్ వేస్తారు. కానీ, ఎంపీగా ఉన్న తనను చర్లపల్లి జైలుకు పంపారు. జైల్లో నిద్రలేని రాత్రుళ్లు గడిపాను. డిటెన్షన్ సెల్లో 16 రోజులు నన్ను నిర్బంధించారు. రాత్రిపూట లైట్లు ఆపమని అడిగినా.. జైలు సిబ్బంది ఆపేవారు కాదు. ఎందుకని అడిగితే.. పై నుంచి ఆదేశాలు ఉన్నాయనేవారు. రాజకీయ కక్షసాధింపులు చేసింది మీరు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లా. కక్ష సాధింపు మీదా నాదా పైనుంచి దేవుడు అన్నీ చూస్తాడని వేచి చూశా. నేను ప్రమాణస్వీకారం చేసిన రోజే.. వాళ్లు ఆస్పత్రి పాలయ్యారు. నేను కక్ష సాధింపులకు పాల్పడితే మీ కుటుంబం అంతా జైలుపాలే. ఇప్పటివరకు మేం అక్రమ కేసులు పెట్టలేదు.

**రైతు రుణమాఫీ చేశాం..** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారి రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి.. అసలు పూర్తే చేయలేదు. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని రైతుబంధు కూడా వేయలేదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.16,900 కోట్లతో రుణమాఫీ చేశారు. మేం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే.. రూ.20,615 కోట్ల రుణమాఫీ చేశాం.

బీఆర్ఎస్ ఎగవేసిన రైతుబంధు రూ.7,625కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని పేద రైతులను బెదిరించారు. కానీ వారి ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించి అమ్ముకున్నారు. మేం వరి వేసిన వారికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చాం.

**కాంగ్రెస్ అంటేనే కరెంట్..** అసలు బీఆర్ఎస్‌కు ఉచిత కరెంట్‌తో ఏం సంబంధం.. రాష్ట్రంలో ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. రైతుల ఉచిత కరెంట్ కోసం రూ.33వేల కోట్లు ఖర్చు చేశాం. బీఆర్ఎస్ పదేళ్లలో చేయని పనులు.. మేం 10 నెలల్లో చేశాం.

**భారీగా అప్పులు..** తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర అప్పు రూ.72వేల కోట్లు. కార్పోరేషన్ అప్పులు కూడా కలిపితే రూ.90 వేల కోట్లు. ఈ పదేళ్లలో %ఖీ=దీవీ% అప్పులే రూ.3.50లక్షల కోట్లు దాటింది. మేం అధికారంలోకి వచ్చే నాటికి అప్పు రూ.6.69 లక్షల కోట్లు. ఇతర బకాయిలతో కలిపి రూ.7.05 లక్షల కోట్లు.

పెండింగ్ బిల్లులే రూ.40వేల కోట్లు పెట్టిపోయారు. మేం 15 నెలల్లో రూ.1.58లక్షల కోట్ల అప్పు చేశాం. కొత్తగా చేసిన అప్పులో రూ.1.53లక్షల కోట్లు పాత అప్పులకే చెల్లించాం. కాళేశ్వరంపై రూ.70,490 కోట్లు అప్పు తీసుకొచ్చారు. కూలిపోయిన ఆ ప్రాజెక్ట్‌కు రూ.5వేల కోట్లకు పైగా చెల్లించాం. గత సీఎం డాక్టర్, ఇంజనీర్, డిజైనర్ నేనే అంటూ కాళేశ్వరం కట్టారు. ఇంజనీర్లు చెప్పినా వినకుండా.. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్ట్ కట్టారు. ఏడో వింత అంటే మూడేళ్లకే పనికిరాకుండా పోయింది. ఇప్పుడు నీళ్లు నిలిపితే కూలుతుందని నిపుణులు చెబుతున్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే.. తెలంగాణలో వరి దిగుబడి పెరిగింది.

## వాళ్లకి జైల్లో డబుల్‌రూం కట్టిస్తానని హామీ ఇచ్చా.. ఆ హామీ కూడా ఇంకా నెరవేర్చలేదు




హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా సాగి... నిరవదికంగా వాయిదా పడ్డాయి. గురువారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విచక్షణాధికారులు ఉపయోగిస్తే మీరు ఒక్కరైనా బయట ఉండేవారా..? అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి జైల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తా అని ఎన్నికల హామీ ఇచ్చానన్నారు.. ఆ హామీ కూడా ఇంకా నెరవేర్చలేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఏకమొత్తంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామన్నారని, ఎన్నిలయ్యాక రుణమాఫీకి ఐదేళ్ల సమయం పట్టిందని మండిపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. రెండోసారి రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి.. నాలుగేళ్లు చేయలేదన్నారు. పదేళ్లలో 21 లక్షల మంది రైతులకు 16,908 కోట్లు రుణమాఫీ చేశారు. మేం 25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్లు రెండు లక్షల చొప్పున రుణమాఫీ చేశామని ఆయన తెలిపారు. రైతుబంధు ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకొని వారు పారిపోయారని, వారు ఎగ్గొట్టిన డబ్బును నేను సీఎం అయ్యాక చెల్లించాను అని ఆయన పేర్కొన్నారు. మొదటి విడత రూ.7625 కోట్లు నేను చెల్లించా అని సీఎం రేవంత్ తెలిపారు. మేం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా పథకం కింద రూ.12 వేల కోట్లు చెల్లించామన్నారు. వాళ్లు వరి పండించి రూ.4500కు అమ్మకున్నారని, పేద రైతులకు మాత్రం వరేస్తే ఉరే అని ప్రచారం చేశారన్నారు. మేం వరి వేయమని చెప్పి, బోనస్ కూడా ఇచ్చామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉచిత కరెంట్ కనిపెట్టిందే కాంగ్రెస్ అని, మీరు పదేళ్లు చేయలేని పనులు పది నెలల్లో చేసి చూపామని కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వారి హయాంలో అకాల వర్షాలకు ఏనాడు నష్టపరిహారం ఇవ్వలేదని, మేం నష్టపరిహారం చెల్లించామన్నారు. కష్టపడి పనిచేస్తున్నానని ప్రతిపక్ష నాయకుడు చెప్పొచ్చు కదా అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి నాలుగు రకాలుగా అప్పు చేసుకునే అవకాశం ఉంటుందని, మూడు రకాల అప్పులు కలిపి తెలంగాణ ఏర్పడే నాటికి 90 వేల 160 కోట్ల అప్పు ఉండేదన్నారు. 1 డిసెంబర్ 2023 నాటి అప్పు రూ. 6,69,257 కోట్లు అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.




నిజామాబాద్ : ఏప్రిల్ 1 నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీకి యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉగాదికి సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యాన్ని తరలించి రెడీగా ఉంచారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గోడౌన్లలో సన్న బియ్యాన్ని నిల్వ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 21,83, 215 మంది లబ్ధిదారులకు సన్న బియ్యం అందనున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నారు. కామారెడ్డి జిల్లాలో 2,53,655 కార్డులు ఉండగా, 8,54,529 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 5,442 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో 4,03,025 కార్డులు ఉండగా, 12,83,215 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 7,451 మెట్రిక్? టన్నుల బియ్యం అవసరమవుతుంది. రెండు జిల్లాలకు కలిపి ప్రతి నెలా 12,893 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటి వరకు దొడ్డు బియ్యం సరఫరా చేయగా, అధిక శాతం కార్డుదారులు వండుకోకుండా అమ్ముకోవడంతో సర్కార్‌బియ్యం పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన కాంగ్రెస్? ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది.




## ప్రవేశపెట్టిన రేవంత్ రెడ్డి... అసలు డిమాండ్ ఏంటంటే...

# తగ్గేదే లే!

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం చేపట్టనున్న డీలిమిటేషన్ విధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాలను యూనిట్స్ వారీగా తీసుకుని డీలిమిటేషన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి, కేంద్రం విధించిన లక్ష్యాలను అందుకోవడంలో విజయం సాధించాయి. దాంతో ఉత్తరాదిన జనాభా భారీగా పెరిగిపోయిందని, దక్షిణాదిని జనాభా పెరుగుదల పూర్తిగా అదుపులోకి వచ్చింది" అని అన్నారు. ఇలాంటి సందర్భంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. మొత్తం దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల జనాభా 24 శాతమే ఉందని చెబుతూ ఆ సంఖ్యతో వచ్చే లోక్ సభ స్థానాలతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులను సాధించుకోలేవు అని అన్నారు. తమిళనాడు సీఎం ఎం.కే. స్టాలిన్ కూడా డీలిమిటేషన్ అంశాన్ని వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల నేతలతో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేశారని సీఎం రేవంత్ రెడ్డి సభలో గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై వస్తున్న విమర్శలను కొంతమంది కేంద్రమంత్రులు, బీజేపి నేతలు ఖండిస్తుండటంపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. అసలు కేంద్రం నిర్ణయం తీసుకోకముందే రాజకీయం చేయడం ఎందుకని కేంద్రమంత్రులు, బీజేపి నేతలు అంటున్నారు. కానీ జనాభా ప్రాతిపదికన చేసే డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలు ఎంత నష్టపోతాయో కేంద్రానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. అందుకే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా తెలంగాణ ప్రజలకే కాదు... కేంద్రానికి కూడా తెలంగాణ ప్రభుత్వ వైఖరి ఏంటో చెప్పాలనేదే తమ ఉద్దేశం అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**ఇందిరా గాంధీ బాటలోనే వాజ్‌పెయి వెళ్లారు... కానీ..** 1975 లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా పార్లమెంట్ నియోజకవర్గాల విషయంలో పాత సంఖ్యనే కొనసాగించారు. అలాగే 2002 లో అప్పటి ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి కూడా అదే విధానాన్ని కొనసాగిస్తూ మరో 25 ఏళ్లు అదే సంఖ్యను పొడిగించారు. కానీ మోదీ ఆ ఆలోచనలో లేరని రేవంత్ రెడ్డి అన్నారు.

**11 ఏళ్లుగా మోదీ ఆ చట్టాన్ని అమలు చేయడం లేదన్న రేవంత్ రెడ్డి..** ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలను 153కి పెంచాలని, ఏపీలో ఉన్న 175 అసెంబ్లీ నియోజకవర్గాలను 225 వరకు పెంచాలని ఉంది.

పార్లమెంట్‌లోనే చేసిన ఈ చట్టాన్ని మోదీ సర్కారు అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఆ పని చేయలేదు. వారికి దక్షిణాదిపై ఉన్న ఆసక్తి ఏంటో చెప్పడానికి ఈ ఒక్క విషయమే చాలు అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.



# మేమూ అలా చేస్తే.. ఇప్పటికే కొందరు జైల్లో ఉండేవారు

హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని సీఎం అన్నారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే.. ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారు.

కేటీఆర్, కేసీఆర్‌ను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు" అని రేవంత్ అన్నారు. "భారాస మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసింది. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్లు మాఫీ చేశారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8,500 కోట్లకు పైగా అయ్యింది. మేం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.26వేల కోట్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని రైతుబంధు కూడా వేయలేదు. భారాస ఎగవేసిన రైతుబంధు రూ. 7,625 కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని మాజీ సీఎం స్వయంగా బెదిరించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చాం" అని రేవంత్ తెలిపారు.

**కమీషన్ల కోసం ప్రాజెక్టుల రీడిజైన్...** ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకున్న కేసీఆర్.. వాళ్ల బంధువుల భూములు మాత్రం తప్పించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న రైతులు ఆందోళన చేయలేదా? అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారన్నారు. " ప్రాజెక్టు వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసినట్లు నిరూపిస్తాను. నేను భూసేకరణను వ్యతిరేకించలేదు.. పరిహారం చెల్లించాలని ధర్నాలు చేశాను. కమీషన్ల కోసం ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశారు. రూ.36వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి.. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. కాళేశ్వరం అవినీతి విషయంలో త్వరలోనే వీళ్లు జైలుకు వెళ్తారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చింది" అని రేవంత్ అన్నారు.



# అందుకే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు

హైదరాబాద్: డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలి. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలి. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదు. ప్రస్తుతం డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదికన జరుగుతోంది. 1971లో రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్‌ను 25 ఏళ్లు నిలిపేశారు. డీలిమిటేషన్‌పై గందరగోళం నెలకొంది. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ డీలిమిటేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని తీర్మానం చేశారు. జనాభా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌ను వాజ్‌పేయీ కూడా వ్యతిరేకించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. డీలిమిటేషన్ జరిగితే ఇది 19 శాతానికి పడిపోతుంది. దీనికి వ్యతిరేకంగా అందరూ ఒకే మాటపై ఉండాలి. ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలి. ఏపీ, తెలంగాణ శాసనసభ నియోజకవర్గాలు పెంచాలని పునర్విభజన చట్టంలో ఉంది. ఇప్పటి వరకు శాసనసభ నియోజకవర్గాలను పెంచలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారమే సిక్కిం, జమ్మూ కశ్మీర్ నియోజకవర్గాలను పెంచారు. రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు. 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువ వస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు మాత్రం కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటా ఉంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# అప్పుల్లో తెలంగాణ రైజింగ్: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. "రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తిలా ఉంది. రాష్ట్ర దుస్థితికి మొదటి ముద్దాయి భారాస అయితే.. రెండో ముద్దాయి కాంగ్రెస్. డీలిమిటేషన్ మీద రాహుల్‌గాంధీ వైఖరి చెప్పాలి. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లు అప్పులు చేసింది. అప్పులు చేయటంలో మాత్రమే తెలంగాణ రైజింగ్ కనిపిస్తోంది. గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల విధ్వంసం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. గత ప్రభుత్వ దారిలోనే ఈ ప్రభుత్వం నడవటం బాధాకరం. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వలేదంటూ అవాస్తవాలు మాట్లాడొద్దు. కాంగ్రెస్ కూటమిలో చేరేందుకు భారాస ప్రయత్నిస్తోంది. డీలిమిటేషన్‌తో అన్యాయం అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. కుటుంబ పార్టీలే భాజపాని వ్యతిరేకిస్తున్నాయి. భారాస ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంపై ఈ ప్రభుత్వం ఏం చర్య తీసుకుంటుందో చెప్పాలి. గత ప్రభుత్వం 11 శాతానికి తెచ్చిన వడ్డీలను రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారో.. లేదో? చెప్పాలి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై ఏం చర్యలు తీసుకున్నారు?" అని ఏలేటి ప్రశ్నించారు.

# అవయవ దానానికి ముందుకొచ్చిన కేటీఆర్

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అవయవ దానానికి ముందుకొచ్చారు. అవయవదానానికి తాను సిద్ధంగా ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా ఆయన ప్రకటించారు. సంబంధిత బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "మనం ప్రజా ప్రతినిధులం.. అందరికీ ఆదర్శంగా నిలవాలి. నియోజకవర్గాల్లోనూ అవయవ దానంపై చైతన్యం తేవాలి" అని కేటీఆర్ అన్నారు.

# కర్ణాటకలో పాల ధరలు.. లీటర్‌కు రూ.4 చొప్పున పెంపు!

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం నందిని పాల ఉత్పత్తుల ధరలను పెంచింది. లీటరుకు ఏకంగా రూ.4 చొప్పున పెంచినట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. పాలతో పాటు పెరుగుపై కూడా అంతే పెంచినట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వెల్లడించింది. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల ధరలను పెంచే అంశంపై చర్చినట్లు మంత్రి కె. వెంకటేష్ వెల్లడించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. లీటర్ పాలు, కేజీ పెరుగుపై రూ.4 పెంచేందుకు నిర్ణయించాం. ఏప్రిల్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. ఇకపై రాష్ట్రంలోని పాల ఉత్పత్తిదారులకు కొత్త రేట్లు నేరుగా ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకుంటాం. గతేడాది జూన్ 26న అమల్లోకి వచ్చిన లీటరుకు రూ.2 పెంపును ఉపసంహరిస్తున్నాం" అని పేర్కొన్నారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (%ఖవీఖీ%) నందిని బ్రాండ్ పాలు, వాటి ఉత్పత్తులపై రూ.5 పెంచాలంటూ డిమాండ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారు రూ.4 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రైతులకు మద్దతు అందించేందుకు నూతన ధరలు అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమ వద్ద పాలు చౌకగా లభిస్తున్నాయని కేఎంఎఫ్ పేర్కొంది. గత మూడేళ్లలో కేఎంఎఫ్ పాల ధరలు ఇంత ఎక్కువ మొత్తంలో పెంచడం ఇదే తొలిసారి.

**పెంపు తర్వాత ధరలు ఇలా..** టోన్డ్ మిల్క్: లీటరుకు రూ.46 (గతంలో రూ. 42), హోమోజెనైజ్డ్ టోన్డ్ మిల్క్: రూ. 47 (గతంలో రూ.43), ఆవు పాలు (గ్రీన్ ప్యాకెట్): రూ. 50 (గతంలో రూ.46), శుభమ్ మిల్క్: రూ. 52 (గతంలో రూ.48), పెరుగు: రూ. 54 (గతంలో రూ. 50)



# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చింది ఎంత?

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతి పనిలోనూ గత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నవారు.. కేంద్రం తీరుపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. "తెలంగాణకు మేలు జరగాలి. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. రాష్ట్రం బాగుండాలన్నదే మా సంకల్పం. పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడకపోవడం బాధేసింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రథకాలను కేంద్రం అనుకరిస్తోంది. మనకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం ఎందుకు మాట్లాడటం లేదు? పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఒక్క సీటు కూడా రాలేదని విమర్శిస్తున్నారు. మాకు వచ్చింది సున్నానే.. మరి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకి వచ్చింది గుండు సున్నా కాదా. కొట్లాడకపోతే కేంద్రం నిధులు ఇవ్వదు... పోరాడాల్సిందే. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు మేం కూడా మద్దతిస్తాం. సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. మేం కూడా అప్పట్లో కేంద్రంతో సఖ్యతతోనే ఉన్నాం. ఏమీ రాలేదు. తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయి అయినా ఇచ్చిందా? సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి. కుంభమేళాకు నిధులు ఇస్తున్న కేంద్రం.. సమ్మక్క-సారలమ్మ జాతరకు ఎందుకు ఇవ్వదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

**స్థిరాస్తి రంగం కుప్పకూలింది...** ఫార్మా సిటీపై ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. " ఒకసారి ఫ్యూచర్ సిటీ అంటారు. మరోసారి ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటారు. ఈ ప్రభుత్వ విధానాల వల్ల స్థిరాస్తి రంగం కుప్పకూలింది. వ్యాపారం జరగక స్థిరాస్తి వ్యాపారులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ తన సొంత అవసరాల కోసం నిర్మించలేదు. కాళేశ్వరం కూలిపోతే.. మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తీసుకువస్తారు?

**తులం బంగారం ఎక్కడ?...** అద్దెలు చెల్లించకపోవడంతో గురుకుల భవనాలకు తాళాలు వేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే మేం కూడా చెల్లించాం. ఈ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చింది 11 వేల ఉద్యోగాలు మాత్రమే. మేం పరీక్షలు నిర్వహించిన వాటికే వీళ్లు నియామకపత్రాలు ఇచ్చారు. గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తామన్నారు.. చేయలేదు. కోటి మంది మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం కోసం ఎదురు చూస్తున్నారు. పేరుకు ప్రజా పాలన.. చేసేది ప్రజా పీడన. విఫల పాలనకు విజయోత్సవాలు చేస్తున్నారు. ప్రజలు గోల్డ్ అని వీళ్లకు ఓట్లేశారు. కానీ, రోల్డ్ గోల్డ్ అని తేలింది. రేవంత్‌రెడ్డి ఎందుకు జైలుకెళ్లారు? స్వాతంత్ర్య పోరాటం చేసి ఆయన జైలుకు వెళ్లారా? మీ ఇంటిపై డ్రోన్ ఎగరేస్తే మీరు ఊరుకుంటారా? కుటుంబాలు మీకే ఉంటాయా.. మాకు ఉండవా? నేను కూడా తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ జైలుకు వెళ్లా" అని కేటీఆర్ అన్నారు.

# అసెంబ్లీలో కాగ్ నివేదిక.. ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టారు. 2023-24 ఆర్థిక ఏడాది ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించారు. ఇందులో 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని తెలిపారు. జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతంగా పేర్కొన్నారు. ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు అయింది. అదనంగా రూ.1,11,477 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

**కాగ్ నివేదిక ప్రకారం..** వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ ద్వారా రూ.10,156 కోట్లు తీసుకున్న ప్రభుత్వం. రూ.35,425 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌ను 145 రోజుల పాటు వాడుకుంది. 2023-24లో వడ్డీల చెల్లింపుల కోసం రూ.24,347 కోట్ల వ్యయం. వేతనాలకు రూ.26,981 కోట్లు ఖర్చు. ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.83 శాతం నిధులు. 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు మొత్తం రూ.9,934 కోట్లు. రెవెన్యూ రాబడుల్లో 45 శాతం వేతనాలు, వడ్డీ చెల్లింపులు, పింఛన్లకే ఖర్చు. రెవెన్యూ మిగులు రూ.779 కోట్లు. రెవెన్యూ లోటు రూ.49,977 కోట్లు, జీఎస్డీపీలో రెవెన్యూ లోటు 3.33 శాతం. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు రుణాల మొత్తం 4,03,664 కోట్లు. 2023-24 ముగిసే వరకు జీఎస్డీపీలో అప్పులు 27 శాతం. 2023-24 వరకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.2,20,607 కోట్లు . 2023-24లో మూలధనం కింద రూ.43,918 కోట్ల ఖర్చు . స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773 కోట్లు. స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో 11 శాతం పెరుగుదల

# బెట్టింగ్ యాప్స్‌లో ఈ గేమ్స్ జోలికి వెళ్తే నరకాన్ని చూస్తారు

బెట్టింగ్ యాప్స్‌పై ముఖ్యంగ తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన చర్చ జరుగుతోంది. ఓవైపు మరికొన్ని గంటల్లో ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే కొత్త రకాల పేర్లతో సామాన్య, మధ్య తరగతి ప్రజలే టార్గెట్‌గా బెట్టింగ్ యాప్‌లు మార్కెట్‌లోకి వచ్చాయి. పోలీసులు ప్రమోటర్లపై కేసులు పెట్టి, చర్యలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ బెట్టింగ్ మాఫియా మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గడంలేదు. బెట్టింగ్ యాప్ నిర్వహకులపై చర్యలు తీసుకోవడంలేదని, దీంతో బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేయడం కష్టంగా మారిందనే చర్చ జరుగుతోంది. బెట్టింగ్ యాప్‌లు చాలామంది వ్యక్తులను ఆర్థికంగా కుంగదీస్తోంది. బెట్టింగ్‌కు బానిసగా మారి ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువుగా చూస్తున్నాం. 2024వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో వెయ్యిమంది ఆత్మహత్యలు చేసుకున్నారని పోలీసులు ప్రకటించడం చూస్తుటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు . హైదరాబాద్‌లోని వినాయకనగర్‌కు చెందిన ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న యువకడు తరుణ్ రెడ్డి బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితుడై అప్పులపాలై ఈఏడాది జనవరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరవకొండకు చెందిన ఓ ప్రయివేట్ ఉద్యోగి కిశోర్ కుమార్ బెట్టింగ్ యాప్ కారణంగా ఫిబ్రవరిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డబ్బు ఆశ చూపించి బెట్టంగ్ ఊబిలోకి దించి బయటకు రాలేని పరిస్థితులు కల్పిస్తుండటంతో బెట్టింగ్ యాప్స్ కారణంగా ముఖ్యంగా యువత తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో బెట్టింగ్ యాప్స్‌లో డేంజరస్ గేమ్స్ గురించి తెలుసుకుందాం.

**వాటి జోలికి వెళ్లొద్దు...** బెట్టింగ్ యాప్స్‌లో ఒరిజినల్ గేమ్స్ కంటే వర్చువల్ గేమ్స్ దందా ఎక్కువుగా నడుస్తోంది. ఒరిజినల్ గేమ్ అంటే రెండు జట్లు రియల్‌గా తలపడతాయి. ఈ గేమ్స్‌లో గెలుపోటములు జట్టు ప్రదర్శనపై ఆధారపడి ఉంటాయి. కానీ వర్చువల్ గేమ్స్‌లో మాత్రం గెలుపోటములను కొందరు వ్యక్తులు ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. బెట్టింగ్ సొమ్ము ఆధారంగా.. లాభ, నష్టాలను అంచనా వేసుకుని కొందరు గెలుపోటమును నిర్ణయించే అవకాశం ఉండొచ్చు. అలాగే రమ్మీ, నంబర్ గేమ్, కార్డు గేమ్స్‌లో గ్యాబ్లింగ్ జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులకు ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టేది వర్చువల్ గేమ్స్ అనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు.కార్డు గేమ్స్‌లో రమ్మీ, 7అప్ 7 డౌన్, తీన్‌పతి, అందర్ బహార్, పూల్ రమ్మీ, ఏకే 47, డ్రాగన్ అండ టైగర్, పప్పు, విన్ డ్రాప్ వంటి గేమ్స్‌ను ఎవరు ఆపరేట్ చేస్తారనే విషయం తెలియదు. ఈ గేమ్స్ ఫలితాలను ఎవరైనా వ్యక్తులు ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. ఉదాహరణకు 7 అప్ 7 డౌన్ గేమ్‌లో ఒకసారి7 అప్ మీద మొత్తం బెట్ రూ.10 వేలు, 7 డౌన్ మీద మొత్తం బెట్ రూ.11వేలు వచ్చి.. 7 మీద రూ. వెయ్యి వస్తే సాధారణంగా ఆ గేమ్‌లో ఫలితం 7 రావొచ్చు. అప్పుడు అప్, డౌన్‌పై బెట్ వేసినవాళ్లు డబ్బులు నష్టపోతారు. ఒకసారి 7 వచ్చింది కాబట్టి తరువాత అప్, డౌన్ రావొచ్చనే ఆశతో మళ్లీ అప్, డౌన్‌పై వేస్తే వరుసగా కొన్నిసార్లు 7 రావొచ్చు. అంటే బెట్టింగ్ నిర్వహకుడు తనకు అనుకూలంగా ఫలితం ఉండేలా చూసుకుంటారనడంలో ఎలాంటి అనుమానం అవసరం లేదు. అందుకే ఇలాంటి వర్చువల్ గేమ్స్ ఆడితే ఆర్థికంగ నష్టపోవడమే తప్పా ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయాన్ని గ్రహించాల్సి ఉంటుంది.

# వయనాడ్ విలయం.. కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందలేదు: సీఎం విజయన్

వయనాడ్: గతేడాది కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి భారీగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లిన ఘటన పెను విషాదం నింపిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి బాధిత కుటుంబాల పునరావాసం కోసం నిర్మించనున్న మోడల్ టౌన్‌షిప్‌నకు కేరళ సీఎం పినరయి విజయన్(%ఁఱఅఖతీఖఎఱ ఎఱయిఖఝఅ%) గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయనాడ్ కొండచరియలు విరిగి పడిన ఘటనలో బాధితులకు పునరావాసం కోసం కేంద్రం నుంచి ఇప్పటివరకు ఆర్థిక సాయం అందలేదని వెల్లడించారు. పునరావాస పనులకు కేవలం రుణం మాత్రం అందిందని.. అదీ తగినంతగా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాసం కోసం కేంద్రం తన మూలధన పెట్టుబడి పథకం నుంచి దాదాపు రూ.529.50 కోట్ల రుణం మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా విజయన్ ప్రస్తావించారు. కేంద్రంతో తమకు ఉన్న గత అనుభవాల నుంచి ఇంకేమీ ఆశించలేమన్నారు. కేరళలోని గతేడాది జులై 30న మండక్కై, చూరాల్‌మల సహా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గల్లంతైన విషయం తెలిసిందే. ఈ విలయానికి సర్వం కోల్పోయిన బాధితుల కోసం కాల్పెట్టలోని ఎల్‌స్టన్ ఎస్టేట్‌లో ప్రభుత్వం సేకరించిన స్థలంలో ప్రభుత్వం టౌన్‌షిప్ నిర్మిస్తోంది. దాదాపు 64 హెక్టార్ల విస్తీర్ణంలో ఒక్కో ప్లాటుకు ఏడు సెంట్లు చొప్పున వెయ్యి చదరపు అడుగుల చొప్పున ఈ టౌన్‌షిప్‌లో ఇళ్లు నిర్మిస్తున్నారు.



# ఆధ్యాత్మిక సేవలో


# మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్

# 40 సంవత్సరాలు పూర్తి







-ఉమ్మడి జిల్లా సిగలో ఇస్లామిక్ విద్య విప్లవానికి 1985లో నాంది

కరీంనగర్‌లో నాడు 30మంది విద్యార్థులతో మొదలై.. నేడు 300మంది విద్యార్థులతో మదర్సా ప్రస్థానం

ఇప్పటివరకు మదర్సా నుండి హాఫిజే ఖురాన్, ఆలిం కోర్సు పూర్తిచేసి పట్టాలు పొందిన 300మంది పైచిలుకు బాల, బాలికలు

-నాడు దివంగత హాఫిజ్ రహీముద్దీన్ నియాజీ పట్టుదలతో మదర్సాకు బీజం

నేడు ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ కృషితో, విశిష్ట సేవలతో మదర్సా విస్తరణ

-రేకుర్తిలో హాస్టల్ వసతి.. హుస్సేనీపురలో డే స్కాలర్..బాలికల కోసం ఇస్లాహుల్ బనాత్ మూడు విభాగాల ఏర్పాటు

- మదర్సా నిర్వహణకు, ఇస్లామిక్ సేవా కార్యక్రమాలకు ఇతోధికంగా దాతలు విరాళాలతో ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి...



ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్
ప్రిన్సిపల్, కరస్పాండెంట్
మదర్సా అరబియా
హిఫ్జుల్ ఖురాన్ రేకుర్తి కరీంనగర్








గడచిన నాలుగు దశాబ్దాల క్రితం కరీంనగర్ పట్టణంలో కేవలం 20కి మించని మస్జిద్ లు ఉండేవి. కేవలం ఈ మస్జిదులలోనే ముస్లిం బాల, బాలికలు ఇస్లామిక్, అరబిక్ విద్యను, ఖురాన్ పఠనాన్ని, ఉర్దూను మస్జిదులలోని ఇమామ్ ల ద్వారా నేర్చుకునే వారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ కు ఎంతో ప్రత్యేకత ఉన్నప్పటికీ అరబిక్ విద్యను నేర్చుకోవడానికి ప్రత్యేక మదర్సా లేకపోవడంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ముస్లింలు తమ పిల్లలకు ఇస్లామిక్ విద్యను నేర్పించాలని తపనతో హైదరాబాద్ లేదా వరంగల్ తీసుకువెళ్లి చదివించే పరిస్థితి నాడు ఉండేది. అటువంటి క్లిష్టమైన పరిస్థితిలో ఆదిలాబాద్ నుండి కరీంనగర్ కు మస్జిద్ ఇమామత్ చేయడం కోసం వచ్చిన హాఫిజ్ రహీముద్దీన్ నియాజీ సాబ్ కరీంనగర్ పట్టణంలో 1985లో సవారన్ స్ట్రీట్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మొట్టమొదటి సారి ఇస్లామిక్ మదర్సాను స్థాపించి, ప్రత్యేక అరబిక్ స్కూల్ కోసం ముస్లిం బాల, బాలికల సౌకర్యార్థం అంకురార్పణ గావించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా సిగలో హాఫిజ్ రహీముద్దీన్ నియాజీ అలుపెరగని సంకల్పంతో, నాడు కేవలం 30 మంది విద్యార్థులతో మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ ప్రస్థానం... దిన దినాన అభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 300మంది బాల, బాలికలు హిఫ్జ్ ఖురాన్, నాజిరా ఖురాన్, షోబే ఆలిమియత్, షోబే దీనియాత్ కోర్సులను పేద మధ్యతరగతి విద్యార్థులు అభ్యసిస్తున్నారు. కేవలం అరబిక్ విద్యకే పరిమితం కాకుండా పాటు తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సబ్జెక్టులను బోధిస్తూ, టైలరింగ్, కంప్యూటర్ కోర్సుల వంటి సాంకేతిక విద్యను సైతం విద్యార్థుల భవిష్యత్తు కోసం నేర్పిస్తున్నారు. 2001లో హాఫిజ్ రహీముద్దీన్ నియాజీ ఆకస్మిక మరణం చెందాక, జామియా నాజీముద్దీన్ లో ముఫ్తి కోర్సు పూర్తి చేసిన ఆయన అల్లుడైన ముఫ్తి మహమ్మద్ ఖియాస్ మొహియుద్దీన్, కర్తవ్య బాధ్యతతో అకుంఠిత శ్రమతో, నేడు ఉత్తమమైన ఫలితాలను సాధిస్తూ మదర్సా హిఫ్జుల్ ఖురాన్ మూడు విభాగాలుగా విస్తరించింది. గడచిన 40 సంవత్సరాల కాలంలో మదర్సా నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో 300 మందికి పైచిలుకు విద్యార్థులు హాఫిజే ఖురాన్, మదర్సా బాలికల బ్రాంచ్ అయిన ఇస్లాహుల్ బనాత్ ద్వారా సుమారు 50మందికి పైగా బాలికలు, మహిళలు హాఫిజే ఖురాన్, ఆలిం కోర్సు పూర్తిచేసి పట్టాలు పొందారు. రేకుర్తి షేక్ ఖాన్ నగర్ లో దూర ప్రాంతాల నుంచి వచ్చే గ్రామీణ విద్యార్థుల కోసం హాస్టల్ తో కూడిన రెసిడెన్షియల్ అరబిక్ స్కూల్, మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ రేకుర్తి లో నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే అత్యుత్తమ ప్రమాణాలతో, ఇస్లామిక్ అరబ్బీ విద్యను బోధిస్తూ, అనుభవజ్ఞులైన వార్డెన్ల పర్యవేక్షణలో, రుచికరమైన భోజనం అందిస్తూ, సీసీ కెమెరాల నిఘాలో, ఇంటిని మైమరిపించేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో, రెండు పెద్ద భవనాలలో, సకల సదుపాయాలతో బాలురకు హాస్టల్ వసతి కల్పించారు. నగరంలోని కార్ఖానగడ్డ ప్రాంతంలోని హుస్సేనీపురాలో పట్టణ విద్యార్థుల సౌలభ్యం కోసం డేస్కాలర్ మదర్సాను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా బాలికల కోసం ప్రత్యేకమైన ఇస్లాహుల్ బనాత్ అనే మదర్సాను సైతం హుస్సేనీపుర మదర్సా ప్రాంగణంలోనే పైఅంతస్తులో ఏర్పాటు చేశారు. ఇంతే కాకుండా గ్రామీణ ప్రాంత ముస్లింలలో ఇస్లామిక్, అరబిక్ విద్యా ప్రభావం తక్కువగా ఉండటాన్ని గుర్తించిన మదర్సా ప్రిన్సిపాల్ ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి, గ్రామీణ ప్రాంతాల్లో ఇస్లామిక్ విద్యపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో పలు రకాల పుస్తకాలను ఉర్దూ నుంచి తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అనువాదం చేయించి, ఉచితంగా ప్రతి ఏటా మదర్సా నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారు. ఇవన్నీ సేవా కార్యక్రమాలతో పాటు మదర్సా నిర్వహణ బాధ్యత మొత్తం దాతల సహకారంతో నడుస్తుందని, మదర్సా ఆవిర్భవించి 40సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో భవిష్యత్తులో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామనిమదర్సా ప్రిన్సిపాల్ ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ తెలిపారు. ఈ మదర్సా కేవలం ముస్లిం బాల బాలికలకు ఇస్లామిక్ విద్యను, అరబిక్ విద్యను అందించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఇస్లామీయ విధి విధానాలకు దూరంగా జీవితం గడుపుతున్న ముస్లింలందరినీ చేరదీసి, వారికి ఇస్లామీయ సాంప్రదాయాలపై, సంస్కృతి గురించి చక్కగా వివరిస్తూ, షరియత్ పై, అల్లాహ్ యొక్క దీన్ పై అవగాహన కల్పిస్తూ, గ్రామాల్లో అమాయక ముస్లింలు ఇస్లాం వ్యతిరేక శక్తుల ఉచ్చులో పడకుండా కంకణ బద్ధులై కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ఖాదియాని వర్గం, షకీల్ బిన్ హనీఫ్ వర్గం వంటి దుష్ట శక్తులు, ఇస్లాంకు వ్యతిరేకంగా కార్యకలాపాలు జరిపే సంస్థల బారిన పడకుండా, ఆయా గ్రామాల్లో, పల్లెల్లో నివసించే ముస్లింల ఈమాన్ విశ్వాసాన్ని రక్షించాలనే ఉక్కు సంకల్పంతో, ముఖ్యంగా మారుమూల పల్లెలో, కొండల్లో నివసించే తురక కాశి వర్గం, మూర్ భాషా వర్గాలను చేరదీసి వారికి ఇస్లామిక్ విద్యను అందించడం కోసం దీనిపై అవగాహన కల్పించడం కోసం, ఆయా గ్రామాల్లో మస్జిదులు లేనిచో తక్షణ కర్తవ్యంగా, దాతల సహకారంతో మస్జిద్ లను నిర్మాణం చేసి, అక్కడ ఒక ఇస్లామిక్ ధార్మిక ఇమామ్ సాబ్ ను నియమించి, అతడికి నెలనెలా జీతాలను మదర్సా ద్వారా సమకూరుస్తూ, గ్రామీణ ముస్లింల పిల్లల కోసం, ఇస్లామిక్ విద్యను చదివే వారికి ఉచితంగా పుస్తకాలను అందిస్తూ, సాంప్రదాయ దుస్తులను అందిస్తూ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో మారుమూల పల్లెల్లో మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ విజయవంతంగా గడచిన 19సంవత్సరాలుగా అలుపెరగకుండా శ్రమిస్తూ ముందుకు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలకు ఇస్లామిక్ జీవన విధానాలపై అవగాహన కల్పిస్తూ, షరియత్ కు సంబంధించిన పలు అంశాలపై చైతన్య పరుస్తూ, ఇస్లామీయ జీవన విధానాలను వారికి కృషి పట్టుదలతో వివరిస్తూ, వారిలో దైవభీతిని కల్పిస్తూ, మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ ఎవరి తరం కానీ విధంగా ముందడుగు వేసి విజయం సాధించింది. నేడు ఆయా మారుమూల పల్లెలో మదర్సా హిఫ్జుల్ ఖురాన్ చేసిన కృషి ఫలితంగా ఇస్లామిక్ జీవన విధానాలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుని, వారిలో ఇస్లామీయ జీవనశైలిని పెంపొందించడంలో గడచిన రెండు దశాబ్దాలుగా విశిష్టమైన ఘనకీర్తిని సొంతం చేసుకుంది. ఈమదర్సా కేవలం ముస్లిం పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడమే కాదు, ఉమ్మడి జిల్లాలోని ముస్లిం సమాజ అభివృద్ధి కోసం, సాంప్రదాయ సంస్కృతిని పెంపొందించడం కోసం అలుపెరగకుండా, అవిశ్రాంతమైన, విప్లవాత్మక సేవలను అందించడం అతిశయోక్తి కాదు. ఇంత గొప్ప గురుతరమైన బాధ్యతతో మదర్స హిఫ్జుల్ ఖురాన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ముస్లిం సమాజంపై తన సేవలను విస్తరించి చెరగని ముద్ర వేసుకుంది. సుసంపన్నమైన ఘన కీర్తిని మూటగట్టుకుంది. ఇంత పెద్ద మొత్తంలో మదర్సా హిఫ్జుల్ ఖురాన్ పనిచేస్తుందంటే, ఇంతగొప్పగా సేవలను విస్తరించి ఇస్లామియా సాంప్రదాయాల కోసం ముందడుగు వేస్తుందంటే, జకాత్, సద్ ఖాత్, అతియాత్, ఫిత్రా ద్వారా దాతలు పెద్ద ఎత్తున స్పందించి విరాళాలు అందించాలని మదర్సా బాధ్యులు ముఫ్తి ఖియాస్ మొహియొద్దీన్, ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఇస్లామిక్ జీవనశైలిని పెంపొందించడంలో, పేద ముస్లింల పిల్లలకు విద్య ప్రమాణాలను పెంచడంలో, మిగతా సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం దాతలు అందించే ప్రతి రూపాయి (సి.ఎ) చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా ఆడిట్ జరుగుతుందని,ఈపవిత్రమైన రంజాన్ మాసంలో ఈ సేవా కార్యక్రమాలకు కొనసాగింపు కోసం ఇతోధికంగా మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ కు ఆర్థిక సాయం దాతలు విరివిగా అందించాలని 40సంవత్సరాల నుండి నిరంతరాయంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధార్మిక సేవలు అందిస్తున్న ఏకైక ఇస్లామిక్ విద్యా సంస్థ ఇప్పటి వరకు 300మందికి పైచిలుకు యువకులు, బాలురు, బాలికలు హిఫ్జ్ ఖురాన్ ను, ఆలిం కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. బాలికలకు ప్రత్యేకంగా హిఫ్జ్ ఖురాన్, ఆలిం కోర్స్ కొరకు పట్టణం లోని హుస్సేనీపురాలో " మదర్సా ఇస్లాహుల్ బనాత్ ఏర్పాటు చేయబడింది ",యాభై కు పైగా గ్రామాలలో మదర్సా ద్వారా మస్జిద్ లను నిర్మాణం చేయడం జరిగింది, ఈనిర్మాణం చేసిన మస్జిద్ లలో ఇమామ్ లను నియమించి, గ్రామీణ ప్రాంత పిల్లలకు ఇస్లామియ బోధనలు %ం% అరబిక్ విద్య నేర్పించటకు వారికి జీతాలు మదర్సా నుండి సమకూర్చడం జరుగుతోంది,తెలుగు భాషలో ఇస్లాం యొక్క ప్రాథమిక సాహిత్యాన్ని అనువదించి రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా అందించడం జరుగుతుంది, ఇవన్నీ కార్యక్రమాల నిర్వహణ, మదర్సా నిర్వహణ ఖర్చులు ప్రతి సంవత్సరం 40 లక్షలు దాటుతోంది, ఈ పవిత్రమైన రంజాన్ మాసం లో మీకు సంబంధించిన, మీ బంధువులకు సంబంధించిన జకాత్, సద్ ఖాత్, డొనేషన్స్ ఎక్కువ మొత్తంలో మదర్సా తరపున నిర్వహింపబడుతున్న ఈ సేవా కార్యక్రమాల కోసం పెద్ద ఎత్తున స్పందించి ఆర్థిక సాయం అందించగలరని మనస్ఫూర్తిగా ఇస్లాం సేవలో ఈపేద పిల్లలను చదివించే బృహత్తర యజ్ఞంలో, గ్రామీణ ప్రాంత ముస్లింల ఈమాన్ విశ్వాసాన్ని కాపాడే అంశంలో మీరు కూడా భాగస్వామ్యం కాగలరని విజ్ఞప్తి. 9346355306,9391647031మరింత సమాచారం కోసం సంప్రదించండి...దాతలు సాయం చేయాల్సిన

**ఫోన్ పే.. గూగుల్ పే నెంబర్లు... 9346355306, 9391637031**

-వ్యాసకర్త, మహమ్మద్ రఫీ
జర్నలిస్ట్..టీయుడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు
పూర్వ విద్యార్థి మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ రేకుర్తి కరీంనగర్

చురకలు


## సంపాదకీయం

### తమిళ కమలంలో మళ్లీ రెండు ఆకులు..

# పొత్తు తప్పదు మరి!

2026లో తమిళనాడు ఎదుర్కోనున్న ఎన్నికలు చాలా కీలకం. ఓవైపు రెండోసారి సీఎం కావాలని డీఎంకే స్టాలిన్.. మరోవైపు అధినేత్రి జయలలిత లేకున్నా తమ పార్టీకి తిరుగులేదని అన్నాడీకేఎం.. ఇంకోవైపు విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న హీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ.. వీటి మధ్యనే తమ లక్ ను పరీక్షించుకునే జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్.. చివరగా కొన్ని ప్రాంతీయ పార్టీలు.. వామపక్షాలు. అందుకే తమిళ రాజకీయం అంటే భలే ఆసక్తికరంగా ఉంటుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఇది మరింత రంజుగా సాగనుంది. స్టాలిన్ వయసు రీత్యా చూసినా.. టీవీకే విజయ్ స్టామినా చాటలన్నా.. అన్నాడీఎంకే మళ్లీ ఉనికి చూపాలన్నా.. ఈ ఎన్నికలే ప్రామాణికం. దీంతో హిందీ వ్యతిరేకత ప్రామాణికంగా భాషాపరమైన భావోద్వేగం ఆధారంగా స్టాలిన్ ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. విజయ్ మాత్రం తనకో చాన్స్ అంటున్నారు. మరి అన్నాడీఎంకే పరిస్థితి? త్రిముఖ పోటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి అన్నాడీఎంకే మళ్లీ బీజేపీకి దగ్గరవుతోంది. కమలం పార్టీకి ఆకు గుర్తు ఉన్న అన్నాడీఎంకే చేరువవడం అంటే కీలక పరిణామమే. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఢిల్లీ వెళ్లి కేంద్ర హెూం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షాతో భే 40 నిమిషాలకు పైగా భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల వ్యూహ రచనే వీరి భేటీ ప్రధాన అంశం అయి ఉంటుందనడంలో సందేహం లేదు. దీంతో మళ్లీ పొత్తు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమిలో మళ్లీ క్రియాశీలం అవుతామని.. పళనిస్వామి ఆసక్తి చూపించారని సమాచారం. దీనికిముందు తమిళనాడు బీజేపీ నాయకత్వంతోనూ చర్చలు జరిపి సానుకూలత పొందారు. వాస్తవానికి బీజేపీతో పొత్తు పళనిస్వామికి ఇష్టం లేదు. కానీ పార్టీ మనుగడ కష్టంగా మారడం.. విజయ్ రూపంలో ముప్పు పొంచి ఉండడం, బీజేపీ హైకమాండ్ ప్రభావం అన్నిటికి మించి స్టాలిన్ దక్షిణాదిలో బీజేపీ వ్యతిరేక కూటమి నేతగా ఎదగడంతో ఆయన పునరాలోచనలో పడ్డారు. కాస్త వెనక్కుతగ్గి కొన్ని డిమాండ్లను ప్రస్తావించి వాటిని పరిష్కరిస్తే అన్నాడీఎంకే–బీజేపీ పొత్తుకు ఓకే చెప్పారట. ఈ షరతుల్లో ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలైకు ప్రాధాన్యం తగ్గించడం, జయ బంధువు టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం వంటి తిరుగుబాటుదారులతో బీజేపీ సంబంధాలు పెట్టుకోవద్దనడం వంటివి ఉన్నాయని తెలుస్తోంది. అయినా.. కర్ణాటక కేడర్ మాజీ ఐపీఎల్ అన్నామలై ప్రాధాన్యతను తగ్గించడానికి బీజేపీ అంగీకరిస్తుందా?

# తెలుగు సినీ రంగ అగ్ర నటుడు చిత్తూరు నాగయ్య - మార్చి 28...చిత్తూరు నాగయ్య జయంతి



చిత్తూరు నాగయ్య (1896 – 1973) తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిన మహా నటుడు. భక్తి ప్రధాన పాత్రలు, చారిత్రక, సామాజిక పాత్రల్లో ఆయన అపూర్వమైన ప్రతిభను కనబరిచారు. నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన తెలుగు నాట అగ్రశ్రేణి కళాకారుడిగా గుర్తింపు పొందారు. చిత్తూరు నాగయ్య 1896 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా, రేపల్లె గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య శర్మ. చిన్ననాట నుండే నాటకాలపై ఆసక్తి పెంచుకున్న నాగయ్య, విద్యాభ్యాసం పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగం చేపట్టారు. అయితే, ఆయన హృదయం కళలపైనే ఆసక్తిగా ఉండడంతో, ఉద్యోగాన్ని వదిలేసి నాటక రంగంలో ప్రవేశించారు. సంగీతంపై గాఢమైన ప్రేమ ఉండటంతో కర్ణాటక సంగీతం లో శిక్షణ తీసుకున్నారు. నాగయ్య తన నటనా ప్రస్థానాన్ని నాటకాల ద్వారా ప్రారంభించారు. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బిల్లా – రంగనాథం వంటి నాటకాలలో ఆయన అద్భుతంగా నటించి, ప్రేక్షకుల అభిమానం పొందారు. ఆయన భావ ప్రదర్శన, సంభాషణా నైపుణ్యం, సంగీత ప్రతిభ నటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నాటక రంగంలో అందరినీ ఆకట్టుకున్న నాగయ్య, సినిమాల వైపు మళ్ళారు. 1937లో "గృహలక్ష్మి" చిత్రంతో నాగయ్య సినీ రంగంలో అడుగు పెట్టారు. ఈ సినిమా ఆయనకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆయన ప్రధానంగా పౌరాణిక, భక్తి ప్రధాన, చారిత్రక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి, తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే స్థాయికి ఎదిగారు. నాగయ్య నటించిన కొన్ని అత్యంత ప్రఖ్యాత చిత్రాలలో...భక్త పోతన (1942)లో %–% పోతనగా ఆయన నటన అపురూపం, త్యాగయ్య (1946)లో త్యాగరాజ స్వామిగా ఆయన జీవించేసినంత గొప్ప నటన, శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం (1939)లో శ్రీవేంకటేశ్వరునిగా విశిష్టమైన నటన మరపు రానివి.

అలాగే భక్త రామదాసు (1943)లో భక్త రామదాసుగా నటించి ప్రేక్షకుల గుండెల్లో నిలిచి పోయారు. యోగి వేమన (1947)లో యోగి వేమన పాత్రలో అద్భుతమైన అభినయం చూపారు. స్వర్గసీమ (1945)లో సామాజిక చిత్రంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించారు. మల్లీశ్వరి (1951)లో ముఖ్యపాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించారు. దేవదాసు (1953)లో కీలకపాత్ర పోషించి ప్రేక్షకులను అలరించారు."త్యాగయ్య" చిత్రం జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందింది. ఇది భారతీయ సినీ చరిత్రలో తొలి జీవిత చరిత్ర (బయోపిక్) సినిమా గా చరిత్ర సృష్టించింది. నాగయ్య గొప్ప గాయకుడు కూడా. ఆయన తన సినిమాల్లో చాలా పాటలు స్వయంగా పాడేవారు. ముఖ్యంగా భక్తి గీతాలు, కీర్తనలు ఆయన గొంతులో అద్భుతంగా ప్రతి ధ్వనించేవి. నాగయ్య నటుడిగా మాత్రమే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా గుర్తింపు పొందారు. ఆయన స్వీయ దర్శక త్వంలో "త్యాగయ్య" సినిమాను నిర్మించి, జాతీయ అవార్డు గెలుచు కున్నారు. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో సంగీత కారుల జీవితాలను ఆధారంగా తీసుకుని నిర్మించిన తొలి చిత్రం. సినిమారంగంలో గొప్ప స్థాయికి ఎదిగిన నాగయ్య, జీవితాంతం కళారంగానికి అంకిత మయ్యారు. అయితే, జీవితాంతం సినిమా రంగానికే అంకితమై ఉన్నా, చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ 1973 డిసెంబర్ 30న, చెన్నైలో మరణించారు. తెలుగు సినిమాకు భక్తి రస ప్రధాన పాత్రలలో మూడో కన్నుగా నిలిచారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ నటుల్లో ఒకరు. సినిమా ద్వారా సంగీతాన్ని ప్రజలకు చేరువ చేశారు. నేటికీ ఆయన నటన, గానం మనసులో నిలిచేలా ఉంటుంది. చిత్తూరు నాగయ్య తెలుగులో తొలి మహా నటుల్లో ఒకరు. భక్తి ప్రధానమైన పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆయన, సినీ రంగంలో తనదైన సుస్థిరమైన స్థానం సంపాదించారు. నటన, సంగీతం, దర్శకత్వం, నిర్మాణం – ఇలా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**


# జర్నలిస్టులకు మార్గదర్శి కేశవ పిళ్ళై - మార్చి 28...పట్టు కేశవ పిళ్ళై వర్ధంతి

దీవాన్ బహదూర్ పట్టు కేశవ పిళ్ళై (అక్టోబరు 8, 1860 – మార్చి 28, 1933) భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు. పట్టు కేశవపిళ్లే తమిళనాడు లోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో వేంకటాచలం, సుబ్బమ్మ దంపతులకు 1860, అక్టోబరు 8వ తేదీన జన్మించాడు. మద్రాసులో ఇతని విద్యాభ్యాసం జరిగింది. ఆయన హిందూ పత్రికలో విలేఖరిగా తన వృత్తిని ఆరంభించాడు. అనంతపురం జిల్లా, గుత్తిలో కరెస్పాండెంటుగా ఆయన 1883లో తన 22వ యేట నియమించ బడ్డాడు. గుత్తిలో స్థిరపడటం వలన పట్టు కేశవపిళ్లెను ప్రజలు "గుత్తి కేశవపిళ్లె"గా పిలువ సాగారు. 1893, అక్టోబర్ 4వ తేదీన బ్రిటిష్ సైనికుల అత్యాచారం నుండి యిద్దరు హిందూ మహిళలను రక్షించే క్రమంలో, గుత్తిలోని రైలుగేటు కీపర్ గూళిపాలెం హంపన్న ప్రాణాలొడ్డాడు. ఈ సంఘటనలో బ్రిటిష్ సైనికులు హంపన్నను కాల్చి చంపారు. ఈ సంఘటన గురించి గుత్తి కేశవపిళ్లే హిందూ పత్రికకు వార్త పంపగా అది ప్రముఖంగా ప్రచురింపబడింది. ఈ వృత్తాంత మంతా హిందూ పత్రికలో రావడంతో ఇంగ్లీషు వారు ఆంగ్లేయులకు ఏర్పరిచిన ప్రత్యేకమైన ప్రతిపత్తులతో కూడిన కోర్టులో విచారణ జరిపించారు. అప్పట్లో కేశవపిళ్లే గుత్తిలో సెకెండ్ గ్రేడ్ ప్లీడర్‌గా ప్రాక్టీసు చేసేవాడు. ఈ సంఘటన గురించి బ్రిటిష్ సైనికులకు వ్యతిరేకంగా వాదించాడు. అక్కడ ఉన్న జ్యూరీ వారిలో అధికభాగం ఆంగ్లేయులు, మిగిలిన కొందరు వారిపై జీవనము ఆధారపడిన దుబాసీలు. కోర్టులో ఆ స్త్రీలు వ్యభిచారులని, హంపన్న వ్యభిచరింప జేసే వ్యాపారియని వ్యభిచారం విషయంలో డబ్బు ఎక్కువ తక్కువల్లో తమను కొట్టవచ్చాడని, ఆత్మరక్షణార్థం తాము కాల్చామని వాదించారు. వాదనలు నడుస్తూండగానే ఈ కేసుకు వ్యతిరేకంగా హిందూ పత్రికలో చాలా వార్తలు, అభిప్రాయాలు వచ్చాయి. చివరకు ఈ కేసులో వ్యభిచార వ్యవహారంలో తేడా రావడంతోనే ఈ ఘటన జరిగిందని, హంపన్న అమాయకుడేమీ కాదన్న వ్యాఖ్యలు చేస్తూ ఈ నేపథ్యంలో ఆంగ్ల సైనికుల దోషం ఏమీ లేదని తేల్చి, నిర్దోషులుగా విడిచి పెట్టాయి. ఇది జాత్యహంకారానికి ఉదాహరణ అంటూ హిందూ దినపత్రిక తీవ్రంగా ఖండించింది. స్థానికులు వీరుడైన హంపన్నపై ఇటువంటి ఘోరారోపణ చేయడాన్ని సహించలేక ఓ స్మారక చిహ్నం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనికి హిందూ పత్రిక సహకరించి, తమ పత్రిక ద్వారా విరాళాల కోసం ప్రయత్నాలు సాగించింది. గ్రామస్థులు, హిందూపత్రికవారూ విరాళాలిచ్చిన దాతల సహకారంతో హంపన్న స్మారక చిహ్నాన్ని నిర్మించారు. స్మారక సంఘం వారు స్మారక చిహ్నం నిర్మాణానికి తొమ్మిది చదరపు టడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి, దానిపై ఏడడుగుల ఎత్తుగల రాతిస్తంభం నిలబెట్టి, దానికి ఓ స్మారక ఫలకాన్ని వ్రాయించి పెట్టారు. చుట్టూ ఆవరణ గోడ కూడా కట్టించారు. ఆ శిలాఫలకంపై ఆంగ్లంలో ఈ క్రింది విధంగా చెక్కారు. "Here lie the remains of Goolapalien Hampanna, the Gate keeper, who while defending two Hindu women against a party of European soldiers near the Guntakkal rest camp was shot by one of them on October 4, 1893. He died here on October 5. Raised by European and Indian admirers" స్మారకచిహ్నం ఏర్పాటు, తమకు అవమాన కరమని కొందరు బ్రిటీష్ అధికారులకు తోచి, స్థల విక్రయం రద్దుచేయాలని ప్రయత్నించారు. కాని వ్రాయించిన దస్తావేజు విస్పష్టముగా నుండడం, దానిలో కూడా స్థలం కొనుగోలు స్మారక చిహ్నం నెలకొల్పేందుకే నన్న సంగతి వ్రాసి వుండడం కారణాలతో ఏమీ చేయలేక పోయారు. డిప్యూటీ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ అయిన లెగ్గట్ ఈ స్మారక చిహ్నాన్ని చూసి చాలా ఆగ్రహించారు. దీనిని ఎలాగైనా తొలగించాలని సిఫారసు చేస్తూ చెన్నపట్టణ ప్రభుత్వం వారికి వ్రాశారు. గుత్తి విలేఖరి యైన కేశవపిళ్లైపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని ప్రయత్నాలు చేశారు. ఐతే ఇవేవీ జరగలేదు. మద్రాసు గవర్నర్ వెన్లక్ ప్రభుత్వం హంపన్న స్మారక చిహ్నం ఏమీ చేయరాదన్న ఉత్తర్వు చేసింది. ఈ సంఘటనతో హంపన్నతో పాటుగా గుత్తి కేశవపిళ్లే కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాడు. హంపన్న వృత్తాంతంతో ఆయనను స్థానిక ప్రభుత్వం గుర్తించి అనంతపురం, కర్నూలు, బళ్ళారి జిల్లాలకు జిల్లా బోర్డు సభ్యుడిని చేసింది. 1916–17లో ఇతడు కాంగ్రెస్ సభ్యునిగా చురుగ్గా పని చేశాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా ఎన్నుకో బడ్డాడు. ఆయన గుత్తి తాలూకా బోర్డు ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. మద్రాసు ఫారెస్ట్ సభ్యుడిగా సేవలను అందించాడు. శ్రీలంకలోని భారతీయ వర్తకుల కోరిక మేరకు అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను సమర్పించాడు. 1885లో బొంబాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ప్రథమ మహాసభకు అయన హాజరయ్యాడు. కేశవ పిళ్ళై గుత్తి నగరపాలికకు ఎన్నికై, నగర పాలిక సభ్యుడుగా పనిచేశాడు. చివరకు ఆయన నగర పాలికలకు ప్రాతినిధ్యం వహించడానికి మద్రాసు శాసన మండలికి ఎన్నికయ్యాడు. కేశవ పిళ్ళై తన తొలినాటి నుండి రాజకీయాల్లో ఆసక్తి చూపాడు. 1885, డిసెంబరు 28న బొంబాయిలో జరిగిన తొలి భారత జాతీయ కాంగ్రేసు సమావేశంలో, గుత్తి పట్టణ ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత



గౌరవనీయులగు గుత్తి కేశవపిళ్ళగారు.


మరింత తీవ్రవాద పద్ధతులను అవలంబించి కొన్నిసార్లు జైలుకు కూడా వెళ్ళాడు. ఆయన జస్టిస్ పార్టీని, ద్రవిడ ఉద్యమాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. కేశవ పిళ్ళై మద్రాసు శాసన మండలిలో చాలాకాలం పాటు పనిచేశాడు. సభలో అనేక సంస్కరణా ప్రతిపాదనలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుంది. పానగల్ రాజా ప్రభుత్వం ఆమోదించిన జైలు మార్గదర్శకాలు, జైలు కమిషన్ యొక్క ప్రధాన రచయిత పిళ్ళై. మద్రాసు అటవీ కమిషన్ సృష్టికర్త కూడా ఆయనే. ఆ తర్వాత కేశవ పిళ్ళై శాసనమండలి ఉపాధ్యక్షుడిగా కూడా ఎన్నికై, ఆ హెూదాలో కొంతకాలం పని చేశాడు. ఆయన సేవా దృక్పథాన్ని గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఇతడిని రావు బహద్దూర్ బిరుదుతో సత్కరించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం 2,000 వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేసినట్లు బుధవారం ప్రకటించింది. మోసపూరిత కార్యకలాపాలతో సంబంధం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెప్పింది. అపాయింట్‌మెంట్ వ్యవస్థలో ఓ భారీ లోపాన్ని గుర్తించినట్లు దౌత్య కార్యాలయం వెల్లడించింది. ఇవి మొత్తం 'బాట్స్' ద్వారా వచ్చినట్లు గుర్తించామని పేర్కొంది. ఈ విషయాన్ని ఎక్స్ పోస్టులో పేర్కొంది. "బాట్స్ చేసిన 2,000 వీసా అపాయింట్‌మెంట్స్ భారత్‌లో కాన్సులర్ బృందం రద్దు చేస్తోంది. మా షెడ్యూలింగ్ విధానాలను ప్రభావితం చేసే ఏజెంట్స్, ఫిక్సర్లను ఏమాత్రం సహించం. ఈ అపాయింట్‌మెంట్లను రద్దు చేయడంతోపాటు.. అనుబంధ ఖాతాలకు షెడ్యూలింగ్ అధికారాలను సస్పెండ్ చేస్తున్నాం. మోసాల నిర్మూలనకు మా ప్రయత్నాలు కొనసాగుతాయి.

వాటిని ఏమాత్రం సహించం" అని ఆ పోస్టులో పేర్కొంది. అమెరికా బిజినెస్, విజిటర్స్, బీ1, బీ2, స్టూడెంట్ వీసాలకు అపాయింట్‌మెంట్ల కోసం సుదీర్ఘ సమయం వెయిటింగ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ, ఏజెంట్లకు డబ్బులు చెల్లిస్తే మాత్రం కేవలం నెల రోజుల్లోనే అపాయింట్‌మెంట్లు దొరకడం పర్యటక రంగంలో సర్వసాధారణం. ఇందుకోసం ఒక్కో వీసా దరఖాస్తుదారుడి నుంచి రూ.30,000 నుంచి రూ.35,000 వరకు ఏజెంట్లు వసూలు చేస్తారు. తమ కుమారుడు అమెరికాలోని విశ్వవిద్యాలయంలో చేరడానికి సొంతంగా వీసా అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించగా అది సాధ్యం కాలేదని, అదే ఏజెంటుకు రూ.30వేలు చెల్లిస్తే వెంటనే వచ్చిందని ఓ వ్యక్తి ఆంగ్ల వార్తా పత్రికకు వెల్లడించాడు.

సాధారణంగా వీసా దరఖాస్తుదారుడు సొంతంగా అప్లికేషన్ పంపిస్తే.. సమీప భవిష్యత్తులో అపాయింట్‌మెంట్ డేట్లు లభించవు. కానీ, ఏజెంట్లు కొన్నిరకాల ప్రత్యేకమైన బాట్స్‌ను వినియోగించి స్లాట్లను బ్లాక్ చేస్తారు. 2023లో బీ1, బీ2 అపాయింట్‌మెంట్ల 999 రోజుల మార్కును చూపించింది. దీంతో భారతీయ దరఖాస్తుదారుల కోసం ఫ్రాంక్‌ఫర్ట్, బ్యాంకాక్, ఇతర ప్రదేశాల్లో అమెరికా అపాయింట్‌మెంట్లను తెరవాల్సి వచ్చింది. దాదాపు మూడేళ్ల క్రితం వీసా వెయిట్ సమయం చాలా ఎక్కువగా ఉన్న విషయాన్ని భారత్ ప్రభుత్వం అమెరికా దృష్టికి తీసుకెళ్లింది. దీనిని సీరియస్‌గా తీసుకొన్న అమెరికా ప్రభుత్వం వెయిటింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించింది. తాజాగా ఇప్పుడు బాట్స్ వినియోగాన్ని అడ్డుకోవడంపై దృష్టిపెట్టింది.




ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మైసూరు క్యాంపస్‌లోని ట్రైనీలను తొలగించినట్లు తెలుస్తోంది. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 40–45 మంది ట్రైనీలను తొలగిస్తూ ఈమెయిల్స్ పంపినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. "ఫైనల్ అసెస్‌మెంట్‌లో సరిగ్గా రాణించనందున ఫౌండేషన్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద అర్హతను సాధించలేకపోయారు. దీంతో అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్‌లో మీ ప్రయాణాన్ని కొనసాగించలేరు" అంటూ ట్రైనీలకు మెయిల్స్ పంపింది. అయితే ఇలా లేఆఫ్‌కు గురైన విద్యార్థులకు ఇన్ఫోసిస్ మరో అవకాశం ఇచ్చింది. వీరందరికీ కౌన్సిలింగ్ సపోర్ట్‌తో పాటు ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాన్ని అందించాలని చూస్తోంది. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ నియామకాల కోసం 12 వారాల పాటు శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణ పూర్తిచేసిన వారందరికీ ఇన్ఫోసిస్ బీపీఎం లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశం కల్పించనుంది. లేఆఫ్ ఎదుర్కొన్న ట్రైనీలకు రిలీవింగ్ లెటర్‌తో పాటూ ఒక నెల ఎక్స్‌గ్రేషియో ఇవ్వనుంది.

అయితే ఈ విషయాన్ని కంపెనీ ధ్రువీకరించలేదు. ఇదిలాఉండగా.. ఫ్రెషర్ల నియామకాల విషయంలో ఇన్ఫోసిస్ చాలాకాలంగా విమర్శలు ఎదుర్కొంటోంది. గత నెలలో వరుస ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ బలవంతపు లేఆఫ్‌లపై ట్రైనీలు పీఎంఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

చురకలు



# తగ్గిన నీటి లభ్యత.. పెరిగిన వినియోగం

పెద్దపల్లి : జిల్లాలో జల సిరులు ఉట్టి పడుతున్నాయి. వ్యవసాయం, పరిశ్రమలకు నీటిని తోడేస్తున్నా నీటి లభ్యత కాస్త మెరుగ్గానే ఉంది. జిల్లాలోని భూగర్భ జలాల లభ్యత ఎంత? వినియోగం, భవిష్యత్ తరాలకు ఎంత అవసరం అనే అంశాలపై భూగర్భ జల శాఖ 2023-24 ఏడాదికి సంబంధించి క్షేత్ర స్థాయిలోకి వెళ్లి నివేదిక రూపొందించింది. గతేడాదితో పోల్చితే భూగర్భ జలాల లభ్యత స్వల్పంగా తగ్గగా వినియోగం పెరిగింది. జిల్లాలోని 14 మండలాల్లో మంథనిలో 75 శాతంతో అధికం, ధర్మారంలో 35 శాతంతో అత్యల్పంగా నమోదైంది.

**ఇలా లెక్కిస్తారు**

భూగర్భ జల శాఖ భూగర్భంలోకి వచ్చే నీరు ఎంత? వినియోగం ఎంత అనే విషయాలను సేకరించింది.

14 ఏళ్ల వర్షపాతం, ఆనకట్టలు, చెరువులు, కుంటలు, జలాశయాల్లోని నీటి లభ్యతను లెక్కిస్తారుబోర్లు, బావులు, పరిశ్రమలు, తాగునీటికి ఎంత వాడుతున్నారో నమోదు చేస్తారు

అవసరాలకు ఎంత జలం ఖర్చు, మిగులు జలం ఎంత నిర్ధారిస్తారు



వ్యవసాయానికి అధికంగా వాడకం

జిల్లాలో 44,755 హెక్టా మీటర్లలో భూగర్భ జలాలు లభ్యం కాగా 20,311 హె.మీ నీరు ఖర్చువుతోంది. ఇందులో 17,608 హె.మీ సాగు కోసం వినియోగిస్తున్నారు. మానేరు, గోదావరి, హుస్సేన్‌మియా పరీవాహక ప్రాంతాల్లో బోర్ల సాయంతో నీటిని వాడుతున్నారు. 1,190 హె.మీ గృహ అవసరాలు, 1,512 హె.మీ పరిశ్రమలకు వినియోగిస్తున్నారు. గతేడాది గృహ అవసరాలకు 931 హె.మీ, పరిశ్రమలకు 795 హె.మీ, వ్యవసాయానికి 17,495 హె.మీ అంటే మూడు రంగాల్లో అధికంగా నమోదైంది.

**మంథనిలో సమస్యాత్మకం**

భూగర్భ నీటి లభ్యత ఆధారంగా వందలో 70 శాతంలోపు వాడకం ఉంటే సురక్షితం, 70-90 సమస్యాత్మకం, 90-100 అతి సమస్యాత్మకం, వంద శాతం వినియోగం దాటితే అత్యధిక వినియోగ జాబితాలో ఉంటుంది. జిల్లాలోని మంథని 75 శాతంతో సమస్యాత్మకంగా ఉంది. గోదావరి పరీవాహక ప్రాంతమైన మంథనిలో నీటిని అవసరాలకు మించి తోడేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. సమస్యాత్మక ప్రాంతాల్లో బోర్ల నిషేధం, వాటర్‌షెడ్ వంటి చైతన్య కార్యక్రమాలు చేయడంతో జిల్లాలో భూగర్భ జలాలు వృద్ధిలోకి రావడం ఊరటనిస్తోంది.

# మాడ వీధుల విస్తరణకు వేళాయె..

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం మాడవీధుల విస్తరణకు అడ్డంకులు తొలగాయి. రూ.60.20 కోట్లను మంజూరు చేస్తున్నట్లు కొద్ది నెలల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించటంతో నిర్వాసితులతో అధికారులు పలు దఫాలు చర్చలు జరిపారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సర్వే పూర్తిచేశారు. సుమారు 46 కుటుంబాలకు పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. మాడవీధులకు అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగించి గృహ యజమానులకు పరిహారం ఇచ్చేందుకు లెక్కలు కట్టారు. గరిష్ఠంగా సుమారు రూ. 3కోట్లు, కనిష్ఠంగా రూ.కోటి వరకు పరిహారం అందించాల్సి ఉంటుందని సమాచారం. నిర్వాసితులకు బ్రిడ్జి సెంటర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని అప్పగించి అందులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇదే రూ.60.20 కోట్లలోని కొంత మొత్తాన్ని వెచ్చించనున్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష**

ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైన నిధులు త్వరలో అధికారిక



ఖాతాలో జమకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, దేవాదాయశాఖ కొండా సురేఖ సమక్షంలో దేవాదాయశాఖ అధికారులు హైదరాబాద్‌లో ఆదివారం సమావేశమైనప్పుడు ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించి నిధులు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. శ్రీరామనవమికి ముఖ్యమంత్రి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చి అదేరోజు మాడవీధుల విస్తరణ పనులు ప్రారంభిస్తారని ఇక్కడి అధికారులకు మౌఖికంగా సమాచారం అందింది. నిర్వాసితుల్లో ఇంకెవరికైనా అభ్యంతరాలు ఉంటే వారితో ఆర్డీఓ దామోదర్‌రావు సమావేశమై ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించనున్నారు. మాడవీధుల విస్తరణ పూర్తయితే రామాలయ బృహత్తర ప్రణాళికకు రూ.వందల కోట్ల నిధులను ప్రభుత్వం సమకూర్చనుందని సమాచారం. ఇదే జరిగితే దక్షిణ అయోధ్య భద్రాచలం కూడా యాదగిరిగుట్ట తరహాలో అభివృద్ధి చెందుతుంది.

**హరనాథ్‌బాబా ఆలయానికి రక్షణ గోడలు అవసరం**

మాడవీధులను విస్తరించటం వల్ల సుమారు ఎకరం స్థలం అదనంగా రామాలయానికి స్వాధీనమవుతుంది. మాడవీధులకు ఆనుకుని దేవాదాయశాఖకు చెందిన హరనాథ్‌బాబా ఆలయం ఉంది. 46 ఇళ్లను స్వాధీనం చేసుకునేటప్పుడు యంత్రాలను ఉపయోగించక తప్పదు. ఆ సమయంలో గుట్ట కిందిభాగంలో దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలి. గతేడాది వర్షాలకు ఈ ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం కూలిపోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని హరనాథ్‌బాబా ఆలయం చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

# ఏఐ అడుగులు.. బడులకు కంప్యూటర్లు



కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సామర్థ్యాల పెంపుపై కొంతకాలంగా ప్రభుత్వాలు దృష్టి నిలిపాయి. ఇందుకోసం సులభతరమైన అనేక పద్ధతులను అమలుచేస్తున్నా.. ఫలితాలు ఆశించిన మేర రావడంలేదు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లోని బాలలు భాష, గణితంలో సామర్థ్యాలను చాటడంలో వెనుకబడిపోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కృత్రిమ(ఏఐ) బోధనను అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రాథమిక తరగతుల్లో 50 మందికిపైగా విద్యార్థులున్న బడులకు అయిదేసి కంప్యూటర్లను అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. జూన్ 1 నాటికి పాఠశాలల్లో వాటిని ఏర్పాటుచేస్తూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కృత్రిమ బోధన చేపట్టనున్నారు.

**ఫలితమివ్వని తొలిమెట్టు**

జిల్లాలో మొత్తం ప్రాథమిక పాఠశాలలు 427 ఉండగా వాటిలో 11,866 మంది.. ప్రాథమికోన్నత పాఠశాలలు 76 ఉండగా అందులో 2794 మంది విద్యార్థులున్నారు. ప్రాథమిక తరగతుల్లో ఆంగ్లాన్ని చదవడంలో, గణితంలో చతుర్విద ప్రక్రియలను చేయడంలో వెనుకబడిపోతున్నారు. మూడేళ్లుగా ఈ పరిస్థితిని అధిగమించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా.. ఆశించిన రీతిలో ఫలితంలేదు. వివిధ సర్వేల్లోనూ 50 శాతానికి మించి సామర్థ్యాలు బాలలు చాటడం లేదనే తేలింది.

**ఉపాధ్యాయులకు శిక్షణ..**ఏఐ బోధనకు కంప్యూటర్లను అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 50 మందికి పైగా విద్యార్థులున్న 69 పాఠశాలలకు ఈ అవకాశం దక్కనుంది. ఇందులో ప్రాథమికోన్నత బడులు 8 ఉండగా, ప్రాథమిక పాఠశాలలు 61 ఉన్నాయి.

ఒక్కో బడికి అయిదు కంప్యూటర్లు, అంతర్జాల సౌకర్యాన్ని విద్యాశాఖ అందించనుంది. దీనికి తోడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1-5 తరగతులకు ఇంటిగ్రేటెడ్ గణితాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు.

**సదుపాయాలు మెరుగైనా..**

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగైనా ప్రవేశాలు పెరగకపోవడంతో ఈ పరిస్థితిని అధిగమించే కార్యచరణను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన 18 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ ద్వారా సామర్థ్యాలను పెంచేందుకు ఏక్ స్టెప్ సంస్థ సహకారంతో బోధన ప్రక్రియను ప్రారంభించారు.

ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియతో బాలలు చదవడం, రాయడం, గణితంలో కొంత సామర్థ్యాలను చాటుకుంటారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఇప్పటికే కృత్రిమమేధ ఆధారిత టూల్స్‌తో చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలను చేయడం వంటివి నేర్చుకుంటున్నారు.

# ధాన్య లక్ష్ములు!



సిరిసిల్ల : మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడం.. వారికి ఆసక్తి ఉన్న వ్యాపారంలో ప్రోత్సహించడంతో కొద్ది మందికే ప్రయోజనం జరుగుతుంది. వీరిని మరింత ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ యాసంగిలో సాధ్యమైనన్నీ ఎక్కువ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పగించనున్నారు.

**2006లో ప్రారంభం**

ఐకేపీ కొనుగోలు కేంద్రాలు 2006లో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ 283 కొనుగోలు కేంద్రాలున్నాయి. దీనికోసం పౌరసఫరాలశాఖ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాలన్నింటినీ ఐకేపీకీ బదిలీ చేయనున్నారు. దీంతో ఇప్పటికే సిరిసిల్లలో 133, కరీంనగర్‌లో ఒకటి, పెద్దపల్లిలో 25 కేంద్రాలు పెరగనున్నాయి. జగిత్యాల జిల్లాలో ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. దీని తర్వాత కేంద్రాల్లోని ధాన్యం రైస్ మిల్లులకు కేటాయిస్తారు. ఏప్రిల్ మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

**రెండు నెలలు.. రెండువేల మందికి ఉపాధి**

ఉమ్మడి జిల్లాలో 47,318 మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ యాసంగి నుంచి దాదాపు 442 కొనుగోలు కేంద్రాల్లో వీరు ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ఒక్కో కేంద్రంలో బుక్ కీపర్, సభ్యురాలు, తేమశాతం చూడటం, సీఏ కలిసి మొత్తం ఐదుగురు బాధ్యతలు చూసుకుంటున్నారు. ఇలా 2,210 మంది మహిళలకు రెండు నెలలపాటు ఉపాధి లభించనుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్‌ను సంఘాలకు అందిస్తుంది.

**స్థిరాస్తులు కూడబెడుతూ..**రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా మహిళా సమాఖ్య బలోపేతానికి చర్యలు చేపట్టింది. 44 కొనుగోలు కేంద్రాల నుంచి ఈ యాసంగిలో 177కు చేరుతున్నాయి. ఏడేళ్లలో ధాన్యం కొనుగోలు చేసి రూ.9.87 కోట్ల కమీషన్‌ను పొందారు. వీటిలో 90 శాతం గ్రామైక సంఘాలు, 10 శాతం జిల్లా సమాఖ్యలకు జమ చేస్తున్నారు. ఇప్పటికే పదిర, గూడెం, కోనరావుపేట, కొండాపూర్, లింగన్నపేట, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో సొంతంగా కొనుగోలు కేంద్రాలకు స్థలాలు కొనుగోలు చేశారు. మరికొన్ని చోట్ల మార్కెటింగ్‌శాఖ భాగస్వామ్యంతో గోదాములు నిర్మించారు.

# కర్షకుల కన్నీటికి కారకులెవరు?


చొప్పదండి : చొప్పదండి మండలంలోని మెట్ట ప్రాంతాల చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోతుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని కాట్నపల్లి, సాంబయ్యపల్లి, మల్లన్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లోని చెరువుల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతుంది. దీంతో ఎన్నో ఆశలతో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోతుండటంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. కనీసం పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

**పూర్తి కాని కాలువల నిర్మాణాలు**

మండలంలోని ఆయా గ్రామాల మీదుగా ఎస్సారెస్పీ ప్రధాన కాలువ ఉన్నప్పటికి.. ఆయా పల్లెల్లోని చెరువులు, కుంటల్లోకి దశాబ్దకాలంగా సాగు నీరందని పరిస్థితి. గుమ్లాపూర్ గ్రామానికి కూతవేటు దూరంలో లక్ష్మీపూర్ పంపుహౌజ్ ఉన్నప్పటికి నీరు అందడంలేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా మోతే కాలువల నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఇంకా తవ్వకం దశలోనే ఉన్నాయి.

రూ.2 లక్షల వరకు నష్టం

నేను మా సోదరుడు కలిసి రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరన్నరలో వరి సాగు చేశాం. ఇందుకోసం సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. మొక్కజొన్న కంకులు వేసే దశలో నీరు లేక సగం వరకు ఎండిపోయింది. వరి పొట్ట దశలోనే చేతికందకుండా పోయింది. దీంతో చేసేదేమి లేక పంటను వదిలేశాం.



కోలపూరి శ్రీనివాస్, గుమ్లాపూర్

చెరువులు నింపేలా చూడాలి

గుమ్లాపూర్ గ్రామ శివారులో మూడెకరాల్లో పొలం, రెండెకరాల్లో మొక్కజొన్న వేశా. సుమారు రూ.1.80 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. కంకి కాసే దశలో, పొలం నాటువేసిన కొద్ది రోజులకే నీరు సరిపోక పూర్తిగా ఎండిపోయాయి. గ్రామంలోని చెరువులో నీరు లేకపోవడం, బావుల్లో సైతం భూగర్భజలాలు పడిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులు, కుంటలు నింపేలా చర్యలు తీసుకోవాలి. కచ్చు లింగయ్య, రైతు

# ఇసుక బజారులో.. బేజారు ఉండదిక..!

కొత్తగూడెం : వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను అందుబాటు ధరకు అందించి.. రాష్ట్ర ఖజానాకు అధికాదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఇసుక(శాండ్) బజార్లు ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో వీటిని నెలకొల్పగా.. త్వరలోనే జిల్లాల్లోని ప్రధాన పట్టణాల్లో అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇసుక పాలసీ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అవసరమున్నచోట సబ్ స్టాక్ యార్డులను ఏర్పాటుచేసి తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించింది. ఖమ్మంలో నెలకొల్పిన సబ్ స్టాక్ యార్డు కొన్నాళ్లకే మూతపడింది. వీటి స్థానంలో ఇసుక బజార్లు వస్తే సామాన్యులకు సైతం ఇసుక అందుబాటులోకి రానుంది.

**దారితప్పుతోందిలా..**



వేసవి నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. అందుకు తగ్గట్టుగానే మార్కెట్‌లో ఇసుకకు డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది.. ఇసుక అక్రమ రవాణాకు తెరలేపుతున్నారు. గోదావరి నదితో పాటు ఇతర ఉపనదుల నుంచి రోజువారీగా కొన్ని వేల టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ఇసుక ధరలకు రెక్కలు రావటంతో వినియోగదారులు గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ధనం ఇసుకాసురుల జేబుల్లోకి వెళ్తోంది. భద్రాద్రి జిల్లాలో ఈఏడాది ప్రభుత్వం మూడు క్వారీలను మాత్రమే ఏర్పాటుచేయటం, ఖమ్మంలో నాలుగు రీచ్‌లే ఉండటంతో నదుల్లో నుంచి ఇసుక పెద్దఎత్తున అక్రమంగా తరలిపోతోంది.

**ఇవిగో ఉపయోగాలు**

జిల్లా కేంద్రంలో ఇసుక బజారు ఉండటం వల్ల స్థానిక నిర్మాణ సంస్థలు, గృహనిర్మాణ యజమానులు, చిన్న వ్యాపారులకు ఇసుక సులభంగా దొరుకుతుంది.ప్రభుత్వ ఆధీనంలో ఉండటం ద్వారా అధిక ధరల సమస్య తగ్గుతుంది. అక్రమ తవ్వకాలు, అమ్మకాలు నియంత్రణలోకి రావటంతో ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది.

స్థానికంగా శ్రామికులు, డ్రైవర్లు, లోడింగ్-అన్ లోడింగ్ సిబ్బందికి ఉపాధి లభిస్తుంది.

అక్రమ తవ్వకాలను నియంత్రించడం ద్వారా నదీతీరాలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం తగ్గుతుంది.

ఇసుక బజార్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. అన్ని జిల్లా కేంద్రాల్లో స్టాక్ యార్డులు ఏర్పాటుచేయటం వల్ల ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక అందుబాటులో ఉంటుంది. ప్రజలు నేరుగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి ఇసుక కొనుగోలు చేయటం వల్ల సర్కారుకూ ఆదాయం పెరుగుతుంది. శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం

# మళ్లీ.. అదే దోపిడీ!

చింతకాని : ఆరుగాలం ఇంటిల్లిపాది శ్రమించి పంట పండించినా.. విక్రయించే సమయానికి ధర అమాంతం తగ్గుముఖం పడుతుండటంతో మొక్కజొన్న రైతులు కుదేలవుతున్నారు. వారం క్రితం బహిరంగ మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న రూ.2,300-2,400 ఉండగా ప్రస్తుతం రూ.2,050కు చేరుకుంది. జిల్లాలో యాసంగిలో మొక్కజొన్న సాగుకు వాతావరణం అనుకూలించింది. బోర్లు, బావులు, సాగర్ ఆయకట్ట పరిధిలో 65,473 ఎకరాల్లో పంటను వేశారు. పది రోజులుగా దిగుబడి చేతికొస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవటంతో రైతులు బయట వ్యాపారులు, దళారులకు క్వింటా రూ.2,050కే విక్రయిస్తున్నారు. గత వారంతో పోల్చితే రూ.300వరకు నష్టపోతున్నారు. సగటున ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. జిల్లాలో 23లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న ఉత్పత్తి కానుంది. ఇదే ప్రకారం కొనుగోళ్లు జరిగితే జిల్లావ్యాప్తంగా రూ.68.74 కోట్లు నష్టపోవాల్సి వస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా సర్కారు గతంలో క్వింటా రూ.2,225కు



కొనింది. ఆ లెక్కన కొన్నా రూ.200మేర ఊరట లభిస్తుంది. కేంద్రాల ఏర్పాటు వారం పది రోజులు ఆలస్యమైనా రైతులు భారీగా నష్టపోతారు. ఇంకోపక్క దళారులు గతేడాది పెద్ద మొత్తంలో మొక్కజొన్న కొని డబ్బులు చెల్లించకుండా ఉడాయించిన ఘటనలున్నాయి. మార్క్‌ఫెడ్ డీఎం సునీత మాట్లాడుతూ మొక్కజొన్న రవాణాకు ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. టెండర్లు పూర్తికాగానే ఉన్నతాధికారుల సూచనల మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు చాదరాసిపల్లి ఉపేందర్. చింతకాని మండలం నాగులవంచకు చెందిన ఉపేందర్ యాసంగిలో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశారు. పంటను హార్వెస్టర్ ద్వారా నూర్పి వారం క్రితమే కల్లాల్లో ఆరబెట్టారు. గత వారంతో పోల్చితే క్వింటాకు రూ.300 మేర తగ్గిపోవటంతో ఏం చేయాలో పాలుపోవటం లేదు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినట్టు, మార్క్‌ఫెడ్ కొనుగోలు వెంటనే ప్రారంభించాలని వేడుకుంటున్నారు.

# మందులా.. మాయాజాలమా?

హైదరాబాద్: ఔషధ నియంత్రణ చట్టం ప్రకారం మందుల కవర్ లేదా లేబుల్, ప్యాకింగ్‌లపై ఔషధ ఫార్ములా మాత్రమే ఉండాలి. ఈ ఔషధం తీసుకుంటే జబ్బు పూర్తిగా తగ్గిపోతుందని రోగులను కొందరు బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ 1954 ప్రకారం ఇలా మందుల లేబుళ్లు, కవర్లపై ప్రకటనలు ఇవ్వడం చట్ట విరుద్ధం.

ఉత్తరాది నుంచి దిగుమతి.. ఎప్పటికప్పుడు ఔషధ నియంత్రణ శాఖ దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా వ్యాపారుల తీరు మారడం లేదు. తాజాగా డీసీఏ ఇలాంటి 4 రకాల మందులను సీజ్ చేసింది.




ఆయుర్వేదిక్ పేరుతో దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. మందులు మార్కెట్‌లోకి వచ్చే ముందు క్లినికల్ ట్రయల్స్ ఉంటాయి. ఉత్తరాది నుంచి వస్తుండటంతో వాటిని గుర్తించడం కష్టమవుతోంది. రోగులను బురిడీ కొట్టిస్తున్నారు. ఈ తరహా మందులను మార్కెట్‌లో గుర్తిస్తే 1800-599-6969 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీసీఏ అధికారులు తెలిపారు.

**ఇదిగో ఇలా..**

ఉదాహరణకు పిక్రోసోల్ లోషన్ పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ మందును రాసుకుంటే బొల్లి తగ్గిపోతుందని ప్రచారం చేస్తున్నారు. అశ్వగంధ చూర్ణం పేరుతో మరో మందును మార్కెట్‌లోకి వదిలారు. దీన్ని ఉదయం, సాయంత్రం తీసుకుంటే క్షయ నయమవుతుందని నమ్మిస్తున్నారు. ముల్సి క్యాప్సుల్స్‌ను పలు మందుల దుకాణాల్లో విక్రయిస్తున్నారు. క్రానిక్ ఫీవర్ తగ్గిపోతుందంటున్నారు. విమ్‌సెట్ ప్లస్-డీఎస్ టానిక్‌ను పిల్లలకు తాగిస్తే వెంటనే జలుబు, తగ్గు, జ్వరం తగ్గుతుందని చెబుతున్నారు.

# రెవెన్యూ రికార్డుల్లో పదోవంతు భూములే

హైదరాబాద్: నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కలిగి ఉన్న జలమండలి వాటి పరిరక్షణకు శ్రీకారం చుట్టింది. జలమండలి వివిధ సందర్భాల్లో పైపులైన్లు, రిజర్వాయర్ల నిర్మాణం, ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు భూసేకరణ చేసింది. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు నీటిని అందిచేందుకు వీలుగా జలమండలికి 400కు పైగా ప్రాంతాల్లో 14 వేల ఎకరాల భూములు ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో 1100 ఎకరాలు మాత్రమే ఉన్నాయి. ఇటీవల ఎండీ కె.అశోక్‌రెడ్డి జలమండలి



ఆస్తులపై సమీక్షించి.. ఎస్టేట్ ఆఫీసర్లతోపాటు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సంస్థ ఆస్తులను పక్కాగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించే బాధ్యతను వారికి అప్పగించారు. ఏయే జిల్లాల పరిధిలో ఏఏ సర్వే నంబర్లలో ఎంతెంత భూమి ఉందో రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉందో వివరాలతో సంబంధిత కలెక్టర్లకు జలమండలి లేఖలు రాసింది. నగరంలో 370కి పైగా రిజర్వాయర్లు ఉండగా చాలా చోట్ల ప్రహరీలు ఉన్నాయి. ఖాళీ స్థలాలపై ఆక్రమణదారులు కన్నేసి కాజేస్తున్నారు. కొందరు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

# సింగరేణిలో సమ్మె సైరన్

సింగరేణిలో సమ్మె సైరన్ మోగనుంది. మే 20న ఒక్కరోజు టోకెన్ సమ్మె చేయాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిర్ణయించింది. ఇప్పటికే దశల వారీగా ఆందోళనలు నిర్వహించిన యూనియన్.. చివరికి టోకెన్ సమ్మె చేపట్టేందుకు మొగ్గుచూపుతోంది. తొలుత నాయకులు.. గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ద్వార సమావేశాలు నిర్వహించి విడతల వారీగా చేపట్టే ఆందోళనలకు సహకరించాలని కార్మికులను కోరారు. అనంతరం నల్లబ్యాడ్జీలతో గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నిరసన తెలిపారు. తర్వాత వివిధ ఏరియాల్లో జీఎంలకు వినతిపత్రాలు అందించారు. నాలుగు రోజుల క్రితం సింగరే



ణి ప్రధాన కార్యాలయం వద్ద రిలే దీక్షలు నిర్వహించారు. అయినప్పటికీ యాజమాన్యం స్పందించకపోవటంతో మే 20న టోకెన్ సమ్మె చేపట్టాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిర్ణయించింది.

డిమాండ్లు ఇవీ..

సింగరేణికి రూ.40వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలి.
కొత్త గనులు ఏర్పాటు చేయాలి.
నిర్మాణాత్మక సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లను నెరవేర్చాలి.
సొంతింటి పథకం అమలు చేయాలి.
డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగాలివ్వాలి.
మారుపేర్లను సరిచేసి 'విజిలెన్స్' బాధితులకు ఉద్యోగాలు కల్పించాలి.
అలవెన్సులపై ఆదాయ పన్ను మినహాయించాలి.
పదకొండు రకాల అలవెన్సులు పెంచాలి.
వివిధ వృత్తుల డిజిగ్నేషన్ మార్పుల హామీని నెరవేర్చాలి.

# రుచి.. శుచి.. మరిచి



హైదరాబాద్ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి విశ్వవిద్యాలయాలకు వస్తున్న విద్యార్థులను వసతిగృహాల్లోని అరకొర వసతులు, రుచి, శుచి లేని భోజనం ఇబ్బందులకు గురి చేస్తోంది. అన్ని వర్సిటీల్లో ఇదే పరిస్థితి ఉండటం గమనార్హం. ఓయూ, జేఎన్టీయూ, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విద్యాలయం, సురవరం ప్రతాపరెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. సుమారు 6 వేల మంది విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

**ఉస్మానియాలో నాసిరకం**

ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సుమారు 2 వేల మంది విద్యార్థులున్నారు. విద్యార్థుల నుంచి మెస్‌ఛార్జీలు ఠంచన్‌గా వసూలు చేస్తున్నా... భోజనం నాసిరకంగా పెడుతున్నారు. ఒక్కోసారి అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగులో ప్లాస్టిక్ అవశేషాలొస్తున్నాయని చెబుతున్నారు. తాగు, వాడుకనీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రెండ్రోజుల కిందట నీటి కోసం ఆందోళన చేస్తే ట్యాంకర్లు తెప్పించారు ఆ నీరూ రంగు మారి కలుషితమైందని విద్యార్థులు వాపోతున్నారు.

మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వసతి గృహం ఆబిడ్స్‌లో ఉంది. ముగ్గురు ఉండాల్సిన చోట ఐదారుగురు విద్యార్థులుంటున్నారు. చీకటి గదులు, వెలగని దీపాలు, పెచ్చులూడుతున్న పైకప్పులు, పందికొక్కులు, ఎలకలకు నిలయంగా వసతిగృహం మారింది. ఊడిన టాయిలెట్ల తలుపులు, విరిగిన కిటికీలు హాస్టల్‌కు చిరునామాగా మారాయి. నీటి సౌకర్యంలేక ఈ మధ్య విద్యార్థులు మాసబ్‌ట్యాంక్‌లోని కళాశాలకు వచ్చి ప్రిన్సిపల్ రూం వద్ద స్నానం చేస్తూ నిరసన తెలిపారు. 150మంది విద్యార్థులుంటే నలభై మంచాలు కూడా లేవు. పది సంవత్సరాల నుంచి నిర్వహణకు ఒక్క రూపాయి కేటాయించలేదని విద్యార్థులు వాపోతున్నారు. రెండేళ్ల నుంచి వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులే వంట చేసుకుంటున్నారు.

**నిజాం కళాశాలలో పారిశుద్ధ్య లోపం**

బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల వసతిగృహాల్లో భోజనం ఏమాత్రం బాగుండటం లేదంటూ విద్యార్థులు తరచూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల డిపాజిట్లతోనే భోజనం అందిస్తున్నారు. బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి సరఫరా చేసిన గుత్తేదారులకు అధికారులు బకాయిలున్నారు. దీంతో వారు సక్రమంగా రేషన్ సరఫరా చేయడంలేదు. వసతిగృహాలు, భోజనశాలల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలివ్వడం లేదు. దీంతో వారు కొద్దిరోజుల నుంచి పనులు చేయడంలేదు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. దుర్వాసన తట్టుకోలేక వసతి గృహాల ఆరుబయట కూర్చుని భోజనం చేశారు.

# ఒక్క క్లిక్కు.. పెద్ద తప్పు




హైదరాబాద్ : వాట్సాప్ గ్రూపుల్లో గుట్టుగా చేరుతున్న సైబర్ నేరగాళ్లు ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైళ్లు పోస్టు చేస్తూ డబ్బు కొట్టేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకులు, వివిధ జాబితాల పేరుతో బోల్తా కొట్టిస్తున్నారు. యూజర్లు వీటిని క్లిక్ చేయడంతో నేరగాళ్లు ఫోన్లను హ్యాక్ చేసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ మోసాలు పెరుగుతున్నాయి. తెలిసిన వ్యక్తుల నుంచి వాట్సాప్‌కు వచ్చే ఫైల్, లింకుల్ని పరిశీలించాకే డౌన్‌లోడ్ చేసుకోవాలని సైబర్‌క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్‌కు బదులు లింకులు, ఆన్‌లైన్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పించేవే ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్. మొత్తం ఫోన్‌ను ఆధీనం చేసుకునేలా రూపొందిస్తారు. చూసేందుకు పీడీఎఫ్‌లా కనిపిస్తాయి.

**క్లిక్ చేస్తే ఏమవుతుంది?**

క్లిక్ చేస్తే ఫోన్‌లోని డేటా సేకరించేందుకు హ్యాక్ చేసేందుకు అవకాశముంటుంది. కొన్ని ఫైల్స్ డౌన్‌లోడ్ అయ్యాక ఫోన్‌లో తెరమీద కనిపించకుండా కాల్, సందేశాలు డేటా మొత్తం అవతలి వ్యక్తులకు చేరవేస్తుంటాయి. మనకు తెలియకుండా అవతలి వ్యక్తులు ఫోన్‌ను ఉపయోగించడానికి అవకాశం కల్పిస్తాయి.

**ఇటీవలి ఉదంతాలు**

నగరానికి చెందిన వ్యాపారి వాట్సాప్‌కు ఇటీవల పీఎం యోజన పేరుతో ఏపీకే ఫైల్ వచ్చింది. క్లిక్ చేయగానే యాప్ డౌన్‌లోడ్ అయ్యి ఫోన్ సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లింది. ఆయన క్రెడిట్ కార్డు నుంచి నేరగాళ్లు రూ.2.94 లక్షలు వాడుకున్నారు. గుర్తించిన వ్యాపారి హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

నగరంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న యువకుడికి ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామంటూ ఒకరు కాల్‌చేశారు. బీమా పాలసీకి సంబంధించి రుసుము చెల్లించాల్సి ఉందని లింకు పంపిస్తే కట్టాలని చెప్పాడు. నిందితుడు బీమా సంస్థ పేరుతో ఏపీకే ఫైల్ పంపాడు. సేల్స్‌మెన్ క్లిక్ చేయగానే యాప్ డౌన్‌లోడ్ అయ్యింది. తర్వాత రూ.2.17 ఖాతా నుంచి బదిలీ అయ్యాయి. బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసుల్ని ఆశ్రయించాడు.


**తెలిసిన నంబర్ల నుంచే..**

ఇటీవల వాట్సాప్ గ్రూపుల్లో తెలిసిన వ్యక్తులు కూడా ఏపీకే ఫైళ్లు పోస్టు చేస్తున్నారు. కారణం ఏపీకే ఫైల్ గురించి తెలుసుకోకుండా యథాతథంగా ఫార్వర్డ్ చేయడమే. ఈ ఫైళ్లను క్లిక్ చేసినప్పుడు ఫోన్లు పూర్తిగా సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్తాయి. నేరగాళ్లు ఆయా వ్యక్తుల ఫోన్లలోని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడం రెండో కారణం.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

కొత్త ఫోన్ నంబర్ల నుంచి వాట్సాప్‌కు వచ్చే ఫైల్స్, వీడియో లింకుల్ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు. వాట్సాప్, టెలిగ్రామ్ వేదిక ఏదైనా ఫైల్ వచ్చినప్పుడు అది ఏ రకమో చివరి అక్షరాల్లో సూచిస్తుంది. ఉదాహరణకు పీఎం యోజన పేరుతో పీడీఎఫ్ ఫైల్ పంపిస్తే పీఎంయోజన.పీడీఎఫ్ అని ఒకవేళ ఏపీకే ఫైల్ అయితే వెడ్డింగ్ ఇన్విటేషన్.ఏపీకే ఫైల్ అని ఆంగ్ల అక్షరాల్లో ఉంటుంది. ఏపీకే ఫైళ్ల మీద క్లిక్ చేసినప్పుడు ప్రమాదకరమైన ఫైల్ అని తెరపై కనిపిస్తుంది. ఫోన్‌లో సెట్టింగ్స్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నౌన్ సోర్సెస్ ఆప్షన్ డిసేబుల్ చేసుకోవాలి. దీనివల్ల అనధీకృత యాప్‌లు డౌన్‌లోడ్ అవ్వవు.

# వారమే గడువు.. ఇంకెప్పుడు బడ్జెట్?



హైదరాబాద్ మహానగరపాలక సంస్థతోపాటు ఇతర మున్సిపాలిటీలు ఇప్పటికే బడ్జెట్ సమావేశాలు నిర్వహించాయి. నిధులు ఏమేర అవసరమో అంచనాలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించగా.. కరీంనగర్ నగరపాలక సంస్థలో మాత్రం బడ్జెట్ సమావేశంపై ఊసే లేకుండా పోయింది. మరో వారమైతే ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటివరకు వార్షిక పద్దులపై విభాగాల వారీగా కేటాయింపులు చేసుకోవాల్సి ఉండగా అదేది కనిపించడం లేదు. గతేడాది మార్చి మొదటివారంలోనే పాలకవర్గ సభ్యులు బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించి ఆమోదించారు.

**గతేడాది రూ.577.52 కోట్లతో..**

2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.577.52 కోట్లతో బడ్జెట్ అంచనాలు తయారు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.621.44 కోట్లుగా చూపించగా.. రూ.43.92 కోట్ల ఆదాయం తగ్గింది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం లేకపోవడంతో ఆ సమయంలో కుదించారు. ఆర్థిక సంఘం నిధులు మినహాయిస్తే మిగతావి ఈ ఆర్థిక సంవత్సరంలో రాకపోవడంతో పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మరోవైపు కొత్తపల్లి మున్సిపాలిటీ సైతం ఇటీవల విలీనం కావడంతో అక్కడ బడ్జెట్ తయారుచేసే అవకాశం లేకుండా పోయింది.

**పెరిగిన ఆదాయం.. ఖర్చులు**

నగరపాలక సంస్థకు ఈ ఏడాది ఆదాయం పెరిగినప్పటికి.. ఖర్చులు సైతం భారీగా పెరిగాయి. ఆస్తిపన్ను మదింపు, దుకాణాల ట్రేడ్ లైసెన్స్, అద్దెకివ్వడం, విలీన కాలనీల్లో వాణిజ్య సముదాయాలు లెక్కలోకి రావడంతో కొంతమేర ఆదాయం పెరిగింది. అయితే కార్మికుల జీతభత్యాలు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధిదీపాలు, ఇతర నిర్వహణ వ్యయం పెరగడంతో వచ్చే ఆదాయం ఏమూలకు సరిపోవడం లేదు. ప్రతినెలా పన్నులు వసూలు చేస్తే తప్ప బిల్లుల చెల్లింపులు, జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. నగరంలో ఏ ప్రభుత్వ కార్యక్రమం చేయాలన్నా బల్దియాపైనే నెట్టుతుండటంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుంది.

**అంచనాలతోనే అభివృద్ధి పనులు**

బడ్జెట్ అంచనాల ఆధారంగానే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించే అవకాశముంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. వచ్చే ఏడాదిలో కార్యకలాపాలు కొనసాగించేందుకు నిధులు అవసరం. పాత వాటితోపాటు కొత్తగా విలీన గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. వేసవికాలంలో నీటి సమస్య, డ్రైనేజీలు, రోడ్లు, వీధిదీపాలు వంటివి మెరుగు పడతాయని ఆయా ప్రాంతవాసులు భావిస్తున్నారు.

# జారీలో జాప్యం.. జనం పరేషాన్

హైదరాబాద్: గ్రేటర్‌లో పేదలకు రేషన్‌కార్డుల పంపిణీలో ఇదిగో.. అదిగో.. అని వాయిదాల పర్వం కొనసాగుతోంది. రేషన్ కార్డులకు ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కార్డుల పంపిణీలో అంతులేని జాప్యం చోటు చేసుకుంటోంది. ప్రజాపాలనలో నగర వాసులు 5.73 లక్షల మంది కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమికంగా 83 వేల కుటుంబాలు రేషన్‌కార్డులకు అర్హులుగా గుర్తించారు. వీరిలో 70 వేలమందిని జనవరిలో నిర్వహించిన వార్డు సభల్లో లబ్ధిదారులుగా నిర్ధారించారు. గుర్తించిన లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. అర్హులను గుర్తించి నెలలు దాటుతున్నా కార్డుల పంపిణీ మాత్రం ముందుకు సాగడం లేదు. ఇదే సమయంలో చాలామంది ఇప్పటికీ దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు.

**ఎప్పుడిస్తారో గందరగోళం..**



దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా పేర్కొనగా.. మార్చి మొదటివారానికి మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా 1.31 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తులు స్వీకరణకే పరిమితం కావడంతో కొత్తకార్డులు ఎప్పుడిస్తారో అనే గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా మీసేవా కేంద్రాల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కూడా ప్రారంభం కాలేదు. మార్చి 1న రేషన్‌కార్డులు అందజేస్తారని ప్రకటించినా ఇంతవరకు పంపిణీపై స్పష్టత రాలేదు. పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా కార్డుల పంపిణీపై స్పష్టత ఇవ్వడంలేదు. దీంతో లబ్ధిదారుల్లో అయోమయం కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని, కొత్త కార్డుల ముద్రణ డిజైన్ల ఎంపికలో స్పష్టత రాకపోవడం కూడా జాప్యానికి కారణమని పేర్కొంటున్నారు. కార్డుల కోసం ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి ఉంటోందని, పలువురు నిత్యం ఫోన్ చేసి ఎప్పుడిస్తారని అడుగుతున్నారని పౌరసరఫరాశాఖ ఉన్నతాధికారి తెలిపారు. కార్డుల పంపిణీకి అధికారికంగా ఉత్తర్వులు ఇస్తే వాటికి అనుగుణంగా రేషన్‌కేటాయింపు వంటి ప్రక్రియ చేపడుతామన్నారు. కొత్త కార్డులతో పాటు సుమారు లక్ష ఇరవై వేలమంది రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ కూడా ముందుకుసాగడం లేదు.

# కార్యాలయాలకు మోక్షమెన్నడో?

వేములవాడ : ప్రజలకు పాలన మరింత చేరువయ్యేలా ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా వేములవాడ గ్రామీణ మండలాన్ని 2019లో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండలం ఏర్పాటు చేసినప్పటికీ ఏ గ్రామంలో మండల కేంద్రం కొనసాగించాలో ఇప్పటి వరకు అధికారులు నిర్ణయం తీసుకోలేదు. దీంతో కార్యాలయాలు అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. వివిధ పనులపై నిత్యం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ఇదీ పరిస్థితి**చెక్కపల్లి, ఎదురుగట్ల, నూకలమర్రి, బాలరాజుపల్లి, అచ్చన్నపల్లి, మర్రిపల్లి, నాగయ్యపల్లి, హన్మాజిపేట, జయవరం, బొల్లారం, లింగంపల్లి, వట్టెంల, ఫాజుల్‌నగర్, తుర్కాషినగర్, నమిలిగుండుపల్లి, వెంకటాంపల్లి, మల్లారం గ్రామాలతో వేములవాడ గ్రామీణ మండలం ఏర్పాటు చేశారు. మండల కేంద్రాన్ని తమ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని అనేక గ్రామాల ప్రజల నుంచి డిమాండ్ వ్యక్తమైంది. చెక్కపల్లిలో మండల కేంద్రం కోసం గ్రామస్థులు స్వచ్ఛందంగా 3.5 ఎకరాల స్థలాన్ని సైతం కొనుగోలు చేసి పెట్టారు. మర్రిపల్లిలో మండల కేంద్రం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజలతోపాటు మరికొందరు డిమాండ్ చేశారు.

అధికారులు మాత్రం మండల కేంద్రంపై నిర్ణయం తీసుకోలేదు. వేములవాడలోనే గ్రామీణ మండలాన్ని కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా పక్కా భవనాలు లేక అరకొర వసతుల మధ్య అధికారులు కాలం వెల్లదీస్తున్నారు. తహసీల్ కార్యాలయం వేములవాడలోని ఓ వసతి గృహ భవనంలో కొనసాగుతోంది. శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుండగా కార్యాలయ సిబ్బందితోపాటు



వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయానికి భవనం కేటాయించ లేదు. దీంతో మర్రిపల్లిలోని రైతు వేదికలో అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. మండల పరిషత్తు కాంప్లెక్స్ ఆవరణలోని భవిత కేంద్రం భవనంలో మండల విద్యాధికారి కార్యాలయానికి గది కేటాయించారు. ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వేములవాడ మండలంలోని ఐకేపీ కార్యాలయంలోనే గ్రామీణ ఐకేపీ కార్యాలయం అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటుపై నిర్ణయం తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు పూనుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదురవుతున్నాయి

గ్రామీణ మండల కార్యాలయాలకు కేటాయించిన భవనాల్లో సరైన వసతులు లేవు. దీంతో అధికారులకు, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ మండలం ఎక్కడ కొనసాగిస్తారో స్పష్టమైన నిర్ణయం త్వరితగతిన తీసుకోవాలి. పక్కా భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, చొరవ తీసుకోవాలి. పాటి వినీత్‌కుమార్, మర్రిపల్లి

# ఆటలతో ఆటలు

హైదరాబాద్ : కోటిన్నర జనాభా ఉన్న నగరంలో బల్దియా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో ఒక్క క్రీడా శిక్షకుడు లేడంటే ఆశ్చర్యమే కదా. తాత్కాలిక శిక్షకులతో నెట్టుకొస్తూ.. యంత్రాంగం మమ అనిపిస్తోంది. దీని ప్రభావం ఔత్సాహిక క్రీడాకారులపై పడుతోంది. పేద, మధ్య తరగతి యువత ప్రైవేటు అకాడమీల్లో శిక్షణ పొందలేక ఆటలకు దూరమవుతున్నారు. ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి రాలేకపోతున్నారు.

**నాటి వైభవం..** క్రికెట్, ఫుట్‌బాల్, బాక్సింగ్, హాకీ, బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు బల్దియా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్సులు అనేక మంది క్రీడాకారులను అందించాయని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో సర్కిల్‌కు ఒక గేమ్ ఇన్‌స్పెక్టర్, పదుల కొద్దీ పూర్తిస్థాయి కోచ్‌లు ఉ



ండేవారు.

**నేటి ప్రభావం**

ప్రస్తుతం క్రీడల విభాగంలో జోన్‌కు ఒకరు చొప్పున పనిచేస్తున్న ఆరుగురు గేమ్ ఇన్‌స్పెక్టర్లు, అదనపు కమిషనర్, ఆయన కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులు మాత్రమే. 1990 నుంచి జీహెచ్ఎంసీలో పూర్తిస్థాయి శిక్షకుల నియామకం జరగక పోవడం గమనార్హం. ఎల్బీనగర్ జోన్‌లో 69 మైదానాలు, 3 స్పోర్ట్స్ కాంప్లెక్సులు ఉన్నా ఒక్క కోచ్‌ను కూడా కేటాయించలేదు. కూకట్‌పల్లి జోన్‌లో ఇద్దరు, శేరిలింగంపల్లి జోన్‌లో ఆరుగురు తాత్కాలిక శిక్షకులు మాత్రమే పనిచేస్తున్నారు. బాక్సింగ్, క్రికెట్, వాలీబాల్, స్కేటింగ్, సైక్లింగ్ వంటి ఆటల్లో శిక్షణకు నోచుకోవడం లేదు. 134 మంది కోచ్‌లు అవసరమని ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. జీహెచ్ఎంసీ అంచనాల ప్రకారం. 150 నుంచి 160 మంది అవసరమని గుర్తించారు.

# పనులు పూర్తయినా.. పై వంతెన ప్రారంభించరేం?

హైదరాబాద్ : గోల్నాక నుంచి అంబర్‌పేట వరకు పైవంతెన నిర్మాణం పూర్తయి నెలవుతోంది. దాదాపు రూ.350 కోట్లు ఖర్చయ్యాయి. నేటికీ ప్రారంభించకపోవడంతో వాహనదారులకు, స్థానికులకు తిప్పలు తప్పట్లేదు. ఐదో ఏటా నరకం చవిచూస్తున్నారు. పెండింగులో ఉన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించలేక ప్రజాప్రతినిధులు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. మరికొంత సమయం కావాలంటూ అధికారులు సైతం నాన్చుతున్నారు.

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా..**

అంబర్‌పేట పైవంతెన నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2018లో శంకుస్థాపన చేశారు. అనంతరం రెండేళ్లకు పనులు మొదలయ్యాయి. ఐదేళ్ల తర్వాత పైవంతెన నిర్మాణం పూర్తయింది. ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్నప్పుడు.. అంబర్‌పేట మీదుగా నల్లకుంట, గోల్నాక, ముసారాంబాగ్, రామంతాపూర్, ఉప్పల్ ప్రాంతాల మధ్య నిత్యం రాకపోకలు సాగించే వేల మందికిపైగా వాహనదారులు ప్రత్యక్ష నరకం అనుభవించారు. నెలరోజుల క్రితం పైవంతెన పూర్తికాగా.. నేటికీ అవే కష్టాలు కొనసాగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణానికి వేసిన పిల్లర్లతో దానికింద శ్రీరమణ థియేటర్ చౌరస్తా సమీపంలోని రోడ్డు ఇరుకుగా మారడంతో.. అక్కడి ఖబ్రస్థాన్ మీదుగా స్టీలు బ్రిడ్జి నిర్మించేందుకు ముస్లిం మతపెద్దలతో చర్చలు జరుపుతున్నామని అధికారులు చెబుతున్నారు. వారు అంగీకారం తెలిపాక 15 రోజుల్లో పనులు పూర్తిచేసి పైవంతెనను ప్రారంభిస్తామని చెబుతున్నారు. పంజాగుట్ట హిందూ శ్మశానవాటికపై ఇనుప దిమ్మెలతో కట్టిన వంతెన తరహాలో అంబర్‌పేటలోనూ నిర్మిస్తామంటున్నారు. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ ప్రతిపాదనకు సంబంధిత వర్గాలు ఒప్పుకోవట్లేదు.ప్రయోజనం ఇలా.. ఛే నంబరు చౌరస్తా, శ్రీరమణ థియేటర్ చౌరస్తాలపై 1.5 కి.మీ. పొడవు, నాలుగు లైన్ల వెడల్పుతో వరంగల్ జాతీయ రహదారిపై చేపట్టిన పైవంతెన అందుబాటులోకి వస్తే.. మహాత్మాగాంధీ బస్టాండు, ఉప్పల్ కూడళ్ల మధ్య రాకపోకలు సాగించే వాహనాలు రయ్యిమంటూ సాగిపోతాయి.



ముసారంబాగ్, నల్లకుంట సమీప ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపైనా ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

**ఉప్పల్ కూడలిలోనూ నిలిచిన పనులు**

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ)లో భాగంగా ఉప్పల్ కూడలిలో, అక్కడి నుంచి రామంతాపూర్ వైపు, ఉప్పల్ క్రికెట్ స్టేడియం రోడ్డులో పైవంతెనల నిర్మాణం కూడా నిలిచిపోయింది. నాలుగేళ్ల కిందట శంకుస్థాపన జరిగింది. వాటి పురోగతి మాత్రం 5 శాతానికి మించలేదు. నారపల్లి నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న పైవంతెనను.. అక్కడి నుంచి రామంతాపూర్ వైపు కొనసాగించి, కూడలిలో, స్టేడియం రోడ్డుపై పైంతెనలను నిర్మించాలన్న లక్ష్యాన్ని జీహెచ్ఎంసీ అటకెక్కించింది. కూడలి నుంచి రామంతాపూర్ వైపు చేపట్టిన పిల్లర్ల నిర్మాణం సగంలో నిలిచిపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. సర్వే ఆఫ్ ఇండియా సంస్థ 8 ఎకరాలు, ప్రైవేటు వ్యక్తుల 6 ఎకరాల స్థలాన్ని సేకరించలేక పనులు ఆపేసినట్లు సమాచారం.

# ప్రకృతి వైద్యం.. ఇక ఖరీదు!



హైదరాబాద్ : ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయంలో వైద్య సేవల ధరలు సామాన్యులు, పేదలకు షాక్ ఇస్తున్నాయి. కొన్ని సేవల ధరలు రెండు, మూడు రెట్లు పెరగడంతో పేద, మధ్యతరగతి రోగులు బెంబేలెత్తుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో వచ్చే వారికి హైదరాబాద్‌లోని అమీర్‌పేట ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయం సేవలు అందిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచీ రోగులు వస్తుంటారు. సేవల్లో ఈ కేంద్రానికి రోగుల్లో మంచి పేరుంది. అయితే ఎక్కువ మంది సామాన్య, మధ్యతరగతి రోగులే ఈ చికిత్సాలయాన్ని ఆశ్రయిస్తుంటారు. పెంచిన ఛార్జీలు భారంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**పలు దీర్ఘకాలిక వ్యాధులకు...**

క్యాన్సర్, గుండెకు సంబంధించిన వ్యాధులతో పాటు పలు జీవనశైలి వ్యాధులకు ప్రకృతి చికిత్సతో ఇక్కడ వైద్యం అందిస్తారు. థైరాయిడ్, మధుమేహం, స్థూలకాయం, చర్మవ్యాధులు, మెడ, నడుము, కీళ్ల నొప్పులు, కీళ్లవాతం, జీర్ణకోశ, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, మలబద్ధకం వంటి వాటికీ ప్రకృతి చికిత్స అందిస్తారు. గర్భిణులు సాధరణ ప్రసవం అయ్యేలా యోగా, వ్యాయామాలు చేయిస్తుంటారు. స్త్రీ, పురుషుల్లో నెలకొన్న సంతానోత్పత్తి, గర్భధారణ వంటి సమస్యలకూ చికిత్స అందిస్తారు. ఆసుపత్రిలో ఎలాంటి రసాయనాల చికిత్స, ఆపరేషన్లు ఉండవు. వ్యాధి తీవ్రతను బట్టి వారం నుంచి నెలలపాటు చికిత్స చేస్తారు. మట్టి, జల, మర్దన, ఆహార చికిత్సలు, తానాబాత్, డీలక్స్ హైడ్రో మసాజ్, యోగా, ప్రాణాయామం, ధ్యాన క్రియలు, వాయు చికిత్స, సూర్యకిరణ్ చికిత్స, ఆథపత్(వివిధ రకాల ఆకులను వేడి నీటిలో మరిగించి చేసే స్నానం), షట్‌కర్మల చికిత్స, వివిధ రకాల ఫిజియోథెరపీలు, ఆక్యూపంచర్ వంటివి అందుబాటులో ఉన్నాయి.

**ఛార్జీలు భారమే...**

ఆసుపత్రిని ఇటీవలి రూ.10 కోట్ల నిధులతో ఆధునికీకరించారు. అనంతరం రెండు, మూడింతలు ఛార్జీలు పెంచడంతో రోగుల రాక తగ్గింది. వైద్యానికి జనరల్ వార్డులో వారానికి గతంలో రూ.2500 వసూలు చేస్తే.. ప్రస్తుతం రూ.9,600కి పెంచారు. తెల్ల రేషన్‌కార్డు ఉంటే గతంలో వారానికి కేవలం రూ.వెయ్యితో చికిత్స అందిస్తే.. దానిని రూ.3,600 చేశారు. రోగులకు ఇచ్చే డైట్ గతంలో రోజుకు రూ.100 ఉంటే.. రూ.300 చేశారు. ప్రత్యేక వార్డు ఏసీ షేరింగ్ గతంలో రూ.9 వేలు ఉంటే.. దానిని ఏకంగా రూ.13,700 చేశారు. ఇక ప్రత్యేక కాటేజీ కావాలంటే వారానికి రూ.23,500 చెల్లించాల్సిందే. ఇది రెండింతలు పెరిగింది. ఇలా అన్ని సేవల ధరలు భారీగా పెంపుతో పేద రోగులకు ఇబ్బందిగా మారింది. మానవీయ కోణంలో పేదలకు రాయితీలు ఇవ్వాలని రోగులు కోరుతున్నారు.

# మీ ఠాణా నుంచి వాటా అందలే!




హైదరాబాద్ : అది ప్రైవేటు వ్యవహారం.. పోలీసులు జోక్యం చేసుకుంటే ఇబ్బందులు వస్తాయని ఇన్‌స్పెక్టర్ చెప్పినా వినలేదు.. నిందితుడికి బెయిల్ లభించినా వారం పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఠాణాలో కూర్చోబెట్టి నరకం చూపారు. ఫలితంగా 5-6 సార్లు కోర్టులో రిట్ దాఖలైంది. ఖరీదైన కారు వ్యవహారంలో ఒక ఏసీపీ అత్యుత్సాహానికి నిదర్శనమిది.

గన్‌లైసెన్స్ గడువు ముగిసింది. రెన్యువల్ చేయమంటూ దరఖాస్తు చేసుకున్న వారికి మరో ఏసీపీ చుక్కలు చూపుతున్నాడు. ప్రాణహాని ఉన్నంత తప్పేంచేశారంటూ ప్రశ్నలు. పనికావాలంటే వ్యక్తిగతంగా వచ్చి కలవాలంటూ సలహాలు.

ఇవి గ్రేటర్ పరిధిలోని కొందరి ఏసీపీల వ్యవహార శైలికి ఉదాహరణలు మాత్రమే. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కీలకం. ప్రధానమైన ఠాణాల్లో విధినిర్వహణ కత్తిమీద సాముగా మారింది. పండగలు, ఉత్సవాలు, ప్రముఖుల బందోబస్తు నుంచి కేసుల దర్యాప్తు వరకు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. ఇటువంటి వాతావరణంలో కొందరు అసిస్టెంట్ మిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లు కాసుల కక్కుర్తితో కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్నారు. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నట్టు సమాచారం.

**శివార్లలో ఇలా..**

సైబరాబాద్ పరిధిలోని కీలక జోన్‌లో పనిచేస్తున్న ఏసీపీ నుంచి ఫోన్‌కాల్ వచ్చిందంటే కిందిస్థాయి సిబ్బంది హడలెత్తిపోవాల్సి వస్తోందంటూ ప్రచారం సాగుతోంది. ఒక కేసులో తన వద్దకు మాట్లాడేందుకు వచ్చిన వ్యాపారి విన్నపం విన్నాక.. సమస్య పరిష్కారం కావాలంటే 4 బంగారు గాజులు కావాలంటూ బేరసారాలు ప్రారంభించినట్టు తెలిసింది. ఇదే కమిషనరేట్‌లో ఒక ఏసీపీ పరిధిలోని భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. అక్కడ ఏ భూ వివాదం తలెత్తినా బయటపడాలంటే ఆయనకు పెద్దమొత్తం ముట్టజెప్పాల్సిందేనంటూ పోలీసువర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసు కమిషనర్ తన కార్యాలయానికి పిలిచి పద్ధతి మార్చుకోమని హెచ్చరించినా అదే తీరు. రాచకొండ పరిధిలో ఒక ఏసీపీ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తాడని సమాచారం.

**నగరంలో మరోలా** నగరంలో కీలకమైన జోన్.. సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులుండే ప్రాంతం. అక్కడ ఏసీపీ తన మాటే చెల్లుబాటు కావాలంటూ కిందిస్థాయి సిబ్బందికి తెగేసి చెప్పాడు. ఇటీవల దంపతుల వివాదాన్ని తానే పెద్దగా మారి పరిష్కరించి రూ.20లక్షలకు పైగా లాభపడినట్టు చర్చ జరుగుతోంది. ఉత్తరమండలంలో ఒక ఏసీపీ తన పరిధిలో ఏ కేసు నమోదైనా బాధితులు తనను కలవాలంటూ అనధికార ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఎస్సైలు నెలవారీ ఎంతెంత ఇవ్వాలనేది ముందుగానే లక్ష్యం నిర్దేశించాడు. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో సుమారు 10 మంది ఏసీపీల అవినీతి, అక్రమదందాలపై బాధితులు, ఠాణాల్లోని సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

# ఆశల ఊసులాట.. మాయగాళ్ల దొంగాట

హైదరాబాద్ : అరచేతిలో స్వర్గం చూపించే రంగురంగుల బ్రోచర్లు.. ఖరీదైన ప్రాంతాల్లో అద్దాల మేడలాంటి భవనాల్లో కార్యాలయాలు.. తియ్యని మాటలతో నమ్మించే కమీషన్ ఏజెంట్లు.. ఆశపెట్టే లాభాలు.. ఇదీ రాజధాని కేంద్రంగా పంజా విసురుతున్న ఆర్థిక నేరగాళ్ల నిజస్వరూపం. తేలిగ్గా డబ్బు సంపాదించాలనుకునే అమాయకుల బలహీనతే ఆసరాగా.. ఆకర్షణీయ వడ్డీలు, లాభాలు ఇప్పిస్తామంటూ నేరగాళ్లు సరికొత్త దోపిడీకి తెరతీస్తున్నారు. రూ.లక్ష పెట్టుబడికి నెలకు 30 శాతం వడ్డీ.. 6 నెలల్లో అసలుతో కలిపి రెట్టింపు సొమ్ము తిరిగి ఇస్తామంటూ ప్రకటనలతో రూ.వేల కోట్లు ముంచేస్తున్నారు. తాజాగా క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ.. ఇన్‌వాయిస్ డిస్కౌంట్ పేరుతో 6,979 మందిని రూ.850 కోట్ల మేర ముంచింది. నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా రూ.1,700 కోట్లు సేకరించి బోర్డు తిప్పేసింది. గతేడాది డీకేజడ్ సంస్థ 17,500 మందిని రూ.229 కోట్ల మేర మోసగించింది.

**రంఛనుగా ఇచ్చి.. నిండా ముంచేసి**

బాధితులను నమ్మించేందుకు నిందితులు కొన్ని నెలలపాటు వడ్డీలు, లాభాలు రంఛనుగా జమ చేస్తున్నారు. ఎక్కువ మంది నిజమేనని ఆశపడుతున్నారు. భారీగా లాభం వస్తోందంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో పెట్టుబడులు పెట్టిస్తున్నారు. ఈ ప్రచారమే నేరగాళ్ల జేబు నింపుతోంది. కొందరు కష్టపడి సంపాదించిన పింఛను, బంగారం కూడా అప్పగిస్తున్నారు. సాధారణంగా బ్యాంకులు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పొదుపు పథకాల్లో వడ్డీలు గరిష్ఠంగా 9 శాతంలోపే ఉంటాయి. ఏటా రూ.లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలుండే ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులే అంతకుమించి వడ్డీ ఇవ్వలేనప్పుడు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఇస్తాయంటే నమ్మకూడదు.నగరానికి చెందిన యునానీ వైద్యుడు (49), సయ్యద్ నజీర్ స్నేహితులు. మాదాపూర్‌లోని డీకేజడ్ టెక్నాలజీ, డికాజో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో పెట్టుబడులు పెడితే బాగా



లాభాలు వస్తాయని, రూ.12 లక్షలు డిపాజిట్ చేస్తే 24 నెలలపాటు రూ.లక్ష చొప్పున లాభం వస్తుందని వైద్యుడిని సయ్యద్ నజీర్ నమ్మించాడు. దీంతో వైద్యుడు 2024 ఫిబ్రవరిలో రూ.8.8 లక్షలు పెట్టుబడి పెట్టాడు. జులై వరకూ రూ.18 వేల చొప్పున ప్రతినెలా లాభం వచ్చింది. ఈలోపు వైద్యుడు తన తల్లిదండ్రులు, సోదరి, సోదరులు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితులు 22 మందితో రూ.1.8 కోట్లు పెట్టుబడి పెట్టించారు. 2 నెలలు లాభం ఇవ్వకపోవడంతో అడగాలని వెళ్తే మాదాపూర్‌లో కార్యాలయం మూసేసి ఉంది. అందరి ఫోన్లు స్విచాఫ్ అయ్యాయి. దీంతో వైద్యుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బైబ్యాక్ ఓపెన్ ప్లాట్స్, డబుల్ గోల్డ్ స్కీమ్, గోల్డ్ చిట్స్ స్కీమ్, దివాలీ గోల్డ్ స్కీమ్ పేరుతో 12 వెల్త్ క్యాపిటల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు 3,600 మంది నుంచి రూ.300 కోట్లు సేకరించారు. రూ.8.08 లక్షలకు 2 గుంటల భూమి కొంటే కంపెనీ 24 నెలలపాటు ప్రతినెలా 4 శాతం లాభం ఇస్తుందని నమ్మించారు. గడువు ముగిశాక డబ్బు తిరిగిస్తామని ముంచారు.రికవరీ 30 శాతంలోపేకొట్టేసిన డబ్బుతో నేరగాళ్లు ఇతర వ్యాపారాలు చేస్తుంటారు. బినామీల పేరుతో ఆస్తులు కొనుగోలు చేస్తారు. దీంతో సొమ్ము రికవరీ ఎక్కువగా ఉండటం లేదు. 2024లో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,036 కోట్ల ఆర్థిక మోసాలు జరగ్గా జప్తు చేసింది రూ.324 కోట్లు మాత్రమే. అంటే 30 శాతమే స్వాధీనమైనట్లు.

# అపోహలు తొలగించు.. దాహార్తి తీర్చు

వికారాబాద్ : నీటి ఎద్దడిని నివారించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పథకం మిషన్ భగీరథ. కోట్లాది రూపాయలను వెచ్చించి శుద్ధి చేసిన నీటిని నేరుగా పంపిణీ చేస్తున్నా ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదు. సరైన అవగాహన లేకపోవడంతోపాటు పలుచోట్ల నిర్వహణ లోపం కూడా ఇతర అవసరాలకు వినియోగించడానికి కారణమవుతోంది. దీనిని గుర్తించడంతోపాటు ఎండాకాలంలో నీటి ఎద్దడి సమస్యను కూడా దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. గతంలో మండల స్థాయిలో సర్పంచులు, ఎంపీపీలు, మండల ప్రాదేశిక సభ్యులకు అవగాహన కల్పించగా ఇప్పుడు ప్రత్యేక సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నారు.

**జిల్లాలో ఇదీ లెక్క..**

అంశం: – మిషన్ భగీరథ (2018లో ప్రారంభం)
నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు: – పరిగి మండలం రాఘవాపూర్ సమీపాన
నిత్యం శుద్ధి జరిగే నీరు: – 1.35కోట్ల మిలియన్ లీటర్లు
నీటి సరఫరా: – శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్



ఎంత దూరం నుంచి: – 231 కిలోమీటర్లు పైప్‌లైన్ల ద్వారా
వెచ్చించిన వ్యయం: – ఉమ్మడి జిల్లాకు రూ.1800కోట్లు
లక్ష్యం: – ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించడం

పంచాయతీకి ఒక సహాయకుడు

తాగునీటి సరఫరా సవ్యంగా జరగాలన్న ఉద్దేశంతో పంచాయతీకి ఒక సహాయకుడు పనిచేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు 583 మంది విధుల్లో ఉన్నారు. ఇతర శాఖల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌కు వెళ్లిన హెల్పర్లు 101కూడా ఇందులోనే కొనసాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవలే విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలను వారికి ఉన్నతాధికారులు పూర్తిచేశారు.

పథకం అమలు తీరు
సరఫరా పనితీరు – మెరుగ్గానే..
ప్రజాదరణ.. నామమాత్రం
కారణం – అవగాహన ఏర్పర్చక పోవడం
నిర్వహణ: శుభ్రతలేని ట్యాంకుల ద్వారా సరఫరా
దేనికి వినియోగిస్తున్నారు – ఇతర అవసరాలకు.

ఆరోగ్యానికి ఎంతో మేలు

ఖనిజ, లవణాల మిశ్రమంతో కూడిన జలాన్ని పంపిణీ చేస్తున్నాం. తాగునీటి విషయంలో ఎలాంటి అపోహలు వద్దు. భగీరథ నీరు ఆరోగ్యానికి ఎంతో సురక్షితం. డబ్బా నీటితో అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇందుకోసమే క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

చల్మారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్.

# శిఖం భూములు.. యథేచ్ఛగా ఆక్రమణలు

పెద్దపల్లి : సుల్తానాబాద్ పెద్దచెరువు శిఖం ఇది. 300 ఎకరాలు ఉంటుంది. ఈ చెరువు కింద 3 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. వంద ఎకరాల శిఖం కబ్జా చేసి పొలాలు, చేపల చెరువులు, స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదులున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఆయకట్టుకు సాగు నీరందించే చెరువులు, కుంటలు చిన్నబోతున్నాయి. ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్) గుర్తింపులో ఆయా శాఖల ఉదాసీనత వైఖరితో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో వంద ఎకరాల్లోపు 832, వంద కంటే పైనా 107 కలిపి 939 చెరువులున్నాయి. వీటి పరిధిలో 55,332 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు, కుంటల శిఖానికి ఎఫ్‌టీఎల్ భూమితోపాటు బఫర్‌జోన్ ఉంటుంది. చెరువు నిండి ఎంత నిలిచి ఉంటుందో ఆ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ హద్దుగా గుర్తించాలి. కబ్జాకు గురికాకుండా ఈ జోన్‌లో మొక్కలు నాటి పర్యావరణం, పచ్చదనం పెంచాలి. చెరువుల హద్దులను తేల్చకపోవడంతో ఆక్రమణలు ఆగడం లేదు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల్లో సమన్వయం కొరవడింది. ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప కబ్జాలు పట్టించుకోవడం లేదు. ఇరు శాఖల సంయుక్త సర్వేతో అక్రమణకు అడ్డుకట్ట పడనుంది. చెరువుల కట్జాకు గురికావడంతో పంట కీలక దశలో నీటి తడులు అందక ఎండిపోతున్నాయి. మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది.

**మచ్చుకు కొన్ని ఇలా**

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి చెరువు 2 వేలకు పైగా ఆయకట్టు ఉంది. శిఖాన్ని 30 ఎకరాలు కబ్జాకు గురికావడంతో ఆయకట్టు, చేపల పెంపకానికి విఘాతం కలుగుతోంది. రైతులు రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో 496 సర్వేనంబరులో పెద్ద చెరువు సుమారు 150 ఎకరాల విస్తీర్ణంతో ఉంది. సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉండగా 25 ఎకరాలు కబ్జాకు గురైంది. చెరువులో నీరు ఉంటే గంగారం ఊషన్నపల్లి, పెగడపల్లి, ఓదెల మండలం నాంసానిపల్లె గ్రామాల్లోని రైతుల వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి.మంథని మండలం చిన్నఓదాలలో నేతలపల్లి చెరువు శిఖం 34 ఎకరాలు ఉంది. శిఖం పక్కనే సీలింగ్ భూములు ఉండటంతో వాటి పేరిట కబ్జా చేసి పంట పొలాలుగా మార్చుతున్నారు. సమీప రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు పరిశీలనకే పరిమితమైంది.

పెద్దపల్లి మండలం నిట్టూరు ఊరు చెరువు శిఖంలో హరితహారంలో నాటిన మొక్కలను కబ్జాదారులు తొలగించారు. అధికారుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా పట్టించుకోవడం లేదు. నిమ్మనపల్లి, అప్పన్నపేట, బ్రాహ్మణపల్లిలో చెరువులు కనుమరుగవుతున్నాయి.

సర్వే చేస్తున్నాం

జిల్లాలో చెరువుల కబ్జాపై ఫిర్యాదుల ఆధారంగా సర్వే చేస్తున్నాం. రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకొని హద్దులు నిర్ధారిస్తున్నాం. కబ్జాలపై పర్యవేక్షణ పెంచుతున్నాం.

– శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ

చురకలు



# వసతిలో 'కుర్ర'పెత్తనం

కర్నూలు : "వసతి గృహాల్లో 'కుర్ర'కారు పెత్తనం చేస్తోంది. కోడుమూరు సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఓ విద్యార్థిని మరొక విద్యార్థి బెల్టుతో కొట్టిన ఘటన కలకలం సృష్టించింది. పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఏడు, ఎనిమిది తరగతి చదువుతున్న విద్యార్థులను దారుణంగా కొట్టారు."ఇలా వసతి గృహాల్లో 'కుర్ర'కారు పెత్తనం చేస్తోంది. విద్యార్థులను కంటికి రెప్పలా చూడాల్సిన సంక్షేమాధికారులు సంతకాలకే పరిమితమయ్యారు.. ఉదయం వచ్చి ఆ రోజుకు సంబంధించి సరకులిచ్చి సంతకం చేసి వెళ్తున్నారు. నిర్వహణ బాధ్యతలు వంట సిబ్బంది, పెద్ద తరగతి విద్యార్థులకు అప్పగిస్తున్నారు. వారు చిన్న తరగతుల విద్యార్థులను భయపెడుతున్నారు. కోడుమూరు సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో 103 మంది విద్యార్థులున్నారు. రాత్రివేళ ఎవరూ లేకపోవడంతోనే ఘటన జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకొచ్చారు.

వసతి గృహ సంక్షేమాధికారులు ఎల్లవేళలా విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. భోజనం తయారీ మొదలు అన్నీ దగ్గరుండి చూసుకోవాలి. కానీ చాలా మంది జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు. నిర్వహణ అంతా ఫోన్లో నడిపిస్తున్నారు. రాత్రి వేళ కనీసం సిబ్బంది కూడా ఉండటం లేదు. ఘటన జరిగిన వసతి గృహంలో ఏడాది



కిందట రాత్రి కాపలాదారు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో రాత్రి సమయాల్లో ఎవరూ లేకపోవడంతో విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకునే పరిస్థితి ఉండటం లేదు. ప్రభుత్వం ఇచ్చే డైట్ ఛార్జీలను వార్డెన్లు భారీ ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు.

కర్నూలులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగిని వసతిగృహంలోని సరకులు బయటకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆమెను సస్పెండ్ చేశారు. బీసీ సంక్షేమశాఖ కళాశాల బాలుర వసతిగృహంలో విద్యార్థుల సంఖ్యకు పొంతన లేకపోవడం తదితర కారణాలతో వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. పెద్దపాడు బీసీ సంక్షేమశాఖ ప్రీ–మెట్రిక్ వసతిగృహంలో ఉన్నతాధికారులు తనిఖీ చేయగా అక్రమాలు తేలడంతో వార్డెన్‌ను సస్పెండ్ చేశారు.

**విచారణ చేపట్టిన అధికారులు**

ఘటన విషయం తెలుసుకొన్న జిల్లా విద్యాధికారి శామ్యూల్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి, సీఐ తబ్రేజ్, ఎస్సై శ్రీనివాసులు వసతి గృహానికెళ్లి విచారణ చేపట్టారు. దాడి ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నాం.. ఏడో తరగతి విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం.. దాడికి దిగిన పదో తరగతి విద్యార్థిని మానసిక వైద్య నిపుణులకు చూపించినట్లు సీఐ తెలిపారు.దాడికి పాల్పడిన విద్యార్థిని ఓ నాయకుడు చెప్పడంతో చేర్చుకొన్నాం.. ఆ నాయకుడు గతంలో రాత్రి కాపలాదారుగా అనధికారికంగా విధులు నిర్వర్తించేవారు.. అప్పట్లో ఉన్న వసతిగృహ రాత్రి కాపలాదారుగా అనధికారికంగా ఆ నాయకుడికి కొంత సొమ్ము ఇచ్చి విధులు చేయించేవారు. తర్వాత వాచ్‌మెన్ బదిలీపై వెళ్లటంతో నాయకుడికి దిక్కుతోచ లేదు. తనను వాచ్‌మెన్‌గా పెట్టుకోవాలని రూ.10 వేలు ఇవ్వాలంటూ తనను డిమాండ్ చేసేవాడని వసతిగృహ అధికారి తెలిపారు.

# పల్లె గుమ్మంలో జల తరంగిణి

నంద్యాల : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో జల సంరక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్లె పుష్కరిణి పేరుతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 చెరువులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో తటాకానికి రూ.5 లక్షలు కేటాయించనున్నారు. ఏప్రిల్ 7వ తేదీలోగా గ్రామ సభల్లో ఆమోదం తెలిపి వెంటనే పనులు ప్రారంభించనున్నారు. జూన్ 30వ తేదీలోగా రెండు జిల్లాల్లో పనులు పూర్తిచేసి చెరువులను వర్షంనీటితో



నింపనున్నారు.

**దిగుడు బావులకు మహర్దశ**

గ్రామాల్లోని పురాతన దిగుడు బావుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. గతంలో తాగునీటి అవసరాలను తీర్చిన ఈ బావులు కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. వినియోగంలో లేవు. వీటిని మళ్లీ వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు ఆలయాల్లోని కోనేర్లను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఉపాధిహామీ పథకం కింద దిగుడు బావులు, కోనేర్లలో పూడిక తీయిస్తారు. దెబ్బతిన్న మెట్లను బాగుచేస్తారు. వీటి చుట్టూ కొబ్బరి మొక్కలు నాటనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో గ్రామాల వారీగా పురాతన బావులు, కోనేర్ల వివరాలు సేకరించాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# ప్రభుత్వ బడికి పీఎంసిరి

చాగలమర్రి : నూతన విద్యా విధానం అమలులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న బోధన విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాయి. పీఎంశ్రీ పథకం కింద రెండు విడతలుగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసింది. జిల్లాలో 40 పాఠశాలలు ఎంపిక చేశారు.. తొలి విడత రూ.6.54 కోట్లు, రెండో విడత రూ.4.4 కోట్లు మంజూరయ్యాయి. ఎంపికైన పాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఎంపికైన పాఠశాల్లో తొలి విడతలో 4 సైన్స్ ల్యాబ్‌లు రూ.44లక్షలతో చేపట్టారు. 28 పాఠశాలల్లోని మైదానాల్లో రూ.1.15 కోట్లతో క్రీడా కోర్టుల నిర్మాణాలు పూర్తయ్యాయి. తొలి విడతలోని 25 పాఠశాలల్లో ర్యాంపులు నిర్మించారు. సోలార్ ప్యానల్, ఇంకుడు గుంతల పనులు మినహా.. మిగిలిన పనుల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండో విడతలో ఆర్వో ప్లాంటు, ల్యాబ్ నిర్మాణాలు తదితర పనులు కొనసాగుతున్నాయి.

# ఊపిరి..ఆడట్లేదు



తిరుపతి : చంద్రగిరి మండలానికి చెందిన పూర్ణిమ శ్వాస సమస్యతో రుయా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షించి సమస్యను గుర్తించారు. నిత్యం పూజగదిలో అగర్‌బత్తీలు వెలిగించడం.. ఆ పొగను పీల్చడంతో శ్వాస సమస్యకు గురైనట్లు గుర్తించారు.

తిరుపతికి చెందిన సంపూర్ణ శ్వాస తీసుకోవడం కష్టంగా మారడంతో వైద్యులను సంప్రదించారు. ఇరుకు వంటగదిలో లీకైన గ్యాస్ తరచూ పీల్చడంతో శ్వాస సమస్య వచ్చినట్లు గుర్తించారు. ప్రస్తుతం మందులు వాడకంతోపాటు కిటికీ తెరుచుకోమని వైద్యులు సలహా ఇచ్చారు.

దుమ్ము, ధూళి, పొగ పీల్చేవారిలో ఊపిరితిత్తుల సమస్యలు సహజం. ఈ వ్యాధుల బారినపడే వారిలో ఎక్కువగా పురుషులే ఉంటారు. కానీ ఇటీవల మహిళలు శ్వాస సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రతి పదిమందిలో ఇద్దరు ముగ్గురు ఉంటున్నారు. మహిళలు ఈ వ్యాధుల బారినపడటానికి జన్యుపర సమస్యలుగా మొదట గుర్తించిన వైద్యులు.. రోగుల సంఖ్య పెరగడంతో పలు పరీక్షలు చేసి కారణాలు గుర్తిస్తున్నారు.

**కారణాలిలా..**

గాలి పెద్దగా సోకని పూజగదిలో అగరబత్తీలు, సాంబ్రాని కడ్డీలు వెలిగించి మహిళలు పూజలు చేస్తుంటారు. ధారాళంగా కమ్ముకునే పొగను పీల్చుతూ అలాగే ఉండిపోవడం.. కొంతకాలం కొనసాగించడంతో శ్వాస సమస్యలు వస్తున్నట్లు గుర్తించారు. అలాగే వంటగదిలో లీకైన గ్యాస్‌ను దీర్ఘకాలం పీల్చుతూ ఇబ్బంది పడుతున్నారు.

ఏసీ, కూలర్ల ఫిల్టర్లను తరచూ శుభ్రం చేయకపోవడంతో వాటిని ఆన్ చేయగానే వచ్చే దుమ్ము, ధూళి ముక్కు ద్వారా లోపలికి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతోంది. గదుల్లో అతిశీతల వాతావరణంతో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇరుకు గదిలో పరిమితికి మించి నివసించడంతో తగినంత గాలి, వెలుతురు లేకపోవడంతో ఆక్సిజన్ శాతం తగ్గిపోయిన ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు వస్తున్నాయి.

ఐస్‌తో కూడిన జ్యూస్‌లు, చెరకు రసం తాగడంతో మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధి పీడితులు ఇబ్బందులు పడుతుంటారు.

వాహన, పరిశ్రమల కాలుష్యం.. వేస్ట్ డిస్పోజబుల్ కాల్చగా వచ్చే పొగను పీల్చడంతోనూ సమస్యలు ఎదురవుతున్నాయి.

అందుకే పని ప్రదేశాల్లో దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం లేకుండా చూసుకోవాలి. వంట గదిలో నాణ్యమైన పూజాసామగ్రి వినియోగించాలి.

**లక్షణాలు ఇలా..**

నాలుగైదు రోజులు దగ్గు, జ్వరం తగ్గకపోవడం. రక్తంతో గళ్ల పడటం. పక్కటెముకలు ఒకవైపు నొప్పి రావడం. శ్వాస తీసుకోవడానికి కష్టపడటం. మేలుకున్నా పిల్లికూతలు వినిపించడం వంటి లక్షణాలు ఉంటే ఊపిరితిత్తుల వైద్యులను సంప్రదించాలి.

బాధితుల సంఖ్య పెరిగింది తరచూ ఊపిరి ఆడటం లేదని ఆస్పత్రులకు వచ్చే మహిళల సంఖ్య పెరిగింది. పూజ, వంట గదుల్లోకి గాలి వచ్చివెళ్లేలా కిటికీలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు అమర్చుకోవాలి. ఊపిరి సడలని విధంగా పొగను బంధించకూడదు. దుమ్ము, ధూళి, పొగలకు దూరంగా ఉండాలి. వీలైనంతగా వాహన వినియోగం తగ్గించి వాయుకాలుష్యం నియంత్రించడం, నిబంధనలు పాటించి పరిశ్రమల కాలుష్యం తగ్గించడం, జనసంచారం లేని ప్రదేశాల్లో వ్యర్థాలు కాల్చడంతో తీవ్రత తగ్గించవచ్చు.సుబ్బారావు, ఊపిరితిత్తుల విభాగాధిపతి, రుయా ప్రభుత్వ ఆస్పత్రి

# స్టార్టప్‌లకు ఊపిరి



విశాఖపట్నం : సాంకేతికతతో కొత్త సవాళ్లను పరిష్కరించేలా.. స్టార్టప్ స్థాపించాలనుకునేవారికి అవకాశాలు కల్పించేలా.. 'ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీ(4.0)'ని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఈ పాలసీ 2024–2029 వరకు అమలవుతుందన్నారు. స్టార్టప్‌లు ఏర్పాటుకు, ఉన్నవాటిని విస్తరించడానికి అనువైన నగరాల జాబితాలో విశాఖ ఒకటి. సాగరతీరంలో ఐటీ హిల్స్‌లో తెదేపా హయాంలో 50వేల చదరపు అడుగుల్లో స్టార్టప్ విలేజ్ పేరుతో 'ఇన్నోవేషన్ వ్యాలీ' భవనాన్ని నిర్మించారు. అందులో పెద్ద సంఖ్యలో స్టార్టప్స్ అక్కడ ఉండేవి. వైకాపా అధికారంలోకి వచ్చాక దాదాపు అన్నీ మూతపడ్డాయి

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్స్ (ఆర్‌టీఐ) కింద రాష్ట్రంలో ఐదు జోన్లు, ఒక హబ్ ఏర్పాటు చేయనున్నారు. ఇంక్యుబేషన్ కేంద్రాలు, స్టార్టప్‌లకు ఉచిత సీట్లు ఇక్కడ ఇస్తారు. ఈ కేంద్రాల్లో చేరేవారందరికి స్టార్టప్ పాలసీలో ప్రకటించిన అన్ని ప్రోత్సాహకాలకు అర్హులే అవుతారు.

ఈ పాలసీ రాష్ట్రాన్ని భారతదేశపు సిలికాన్ వ్యాలీగా మార్చే దిశగా ఒక సహసోపేతమైన అడుగు. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్లు 20వేల స్టార్టప్‌ల లక్ష్యం బాగున్నాయి. ఈ విధానం ప్రతిభ, మూలధనానికి అయస్కాంతంగా ఉంటుంది. ఏపీని స్టార్టప్ గమ్యస్థానంగా మారుస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఇతర బృందానికి ధన్యవాదాలు.

కొసరాజు శ్రీధర్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ కన్వీనర్.

దేశంలోనే అద్భుతమైన పాలసీ ఇది. దీనివల్ల చాలా స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయి. గత ఐదేళ్లు ఏ పాలసీ క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఈ పాలసీ ఆచరణలోకి వచ్చి ప్రకటించిన ప్రోత్సాహకాలు సకాలంలో అందిస్తే ఏపీ ప్రగతిపథంలో నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుంది.

ఓ.నరేష్‌కుమార్, రుషికొండ ఐటీ పార్కు ఉపాధ్యక్షులు.

# ఇది నిజం.. ఆక్రమణే ప్రతి గజం



విశాఖపట్నం : చినముషిడివాడలోని శారదాపీఠం అక్రమాలు తవ్వేకొద్దీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. తాజాగా మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు మరికొన్నింటిని నిర్ధారించారు. ఆక్రమణకు కాదేది అనర్హమన్నట్లు రోడ్డును సైతం ఇక్కడ ఆక్రమించేశారు. సామాజిక అవసరాలకు వినియోగించాల్సిన స్థలాలను కబ్జా చేసి కట్టడాలు నిర్మించినట్లు బయటపడింది. వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్‌కు శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి రాజగురువు తరహాలో వ్యవహరించారు. దీంతో పీఠానికి సెక్యూరిటీ మొదలుకొని అన్ని రకాలుగా ప్రభుత్వ ప్రొటోకాల్ సేవలను అనుభవించారు.

**గుర్తించిన ఆక్రమణలు ఇవే..**పీఠం ఆవరణలో 203 చదరపు గజాల్లోని స్వయం జ్యోతి మండపంలో 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లోని వుడా లేఅవుట్లు(ఎల్‌పీ సంఖ్య 17/89) సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది..

190 చదరపు గజాల్లో నిర్మించిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం సర్వే సంఖ్యలు 91/1, 91/9లోని వుడా (వీఎంఆర్‌డీఏ) ఓపెన్ స్పేస్‌లో ఉంది.122 చదరపు గజాల్లోని గోశాల, 325 చదరపు గజాల్లోని సిబ్బందికి నిర్మించిన గృహాలు వుడా లేఅవుట్‌లోని ఖాళీ స్థలంలో నిర్మించారు. ఈ నిర్మాణాలన్నీ పీఠానికి పడమర వైపున్నాయి.

తూర్పు వైపు సర్వే సంఖ్యలు 90, 91/9లోని వుడా ఓపెన్ స్పేస్ స్థలంలో 743 చదరపు గజాల్లో శారదా చంద్రమౌళీశ్వరుల నిత్య పీఠ పూజ మందిరం ఉంది. అక్కడే ఆడిటోరియాన్ని నిర్మించారు.

సర్వే సంఖ్య 91/3లో 14 చదరపు గజాల్లో బావి, సర్వే సంఖ్య 91/3, 91/9లోని 43 చదరపు గజాల్లో కాలభైరవ స్వామి ఆలయం, సర్వే సంఖ్య 91/1, 91/9లో 80 చదరపు గజాల్లోని యాగశాల, సర్వే సంఖ్య 91/9లో 22చదరపు గజాల్లో దాసాంజనేయ స్వామి ఆలయం ఉన్నాయి.

సర్వే సంఖ్యలు 87/1, 90, 90/1, 91/3, 91/9లో ఓపెన్ స్పేస్‌లో 42 సెంట్లకుపైగా విస్తీర్ణంలో నిర్మాణాలున్నాయి.

# 18 నెలలుగా ఎదురుచూపులే!

గణపవరం : 'కాలువ గట్ల వెంబడి రోజుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. రబీలో వంతుల వారీ విధానంతో ఇంటికి ఎప్పుడు వెళ్తామో తెలియని పరిస్థితి. పద్దెనిమిది నెలలుగా వేతనాలు అందక ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఇంటి అవసరాలు, ద్విచక్ర వాహనానికి పెట్రోలు కోసమని అప్పులు చేయాల్సి వస్తోంది. రోజులు గడిచే కొద్దీ మార్కెట్లో అప్పులు ఇచ్చేవారూ కనిపించడం లేదు' అని గణపవరం సెక్షన్ లస్కర్ తురంగి సత్తిపండు ఆవేదన వ్యక్తం చేశారు.'ఒక నెల జీతం రాకుంటేనే ఇల్లు గడవదు. అలాంటిది 18 నెలలుగా వేతనాలందక ఇంటాబయటా నరకయాతన అనుభవిస్తున్నాం. ఈ పని మానేసి వేరొకటి చేద్దామంటే రబీ సీజన్ కావడంతో నిర్ణయం తీసుకోలేకపోతున్నాం' అని నిడమర్రు లస్కర్ ఇజ్జరోతు విష్ణుబాబు అన్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో పంట కాలువల నిర్వహణ విధులు నిర్వర్తించే ఒప్పంద లస్కర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జీతాల కోసం 18 నెలలుగా ఎదురుచూడటమే తప్ప వారి సమస్యను పట్టించుకున్న వారు లేరు. వేతనాలు రాక.. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక వారు ఆందోళనకు గురవుతున్నారు. అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదని, తమ పరిస్థితిని ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వారు ఆవేదన



చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో సమస్య పరిష్కారమవుతుందని ఆశపడుతున్నారు.

పని భారం మోస్తున్నా.. 2014కు ముందు రూ.6 వేలుగా ఉన్న లస్కర్ల జీతాలను అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.10,500గా నిర్ణయించి ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి వీరికి అవే వేతనాలు. ఏడాదిలో ఏప్రిల్, మే నెలల్లో జీతాలుండవు. అయినా కాలువలు, షట్టర్ల నిర్వహణ విధులు నిర్వహించాల్సి వస్తోంది. కాలువల్లో తూడు పేరుకున్నా బాగు చేసుకుని నీరు కిందకు వెళ్లేలా చేయాల్సి ఉంటుంది. పలు పోస్టులు ఖాళీలుగా ఉండటంతో ఆ పని భారాన్నీ మోస్తున్నామని వారు వాపోతున్నారు. 'వేతనాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. గత ప్రభుత్వ హయాంలో చేసిన విధులకు ఏ విధంగా ఇవ్వాలనే అంశంపై ఉన్నతస్థాయిలో చర్చ జరుగుతోంది' అని జలవనరుల శాఖ ఉండి డీఈ సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

లస్కర్ పోస్టులు: 309

దినసరి కూలీ కింద చేపట్టిన నియామకాలు: 208


పూర్తిస్థాయి లస్కర్లు: 30

ఖాళీ పోస్టులు: 71

# ప్రగతి ఏలూరు కావాలని..

ఏలూరు: సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది జిల్లాల వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు ఈ అంశంపై కసరత్తు పూర్తి చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రతి రంగంలో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని సీఎంకు కలెక్టర్ నివేదించనున్నారు. దీనిని సాధించడానికి ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం, ఆయా రంగాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సమగ్ర నివేదిక తయారు చేసి సీఎంకు సమర్పించనున్నారు

15 శాతం వృద్ధి దిశగా.. ఈ ఏడాది 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యానంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం ప్రస్తుతం 1.3 లక్షల ఎకరాలుంటే మరో 20 వేల ఎకరాలు పెంచనున్నారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో, కొత్త పంటలుగా డ్రాగన్ ఫ్రూట్ వంటివి 10 వేల ఎకరాల్లో అభివృద్ధి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రకృతి సాగు 30వేల ఎకరాల్లో ఉండగా ఈ ఏడాది మరో 5 వేల ఎకరాల్లో పెంచుతామని తెలిపారు.



ఔత్సాహికులను ప్రోత్సహించి కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు. ఆక్వా, మామిడి, ఆయిల్‌పామ్ పంటలతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎగుమతుల్లో వృద్ధి సాధించనున్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఏటా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయనున్నారు.

చేయూత కోరుతూ.. ప్రధానంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల పరిష్కారం, రీ సర్వే త్వరిత గతిన పూర్తి చేయడం చేయనున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం పంట, మురుగు కాలువల్లో ఇంకా పూడికల తీత, గుర్రపుడెక్క తొలగింపు చేయలేదు. ఫలితంగా శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. ఈ సమస్య పరిష్కరించాలని నివేదికలో విన్నవించారు. జిల్లాలో భూముల సారాన్ని బట్టి జిప్సం, బోరాన్, జింకు లోపాలు అధికంగా ఉన్నాయి. గతంలో తెదేపా సర్కారు రాయితీపై వీటి సరఫరా చేసేది..వైకాపా సర్కారు ఆ విధానాన్ని గాలికొదిలింది. మళ్లీ రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులకు అవకాశం లేక రహదారులపై పోస్తున్నారు. మార్కెట్ యార్డు భూముల్లో ధాన్యం ఆరబెట్టుకునే ప్లాట్‌ఫాంలు ఇవ్వాలని కోరుతున్నారు.

# యువతపై బెట్టింగ్ పంజా!



అనంతపురం : అనంతపురం చెందిన ఓ యువకుడు ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులే. యువకుడు బెట్టింగ్‌కు ఆకర్షితుడయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న స్నేహితుడి ద్వారా రూ.2 లక్షలు ఒకసారి, రూ.2.50 లక్షలు మరోసారి ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగ్ వేసి డబ్బులు పోగొట్టుకున్నాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంటి నుంచి పనిచేస్తున్నాడు. బెంగళూరుకు చెందిన కొందరు బుకీలను పరిచయం చేసుకుని బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. స్థానిక యువతను ఈ ఊబిలోకి లాగాడు. మధ్యవర్తిగా ఉంటూ ఇతరుల ద్వారా బెట్టింగ్ ఆడిస్తున్నాడు. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో కొందరు బెంగళూరు, తుమకూరుకు చెందిన బుకీలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి వారితో బెట్టింగ్ వేయిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని బుకీలతో అనుసంధానం చేస్తున్నారు. ధర్మవరంలో పలువురు వ్యాపారులు బెట్టింగ్‌కు బానిసలుగా మారిపోయారు. ప్రొద్దుటూరుకు చెందిన బుకీలతో దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో మ్యాచ్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బెట్టింగ్ వేస్తున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. మాదకద్రవ్యాలు, మద్యం మాదిరే బెట్టింగ్ ఓ వ్యసనంలా మారుతోంది. బెట్టింగ్ యాప్‌ల్లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటుండం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మొదలుకావడంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దందామళ్లీ రెక్కలు విప్పుతోంది. అనంత నగరంతో పాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరంలో దందా జోరుగా సాగుతోంది. ఇందులో ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉంటున్నారు.

**అంతా ఆన్‌లైన్‌లోనే..**

గతంలో బుకీలకు నేరుగా ఫోన్‌చేసి బెట్టింగ్ కాసేవారు. పోలీసుల నిఘా పెరిగిపోవడంతో బుకీలు సైతం ఆన్‌లైన్‌లోకి మారిపోయారు. గతేడాది తాడిపత్రికి చెందిన ఒకరు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి బెట్టింగ్ నడిపించాడు. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం 20కిపైగా బెట్టింగ్ యాప్‌లు ఉన్నాయి. పెద్దమొత్తంలో ఆఫర్లు ప్రకటించి యువతను ఆకర్షిస్తున్నారు. రూ.500తో మొదలుపెట్టి రూ.10 వేలు, రూ.50 వేల వరకు బెట్టింగ్ వేస్తున్నారు. రెండు జిల్లాలో నిత్యం రూ.2 కోట్లల్లో బెట్టింగ్ జరుగుతోందని నిఘా వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకు స్నేహితులు, బంధువుల వద్ద అప్పు చేస్తున్నారు. మరికొందరు రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. వాటిని చెల్లించలేక కొందరు ఇంటికి దూరంగా ఉండటం..మరికొందరు ఒత్తిడి భరించలేక తనువు చాలిస్తున్నారు.

**కుటుంబ సభ్యులదే బాధ్యత!**

బెట్టింగ్ మహమ్మారి బారిన పడకుండా కుటుంబ సభ్యులే కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐపీఎల్ సీజన్‌లో పిల్లలు సాయంత్రానికే ఇంటికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మ్యాచ్ జరుగుతున్న సమయంలో పదేపదే ఫోన్ చూసినా.. మాట్లాడినా అప్రమత్తం కావాలి. ముఖ్యంగా వారి ఖాతాల్లో అవసరానికి మించి డబ్బులు లేకుండా చూసుకోవాలి. బెట్టింగ్ యాప్స్ ఉంటే వెంటనే తొలగించి కౌన్సెలింగ్ ఇవ్వాలి.

## అక్రమార్కుల చెరలో మార్కెట్ దుకాణాలు

గుంతకల్లు : కళ్ల ముందే కొందరు పురపాలక ఆదాయానికి గండికొడుతూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటు అధికారులు అటు మున్సిపల్ కౌన్సిల్ మౌనంగా ఉంటోంది. ఇదంతా గుంతకల్లు పట్టణం నడిబొడ్డునున్న మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న తంతు. ఫలితంగా ఏటా దాదాపు రూ.34 లక్షల ఆదాయాన్ని కోల్పోతోంది.

**ఇదీ పరిస్థితి...**

ఇరవై ఏళ్ల కిందట మార్కెట్‌లో కూరగాయల వ్యాపారాలు చేసుకునే వారికోసం రూ.కోటికి పైగా వ్యయం చేసి 12 పెద్ద షెడ్లను నిర్మించారు. వీటిని 72 భాగాలు చేశారు. అన్నింటిని కూరగాయల వ్యాపారులకు అద్దెలకు ఇవ్వాల్సి ఉంది. దీన్నిపట్టించుకోకపోవడంతో కొందరు షెడ్లను స్వాధీనం చేసుకుని మున్సిపాలిటీకి ఒక్క పైసా అద్దె చెల్లించకుండా



కూరగాయల వ్యాపారులకే అనధికారికంగా అద్దెలకు ఇచ్చారు. నెలకు రూ. 8 వేల నుంచి రూ. 12 వేల వరకు వసూలు చేశారు. మరికొందరైతే గుడ్‌విల్ కింద ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. షెడ్లలో కూరగాయలను అమ్ముకోవాల్సిన వారు మార్కెట్‌కు చెందిన ఇరుకైన రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనిపై కమిషనర్ నయీం అహమ్మద్ స్పందిస్తూ వస్తున్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. షెడ్లను స్వాధీనం చేసుకొని వేలాలు వేసి, మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

## వైద్య సిబ్బంది నిర్లక్ష్యం.. గడువు తీరిన ఔషధం

ధర్మవరం: ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విలువైన మందులు వృథా అయ్యేలా ఉన్నాయి. చిన్న పిల్లలకు శారీరక ఎదుగుదల జింక్ లోపం నివారించేందుకు, రోగ నిరోధక శక్తి మెరుగుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జింక్‌సల్ఫేట్ మందు (సిరప్)ను ఉచితంగా అందజేస్తారు. ఆసుపత్రికి రోజూ 40 మంది వరకు చిన్న పిల్లలు వైద్యం కోసం వస్తున్నారు.

మూలన పెట్టేశారు..గతేడాది నవంబరులో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి జింక్‌సల్ఫేట్ సిరప్ సీసాల అట్టపెట్టెలు 15 జిల్లా డ్రగ్ స్టోర్స్‌ను వచ్చాయని సిబ్బంది చెబుతున్నారు. ఒక్కొక్క అట్టపెట్టెలో వంద ఉన్నాయి.. అంటే 1500 దాకా సరఫరా చేశారు. అవసరమైన రోగులకు వాటిని ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. దీంతో ఔషధం కాల పరిమితి ఈ నెల 31కి ముగుస్తోంది. ఆసుపత్రిలో ఈ మందుల బాక్సులు గుట్టలుగా పేరుకున్నాయి. దాదాపు 1300 సీసాల



వరకు (13 పెట్టెలు) మూలకు పెట్టారు. వీటితోపాటు పలు రకాల మందులు కూడా ఇలానే ఉన్నాయి. ఈ సీజన్‌లో డయేరియా కేసులు ఎక్కువగా వస్తుంటాయి.. ఇలాంటి తరుణంలో జింక్ సల్ఫేట్ అందుబాటులో లేకపోతే రోగులకు ఇబ్బందులే. ఈ విషయాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి దృష్టికి తీసుకెళ్లగా ఈ సిరప్ ఎక్కువగా ఖర్చు కాకపోవడంతో బాక్సుల్లో ఉంచాం.. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌కు వెనక్కు పంపించమని ఆదేశాలిచ్చామన్నారు.

## గుంత పూడింది.. చింత తీరింది

గోరంట్ల : గత వైకాపా ప్రభుత్వ పాలనలో గోరంట్ల-కదిరి, గోరంట్ల-హిందూపురం ఆర్అండ్‌బీ రహదారులపై (ప్రస్తుతం జాతీయ రహదారుల విభాగంలోకి వెళ్లాయి) పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రజలు నరకయాతన అనుభవించారు. వాహన ప్రమాదాలతో ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో స్థానికులే తాత్కాలికంగా మట్టివేసి మరమ్మతులు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులకు మరమ్మతులు చేయించింది. దీంతో ప్రజలు సాఫీగా ప్రయాణం సాగించడానికి మార్గం ఏర్పడినట్లైంది. ప్రధానంగా హిందూపురం రహదారిలో





పాలసముద్రంలో ప్రతిభ పాఠశాల సమీపంలో, ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డుపై చెరువును తలపించేలా నీరు నిలిచేవి. ఇటీవల ఆ మార్గంపై బీటీ లేయర్ వేయడంతో సుందరంగా తయారైంది. గోరంట్ల పట్టణంలో స్టేట్‌బ్యాంకు వద్ద, ఆసుపత్రి ఎదురుగా, కెంపుల కన్వెన్షన్‌హాల్ సమీపంలో, కసిరెడ్డిపల్లి వద్ద, పులేరు పెద్దవంద మీద ఏర్పడిన గుంతలతో ప్రజలు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. పెద్దవంక మీద ప్రమాదాలు జరిగి ఒకరు మృతిచెందారు. మరికొంతమంది గాయాల పాలయ్యారు. వారం కిందట తిప్పరాజుపల్లి వరకు రహదారిపై బీటీ వేయడంతో ప్రయాణం సాఫీగా సాగడానికి వీలు కల్గినట్లైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పల్లె పండగకు వారం రోజులే గడువు!



పుట్టపర్తి : ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు మార్చి 31వ తేదీ చివరి గడువు. అప్పట్లోగా పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కివెళ్లిపోతాయి. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది జనవరిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.126 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో మండలంలో సుమారు 30 నుంచి 80 వరకు పనులు గుర్తించి సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు నిధులు కేటాయించారు. రోడ్లు నిర్మించేందుకు మరో వారం రోజులు మాత్రమే గడువున్నా కొన్ని మండలాల్లో 20 నుంచి 30 శాతం వరకు పనులు ప్రారంభమేకాలేదు. నేటికీ 124 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పనులు ప్రారంభమవుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా రూ.10.41 కోట్ల నిధులు ఇంకా ఖర్చు చేయలేదు. గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో గడువులోపు రోడ్లు నిర్మించడం అధికారులకు గగనంగా మారింది. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో సకాలంలో పనులు పూర్తి చేయకపోతే అభివృద్ధికి కేటాయించిన నిధులు నిష్ప్రయోజనంగా మారనున్నాయి.

**వెనుకబడిన ధర్మవరం...**

ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 314 పనులకుగాను నేటికీ 74 పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 30 పనులు ప్రారంభమేకాలేదు. తాడిమర్రిలో 20, బత్తలపల్లిలో 18, ధర్మవరంలో 6 పనులు నిధులున్నా పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ ప్రధానంగా నాయకుల మధ్య విభేదాలతో పనులు ప్రారంభానికి నోచుకోవడంలేదు. ఒకే పనికోసం ఇరువురు పోటీ పడటంతో గుత్తేదారులను ఎంపిక చేయడం అధికారులకు కష్టంగా మారుతోంది. ఫలితంగా రోడ్డు నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. అలాగే హిందూపురంలో 4, చిలమత్తూరులో 11, అమడగూరులో 2, బుక్కపట్నం 2, ఓడీసీ 6, కదిరి 12, నల్లచెరువు 6, రొళ్ల 4, కనగానపల్లి 1, రామగిరి 2 పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లాలోని నియోజకవర్గాల్లో అత్యధికంగా పెనుకొండలో వందశాతం పూర్తికాగా, రాప్తాడు 98 శాతం, మడకశిర 98, పుట్టపర్తి 97 శాతం, కదిరి 94 శాతం, హిందూపురం 91 శాతం రోడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. ధర్మవరం 76 శాతంతో వెనుకబడింది.

గడువులోపు పూర్తి చేయిస్తాం
మురళి, పీఆర్ ఈఈ

మార్చి నెలాఖరులోపు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కువగా పెండింగ్ ఉన్న మండలాల్లో ఇప్పటికే అధికారులకు, గుత్తేదారులకు త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాం.

## పంట భూముల్లో సౌరకాంతులు



తిరుపతి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పథకం కింద వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో వీటిని ఏర్పాటు చేయించేలా అధికారులు యత్నిస్తున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో గుర్తించిన భూముల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి 28 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. పిచ్చాటూరు, ఓజిలి, కోట మండలాల్లో ఇప్పటికే 80 ఎకరాల భూములు గుర్తించారు. వీటిలో ప్లాంట్ల ఏర్పాటుతో 16 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు.

**వినియోగం.. విక్రయం..**

సౌర ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చే రైతులకు అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎకరా భూమిలో ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి ఏటా కనీసం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం లభించనుంది. మిగులు విద్యుత్తును డిస్కంల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తుంది. సహకార, మహిళా సంఘాల ద్వారా కూడా ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు ఉంది.

**వ్యయమిలా...**

మెగావాట్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు ఖర్చుకానుంది. ఈ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా భరించనున్నాయి. పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎస్పీడీసీఎల్‌కు ప్రభుత్వం అప్పగించనుంది.

**టెండర్ల దశలోనే..**

జిల్లాలో సోలార్ విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు ప్రక్రియ టెండర్ల దశలోనే ఉంది. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పి.సురేంద్రనాయుడు, ఎస్ఈ, తిరుపతి సర్కిల్

## గుట్టుగా.. కబ్జా

శ్రీకాళహస్తి : కైలాసగిరి ప్రదక్షిణ కోసం దేవుడిబాటను అభివృద్ధి చేశారు. ఐదేళ్లు వైకాపా హయాంలో దీని చుట్టూ అడ్డూ అదుపు లేకుండా అక్రమాలు జరిగాయి. ప్రస్తుతం మరోసారి అదను చూసుకొని అక్రమార్కులు కైలాసగిరి అటవీ భూములను గుట్టుగా కబ్జా చేస్తున్నారు. ఆక్రమణలు అని తెలిసినా పట్టించుకునే వారు లేకపోవడంతో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం సాగిస్తున్నారు.

వైకాపా హయాంలో దేవుని బాట ఆనుకొని గుట్టుగా స్థలాలు కబ్జా చేయడం, పునాదులు వేయడం, మళ్లీ విక్రయించడం పరిపాటిగా మారింది. అప్పట్లో విమర్శలు వచ్చినా దీనిపై ఎవరూ శ్రద్ధ చూపని కారణంగా ఆక్రమణలు సాగిపోయాయి. ప్రధానంగా రాజీవ్‌నగర్, హరహరతీర్థం, టిడ్కో గృహ సముదాయం సమీపంలో ఇప్పటికీ



అడ్డగోలుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. అప్పట్లో నియంత్రించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో ఆక్రమణల పరంపర కొనసాగుతూ వచ్చింది.

**ఖాళీ భూములు లక్ష్యంగా..**

తాజాగా వేడాం, వేడాం బీసీ కాలనీ, ఓటిగుంట, తుఫాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో అక్రమార్కులు ఖాళీ భూములపై కన్నేశారు. దేవుడి బాటను ఆనుకుని పొలాలకు సమీపంలోని భూములను రాత్రి వేళల్లో జేసీబీలతో చదును చేసి ఆక్రమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్రమిత భూముల విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. వేడాం బీసీ కాలనీ ఆనుకుని జరుగుతున్న ఆక్రమణలపై అక్కడి గ్రామస్థులు అడ్డు చెప్పినా అక్రమార్కులు నిలుపుదల చేయడం లేదు. ఇప్పటికైనా ఆలయ అధికారులు వాళ్ల హద్దుల మేరకు సిమెంటుతో చిన్నపాటి గోడలు నిర్మించకుంటే రానున్న రోజుల్లో కబ్జాల నియంత్రణ కష్ట సాధ్యం అయ్యే అవకాశముంది. ఇకనైనా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

## మహిళకు ఆర్థిక చేయూత

విజయనగరం : స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా మహిళలకు తక్కువ వడ్డీకి వివిధ రకాల రుణాలను అందిస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరులో జాప్యమైంది. 2025-26 సంవత్సరానికి మహిళలకు ఏప్రిల్ 1నుంచే కొత్త రుణాలు ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో 21,289 మంది మహిళలకు రూ.179.66 కోట్లు అందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 21,131 మందికి రూ.163.33 కోట్లు మంజూరు చేశారు. బీమా సౌకర్యం ఉన్నందున సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం చెల్లించాల్సి అవసరం లేదు.


**కొత్త విధానంలో..**గతంలో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకుని కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారు. రుణం కోరిన సభ్యులను మండల వెలుగు కార్యాలయానికి పిలిపించి, ఎందుకోసం రుణం కోరుతున్నారు.. ఎటువంటి వ్యాపారం చేస్తారనే వివరాలు తెలుసుకున్న తర్వాత.. బయోమెట్రిక్ తీసుకుని మంజూరుకు సిఫార్సు చేస్తారు. గతంలో సభ్యులు కోరినట్లు వీవోఏ చెప్పడంతో మంజూరు చేయగా కొన్ని(చోట్ల రుణలు పక్కదారి పట్టాయి.

**రికవరీ 99.14 శాతం..**

రుణాల వసూళ్లలో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. స్త్రీనిధి డబ్బులు బ్యాంకుకు చెల్లించే సమయంలో వీవోఏలు చేతివాటం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఏడాది నుంచి పేటీఎం చెల్లింపులు తీసుకువచ్చింది. జిల్లాలో 121 క్లస్టర్లకు 190 ఎస్‌బీఐ పేటీఎం యంత్రాలు అందజేశారు. ఈ ఏడాది పట్టణంలోనూ రుణాలు ఇవ్వడానికి రూ.11 కోట్ల వరకు బడ్జెట్‌లో కేటాయించారు. సంఘానికి రూ.5 లక్షలు, సభ్యులు కనీసం రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు పొందవచ్చు. 23 వాయిదాలు చెల్లిస్తే చాలు.. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా 23 వాయిదాలు చెల్లిస్తే సరిపోతుంది. వీవోఏలు సభ్యులకు అన్ని విషయాలు సమగ్రంగా తెలియజేయాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేస్తాం. 125 రకాల జీవనోపాధులకు ఈ రుణాలను మంజూరు చేస్తున్నాం. ఉమా మహేశ్వరరావు, ఏజీఎం, స్త్రీనిధి సంస్థ, విజయనగరం

## ఒట్టు ఉంటే నీటి బొట్టు

విజయనగరం : డెంకాడ, భోగాపురం మండలాల్లోని 5,200 ఎకరాలకు సాగునీరు అందించే డెంకాడ ఆనకట్ట ఛానల్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా సాగునీరు ప్రశ్నార్థకంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డి.కొల్లాం వద్ద చంపావతి నదిలో నిర్మించిన ఈ ఆనకట్టను 1968లో అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి ప్రారంభించారు. గత అయిదేళ్లూ ఎటువంటి నిర్వహణ పనులు చేపట్టలేదు. దేవుని కొల్లాం వద్ద చంపావతిలో ఆనకట్టపై ఏర్పాటు చేసిన 26 ఫాలింగ్ షట్టర్లకు గాను 10 మరమ్మతులకు గురవడంతో నీరు కిందకు వృథాగా పోతోంది. మదుముల వద్ద ఏర్పాటు చేసిన ఇనుప షట్టర్లు దెబ్బతిన్నాయి. ప్రధాన కాలువ పూడికతో నిండి



అధ్వానంగా తయారైంది. రబీలో చుక్కనీరు అందడం లేదని డెంకాడ, చందకపేట, సింగవరం, నాతవలస, బంటుపల్లి, పేడాడ, భోగాపురం, సుందరపేట, ముక్కాం తదితర గ్రామాల రైతులు వాపోతున్నారు. ఆనకట్ట ఛానల్ కింద 6 కి.మీ మేర తుప్పల తొలగింపునకు రూ.10 లక్షల మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ ఏఈ విద్యాసాగర్ తెలిపారు. మరమ్మతులకు గతంలో ఉపాధి హామీ నిధులు రూ.2.36 కోట్లు మంజూరైనప్పటికీ ప్రాధాన్యత లేమి కింద ఉండడంతో పనులు చేపట్టలేదని అన్నారు.

# ఆలివ్‌రిడ్లేలకు పునర్జన్మ

విజయనగరం: ఆలివ్‌రిడ్లేలు.. ఎంతో ప్రాముఖ్యతతో పాటు అరుదైన జాతిగా గుర్తింపు పొందిన తాబేళ్లు. విశాఖ, బాపట్ల, శ్రీకాకుళం తదితర తీర ప్రాంతాలతో పాటు జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో దర్శనమిస్తుంటాయి. ఇవి ప్రాణాపాయస్థితిలో పడ్డాయి. నిత్యం ఎక్కడో ఒక చోట ఒడ్డున మరణించి కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రక్షణ కల్పించేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే హేచరీలను ఏర్పాటు చేసి, వాటి సంతతిని పెంచుతోంది.ఫిబ్రవరి, మార్చి నెలల్లో రిడ్లేలు గుడ్లు పెడతాయి. ఒడ్డుకు చేరి, ఇసుక బొరియల్లో చేరుతాయి. కొన్ని రోజుల పాటు అక్కడే ఉండి, పొదిగి లోపలికి వెళ్లిపోతాయి. పిల్లలు పుట్టాక అవే తీరానికి చేరాలి. ఈ నేపథ్యంలో పక్షులు, ఇతర క్షీరదాలు, కుక్కలు, నక్కలు తినకుండా వాటికి రక్షణ అవసరం. దీంతో అటవీ శాఖ ప్రైవేటు సంస్థ అయిన ట్రీ ఫౌండేషన్‌తో చేతులు కలిపింది. ఆ సంస్థతో కలిసి ఎనిమిదేళ్ల నుంచి హేచరీల ద్వారా వాటిని కాపాడుతోంది.10 ప్రాంతాల్లో..బొడ్డుగురయ్యపేట, తిప్పలవలసలో రెండేసి, చేపలకంచేరు, ముక్కాం, చోడిపల్లిపేట, పులిగెడ్డపాలెం, బర్రిపేట, చింతపల్లిలో హేచరీలు ఉన్నాయి. ఒక్కో చోట 246 నెస్ట్ (తల్లి తాబేళ్లు గుడ్లు



పొదిగేందుకు పెట్టిన గూళ్లు)లను ఏర్పాటు చేశారు. ఇక్కడ గుడ్లను కృత్రిమంగా పొదిగిస్తారు. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటి వరకు 27,449 గుడ్లను సేకరించి, గురువారం నాటికి 104 పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. సంరక్షణకు 25 మంది సిబ్బందిని నియమించారు.ఆ బాధ్యత మనదే.. ఆలివ్‌రిడ్లేలను కాపాడే బాధ్యత మనదే. మత్స్యకారులు, వేటకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. అవి తిరిగే ప్రాంతాల్లో మెకనైజ్డ్ బోట్లను ఉపయోగించొద్దు. టేకు, నానాజాతి వంటి ప్రమాదకరమైన వలలను వాడొద్దు. తీరంలో కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. ఆర్.కొండలరావు, జిల్లా అటవీ శాఖ అధికారి

# పన్ను వసూళ్లు 52 శాతమే!

భీమవరం : గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పల్లెల్లో నిర్వహణ, అభివృద్ధి పనులకు ఈ నిధులే ఆధారం. ఏటా మార్చి 31 నాటికి పన్ను వసూళ్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా స్థానిక సిబ్బంది అలసత్వం కారణంగా పలు పంచాయతీలు లక్ష్య సాధనలో వెనుకబడుతున్నాయి.జిల్లా వ్యాప్తంగా 409 పంచాయతీలు ఉండగా పన్నుల ద్వారా రూ. 52.87 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఫిబ్రవరి 23 నాటికి రూ.27.40 కోట్లు (దాదాపు 52 శాతం) మాత్రమే వసూలు చేశారు. పంచాయతీల్లో పన్నులు, రుసుముల ద్వారా వచ్చే ఆదాయం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సేవలు



పారదర్శకంగా అందేలా స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిలో గ్రామంలో ఇళ్లు, ఖాళీ స్థలాల వివరాలన్నీ నమోదు చేశారు. ఇంటి, కుళాయి పన్నులు, చెరువుల లీజు, మార్కెట్ ఆశీలు, భవన నిర్మాణ క్రమబద్ధీకరణ తదితర రుసుముల ద్వారా పంచాయతీలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. సాధారణ పద్ధతుల్లో చెల్లింపుల కారణంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. డిజిటల్ చెల్లింపులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే నిధుల దుర్వినియోగానికి అవకాశం ఉండదని అధికారులు భావిస్తున్నారు. పంచాయతీల్లో ఇప్పటికే యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. స్వర్ణ పంచాయతీ పోర్టల్, డిజిటల్ చెల్లింపులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే పాలనలో పారదర్శకతతో పాటు సేవలు వేగవంతమవుతాయని జిల్లా పంచాయతీ అధికారిణి బి. అరుణశ్రీ తెలిపారు. పంచాయతీల్లో మార్చి 15 నాటికి శత శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

# గుడ్లు మింగుతున్న గుత్తేదారు

ఆళ్లగడ్డ : అధికారులు 'గుడ్లు'తేలేయడంతో గుత్తేదారు నెలకు రూ.లక్షలు గుటుక్కున మింగేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొన్న వారికి ఒక్కొక్కరికి నెలకు 25 గుడ్లు అందించాలి. బాలింతలు, గర్భిణులకు టేక్ హెూమ్ రేషన్‌తో కలిపి ఇంటికే పంపిస్తున్నారు. మూడేళ్ల లోపున్న చిన్నారులకు పాలతోపాటు గుడ్లు ఇంటికే అందిస్తున్నారు. 3- 6 ఏళ్ల వయస్సున పిల్లలకు కేంద్రంలోనే భోజనంతోపాటు గుడ్లు ఇస్తున్నారు.

**రంగులు మరిచారు** ఆళ్లగడ్డలో పంపిణీ చేస్తున్న గుడ్లకు పంపిణీదారు ఎలాంటి రంగులు వేయకుండానే సరఫరా చేస్తుండటం గమనార్హం.“ గుత్తేదారు సరఫరా చేసే గుడ్లను పరిశీలిస్తాం. ఒక ట్రేలోని గుడ్ల బరువు 1500 గ్రాములు ఉండాలి. బరువు తక్కువగా ఉంటే వెనక్కి పంపిస్తాం. గుడ్ల మీద రంగులు వేయకున్నా సదరు సరఫరాదారుపై చర్యలు తీసుకుంటామని” సీడీపీవో తేజేశ్వరి పేర్కొన్నారు.

**నెలకు రూ.4 కోట్ల ఖర్చు** ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నెలకు 80 నుంచి 85 లక్షల వరకు గుడ్లు అవసరం అవుతాయి. సరఫరా బాధ్యతను గుత్తేదారుకు అప్పగించారు. నెలకు రూ.4 కోట్ల వరకు బిల్లు చెల్లిస్తున్నారు.నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ) నిర్ధారించిన ప్రకారం ధర నిర్ణయించారు. రవాణా ఛార్జీల కింద ఒక గుడ్డుకు 81 పైసలు గుత్తేదారుకు ఇస్తున్నారు.'నెక్' ప్రకారం టోకు ధర రూ.4.62 ఉండగా, రవాణా ఛార్జీలు కలుపుకొని ఒక గుడ్డుకు రూ.5.43 వరకు చెల్లిస్తారు. నిబంధనల ప్రకారం ఒక ట్రే (30 గుడ్లు) బరువు 1,500 గ్రాములు ఉండాలి.

# ఎంఐజీ లేఅవుట్లు.. కలేనా?



తిరుపతి : మధ్య ఆదాయ వర్గాల (ఎంఐజీ) కోసం లేఅవుట్లు వేసి అందుబాటు ధరల్లోనే ప్లాట్లు ఇస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. భూసేకరణపై ఎంతకూ శ్రద్ధ చూపకపోవడంతో ప్రకటన కాగితాలకే పరిమితమైంది. కొన్నిచోట్ల సార్వత్రిక ఎన్నికలకు ముందు మౌలిక వసతుల కల్పనకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా యంత్రాంగంలో కదలిక రాలేదు. ఇప్పటికైనా వీటిపై దృష్టిపెడితే మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఉద్యోగులు, పెన్షనర్లకూ ప్లాట్లు ఇస్తామని తెలిపారు. 20 శాతం రాయితీ ఇస్తామని స్పష్టం చేశారు. ఆచరణలో ఇవన్నీ గాలికి కొట్టుకుపోయాయి. చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా) పరిధిలో పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరులో భూసేకరణ చేస్తామని వెల్లడించారు. పూతలపట్టులో తొలుత 12.60 ఎకరాల్లో ప్లాట్లు వేయాలని నిర్ణయించారు. అనంతరం 25 ఎకరాలు సేకరించాలని భావించారు. తీరా రైతులకు పరిహారం ఇచ్చేంత డబ్బులు ప్రభుత్వం వద్ద లేవని వెనక్కు తగ్గారు. గంగాధర నెల్లూరులోనూ పారిశ్రామికవాడకు ఎదురుగా లేఅవుట్ వేయాలని భావించినా ప్రజల నుంచి డిమాండ్ ఉండదని విరమించుకున్నారు.

**చిత్తూరులో హడావుడిగా శంకుస్థాపన**

చిత్తూరు నగరంలో కోడిగుట్టలో 35.25 ఎకరాల్లో లేఅవుట్ వేసేందుకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందులో 19.18 ఎకరాలు డీకేటీ కాగా మిగిలినవి పట్టా భూములు. డీకేటీ వరకు భూములు కోల్పోయే వ్యక్తులకు పరిహారం ఇచ్చారు. మౌలిక వసతులు కల్పించేందుకు టెండర్లు ఆహ్వానించినా అప్పట్లో ఆసక్తి చూపలేదు. చివరకు సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. తర్వాత పనులు ముందుకు సాగలేదు.

**నిబంధనల్లో మార్పే కారణమంటూ**

నగరిలో కీలపట్టులో భూసేకరణ చేసినా మౌలిక సదుపాయాలు లేవు. సూళ్లూరుపేటలో మన్నారుపోలూరులో 25 ఎకరాల్లో స్థలాన్ని ఎంపిక చేయడంతోనే సరిపెట్టారు.

పనులు ముందుకు సాగకపోవడానికి ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధనలే కారణమని అధికారులు అంటున్నారు.

గతంలో అంతర్గతంగా 40 అడుగుల వెడల్పు రోడ్డు ఉండాలనే ఉత్తర్వులు ఉండగా గతేడాది డిసెంబరులో దీన్ని 30 అడుగులకు సవరించారు.

ఈమేరకు మార్పులు చేసేందుకే సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు.

రెండు నెలలు గడిచినా ఉన్నతాధికారులకు ప్రణాళికలు పంపకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

**ఒడిసి పడితే నగదు**

ముమ్మరంగా ఇంకుడు గుంతల తవ్వకంపుత్తూరు, న్యూస్‌టుడే: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంపొందించడమే లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది.. దీనికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డ్వామా ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు.. ఇళ్లలో వినియోగించిన, వర్షపు నీరు వృథాగా పోనీయకుండా ఇంటి ప్రాంగణంలోనే ఇంకేలా గుంతలు తవ్విస్తున్నారు. క్షేత్ర సహాయకులు ఆసక్తి ఉన్న కూలీల వివరాలు సేకరించి ఈ నెలాఖరు లోగా పనులు పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టారు.

**కూలీల ఖాతాకే జమ..**

ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఇళ్ల ముంగిట నాలుగు అడుగుల లోతు, 30 అంగుళాల వెడల్పుతో తవ్వడం, సిమెంటు ఒరలు దించడం, ఇసుక, కంకరతో నింపి పైన మూత వేయాలి. జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలతో వీటిని తవ్వించి నిధులు వారి ఖాతాలకు జమ చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు వ్యాప్తంగా ఉన్న 64 మండలాల్లో.. ఒక్కో మండలానికి వెయ్యి చొప్పున నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ముఖ్యంగా నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరులో 30 శాతం పనులు పూర్తయ్యాయి.

# మూడోసారి ఆదరించనున్నారు!



చిత్తూరు : వెనకబడిన తరగతుల సంక్షేమం, స్వయం ఉపాధి లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వం ఆదరణ పథకాన్ని అమలు చేసింది. 1999-2004లో చంద్రబాబు ఈ పథకానికి రూపకల్పన చేసి బీసీలకు రాయితీపై పరికరాలు అందజేయడంతో వేలాది మందికి స్వయం ఉపాధికి అవకాశం లభించింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్, వైకాపా ఈ పథకాన్ని అటకెక్కించాయి.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆదరణ-3 పథకాన్ని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు పచ్చజెండా ఊపారు.

బీసీల్లో ఎక్కువ మంది చేతివృత్తులు చేసుకునేవారే. వడ్రంగి, తాపీ పని, ఎలక్ట్రికల్, భవన నిర్మాణం, టైలరింగ్ వంటి వృత్తులు చేసే వారికి అవసరమైన పరికరాలు అందజేయడానికి తెదేపా ప్రభుత్వం ఆదరణ పథకాన్ని తెచ్చింది. 2018లో ఈ పథకాన్ని పునరుద్ధరించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 90 శాతం రాయితీపై యూనిట్లు అందజేశారు. లబ్ధిదారుల వాటాగా యూనిట్ ధరలో 10 శాతం మాత్రమే చెల్లించేలా పథకాన్ని అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 24 వేల మంది దరఖాస్తు చేసుకోగా, 12 వేల మంది యూనిట్లు పొందారు. తర్వాత వచ్చిన వైకాపా ఈ పథకాన్ని నిలిపివేసింది. అప్పట్లో లబ్ధిదారులు చెల్లించిన 10 శాతం వాటా తిరిగి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఆదరణ-3 పథకానికి పచ్చజెండా ఊపడంతో బీసీ వర్గాల్లో ఆశలు రేగాయి. భవన నిర్మాణ రంగ పని విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన పరికరాలు అందించాల్సిన అవసరం ఉంది.

'ఆదరణ-3 పథకానికి ఏప్రిల్ నుంచి కార్యాచరణ ప్రారంభం కానుంది. త్వరలో మార్గదర్శకాలు వెలువడనున్నాయని తదనంతరం ప్రక్రియ మొదలు పెట్టి అర్హులకు లబ్ధి చేకూరుస్తా'మని బీసీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీదేవి తెలిపారు.

మళ్లీ ఆశలు..

ఉమ్మడి జిల్లాలో బీసీ కులాలు: 141

కులవృత్తిదారులు: ఐదు లక్షల మంది

ఆదరణ-2 కింద వచ్చిన దరఖాస్తులు: 67 వేలు

లబ్ధిదారులకు మంజూరు: 28 వేలు

# వేణుగోపాలా.. భూముల జాడ లేదయా!



బొబ్బిలి : బొబ్బిలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూముల వ్యవహారం అయిదేళ్లు అవుతున్నా కొలిక్కి రాలేదు. 2020 ఆగస్టు 2, 3, 4 తేదీల్లో స్వామి ఆస్తులను దేవదాయశాఖ రాష్ట్ర బృందం ప్రత్యేకంగా లెక్కించింది. ఎక్కడ ఎన్ని ఎకరాలు ఉన్నాయి? ఎన్ని ఆభరణాలు ఉన్నాయన్నది రికార్డుల ప్రకారం తేల్చారు. ఆభరణాల లెక్క తేలడంతో సుమారు 18 కిలోల బంగారం, వెండి పలు బ్యాంకుల లాకర్లలో భద్రపరిచారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న భూములను మాత్రం క్షేత్రస్థాయిలో గుర్తించలేకపోయారు. ఆరు నెలల్లో కొలిక్కి వస్తాయని అప్పట్లో చెప్పగా ఇంతవరకు అతీగతీ లేదు.

**ఇవీ ఇబ్బందులు** వేణుగోపాలుడి భూముల వ్యవహారంపై రీసర్వేతోనే స్పష్టత వస్తుందని అప్పట్లో చెప్పుకొచ్చారు. కొన్నిచోట్ల సర్వే పూర్తయినా లెక్క తేలలేదు. కొన్ని భూములకు సర్వే నంబర్లు లేక సమస్య వస్తోంది. ఆలయ భూములే అని చెప్పడానికి వీలులేకుండా కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు.

గుర్తించిన వాటిలో బలిజిపేట మండలం అజ్జాడతో పాటు బొబ్బిలి మండలంలో 714 ఎకరాలున్నాయి. వీటి నుంచి ఎలాంటి శిస్తు రాలేదు. పాత బొబ్బిలిలో 10 ఎకరాలు, గొల్లపల్లి-9.30, ఎంబన్నవలస-3, తెర్లాం-6.87 ఎకరాల నుంచి నామమాత్రపు శిస్తులు వస్తున్నాయి. నిబంధనల మేరకు దేవదాయ శాఖకు చెల్లించాల్సిన రుసుములు జమ చేయడం లేదు. వేలం పాటలతో కొత్త వారికి అప్పగించాలని అనుకున్నా ప్రక్రియ ముందుకు కదలడం లేదు. రైతులు సహకరించడం లేదు.

శ్రీకాకుళం జిల్లా పద్మాపురంలో 1.32 ఎకరాలు, రామంపేట-9, మల్లివీడు-240, వాటపాగు-30 ఎకరాలున్నట్లు తేల్చినా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.

మొఖాస కొత్తవలసలో 1,585 ఎకరాల భూములు ఉన్నప్పటికీ వాటి ఆనవాళ్లు లేవు.

స్వామి భూముల చిట్టా

మొత్తం ఎకరాలు: 4,011

గుర్తించినవి: 714

గుర్తించాల్సినవి: 3,297వేలం వేస్తాం.. స్వామి భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆయా మండలాల తహసీల్దార్లను కోరాం. ఇంతవరకు గుర్తించలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అజ్జాడ రైతుల చేతిలో కొన్ని భూములున్నాయి. సాగు చేస్తున్న వాటికి లీజులు ఇవ్వాలని వారిని కోరాం. అయినా ముందుకు రాలేదు. వాటిని స్వాధీనం చేసుకుని కౌలుకు వేలం వేస్తాం. ప్రసాద్, కార్యనిర్వాహక అధికారి

# కాలువ గట్లనూ వదల్లేదు..!

జీలుగుమిల్లి : మట్టి మాఫియా ఇష్టానుసారంగా రెచ్చిపోతుంది. పగలు రాత్రి తేడా లేకుండా మట్టి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి అక్రమార్జనకు కొంత మంది అధికారు లు చేతులు కలపడంతో ఏకంగా కిలోమీటర్ల మేర కాలువ గట్టునే తవ్వేస్తున్నారు. గోదావరి జలాలను కృష్ణమ్మకు చేర్చి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తెదేపా ప్రభుత్వం పదేళ్ల కిందట చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభించింది. తొలి రోజుల్లో ప్రధాన కాలువ తవ్వి మట్టిని గట్టుగా ఇరువైపులా పోశారు. వైకాపా హయాంలో పనులు నిలిపోయాయి. దీంతో ఈ కాలువ గట్టుపై కన్నేసిన మాఫియా ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తున్నారు.

అడిగేవారు లేరని.. ఎత్తిపోతల పథకం మూలనపడటంతో ఆ శాఖాధికారులు వేరే శాఖలకు బదిలీ అయ్యారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ సంబంధం లేదంటూ తప్పుకొంటున్నారు. దీంతో అక్రమార్కులు జీలుగుమిల్లి మండలం పి.రాజవరం నుంచి టి.నరసాపురం మండలం సీతంపేట, గంగినీడిపాలెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం వరకు గట్టుకు గండ్లు పెట్టి మట్టిని దోచేస్తున్నారు. ఇలా పది కిలోమీటర్ల మేర కాలువ గట్టు కానరాకుండా చేశారు. మాఫియా తవ్వేసిన కాలువ గట్టుపై కొన్ని



చోట్ల రైతులు పంటలు కూడా సాగు చేయడం గమనార్హం.

గ్రావెల్‌కు గిరాకీ ఉండటంతో.. ప్రస్తుతం గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉంది. ఒక ట్రక్కు మట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అమ్ముతున్నారు. దీంతో సీతంపేటకు చెందిన వైకాపా నాయకుడు రెండు యంత్రాలు ఏర్పాటు చేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నిత్యం మట్టి రవాణా చేస్తున్నారు. భవిష్యత్తులో కాలువ పనులు సాగిస్తే గట్టును పటిష్ఠం చేసేందుకు గ్రావెల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ప్రస్తుతం గట్టు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా కాలువలోకి వస్తూ గండ్లు పడుతున్నాయి. పలుమార్లు రెవెన్యూ సిబ్బందిని కాలువ గట్టుపై తవ్వకాలను నివారించేందుకు పంపించానని టి.నరసాపురం తహసీల్దార్ సత్యసాయిబాబా తెలిపారు. వారం రోజుల పాటు గస్తీ ఏర్పాటు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# దృష్టి పెడితే గట్టి మేలు

ఏలూరు: వైకాపా ప్రభుత్వ అలసత్వం..జగన్ అభివృద్ధిని గాలికొదిలేయడం..కేటాయించిన నిధులను దారి మళ్లించడం వంటి కారణాలతో జిల్లాలో ఎన్నో ప్రభుత్వ భవనాలు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను వెక్కిరిస్తున్నాయి. బడ్జెట్ వేళ కూటమి సర్కారు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

**గుత్తేదారుకు బకాయిలతో..**

మన్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2020లో పోలవరంలో 30 పడకల సీహెచ్‌సీ ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నా వైకాపా పాలకులు నాలుగేళ్లు కాలం గడిపేశారు. రూ.5.16 కోట్లతో మొదలు పెట్టిన నిర్మాణ పనులు 50 శాతం పైగా పూర్తయ్యాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు తదితరాలు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారులకు భారీగా బకాయిలు ఉండటంతో చాలా కాలంగా పనులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుత ఆసుపత్రిలో చాలీచాలని గదుల్లో రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**100 పడకలకు అయిదేళ్లుగా..**

చింతలపూడిలోని 100 పడకల ఆసుపత్రి నిర్మాణం రూ.22 కోట్లతో 2020లో మొదలు పెట్టారు. ఇప్పటికి అయిదేళ్లు గడుస్తున్నా నిధుల సమస్యతో పూర్తి కాలేదు. వైకాపా పాలనలో గుత్తేదారులకు దాదాపు రూ.4 కోట్ల బకాయిలున్నాయి. ఇప్పటికి 60శాతం వరకు పూర్తి కాగా నిధులిస్తే త్వరగా ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.



అంతటా అంతే.. జిల్లాలో సచివాలయాలు మొదలు..రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు, మార్కెటింగ్ శాఖ పరిధిలోని మల్టీపర్పస్ గిడ్డంగులు, నాడు - నేడు పాఠశాలలు ఇలా చాలా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అంగన్‌వాడీ, క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు తెదేపా ప్రభుత్వ హయాంలో 60 నుంచి 80 శాతం వరకు పూర్తి అయినా వైకాపా సర్కారు కనీసం పట్టించుకోలేదు. అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రాలైతే నియోజకవర్గానికి మూడు నాలుగు ఉన్నాయి. వీటిల్లో రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తే పూర్తి చేసే పనులే అధికం. తెదేపా మొదలు పెట్టిన పనులు తాము ఎందుకు పూర్తి చేయాలన్న అక్కసుతో గాలికొదిలేశారు.

**రాజకీయ క్రీనీడ**

భీమడోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2017 తెదేపా పాలనలో రూ.2.5 కోట్లతో క్రీడా వికాస కేంద్రం, ఇండోర్ మైదానం, క్రీడాకారులకు వసతి గృహ నిర్మాణం మొదలు పెట్టారు. ఏడాదిన్నరలో శరవేగంగా 65 శాతం పనులు చేశారు. ప్రభుత్వం మారటంతో వైకాపా సర్కారు వీటికి పైసా విదల్చలేదు. రూ.కోటి కేటాయిస్తే అన్ని పనులు పూర్తి చేయవచ్చు. ఈ కేంద్రాలు జిల్లాలో దాదాపు 10 వరకు అసంపూర్తిగా మిగిలాయి.

**కూటమి సర్కారు కరుణిస్తేనే..**

గత తెదేపా పాలనలో చివరి దశలో ఉన్న భవనాలను సైతం వైకాపా గాలికి వదిలేసింది. అలానే వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మొదలు పెట్టిన పనులనూ అర్ధంతరంగా నిలిపేసింది. ఫిబ్రవరి-28న కూటమి సర్కారు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అసంపూర్తి భవనాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలతో నిధులు మంజూరు చేస్తే పూర్తయ్యే దశలో ఉన్న పనులన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

# మారనున్న పురం రూపురేఖలు

హిందూపురం : ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలన్నా రహదారుల పాత్ర కీలకం. కానీ, రెండు లక్షల జనాభా ఉన్న, జిల్లాలోనే అతి పెద్ద పట్టణమైన హిందూపురంలో రహదారులను చూస్తే చిన్న పంచాయతీని తలపిస్తాయి. పట్టణంలోకి రావాలన్నా, బయటకు పోవాలన్నా రాకపోకలకు ఇబ్బంది తప్పదు. ఇక పట్టణంలో అన్నీ ఇరుకు రోడ్లే. ఇక్కడి పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం చరిత్రలోనే చారిత్రాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో కొన్ని రహదారులు మున్సిపల్ శాఖ, మరి కొన్ని రోడ్లు జిల్లా రహదారులు, ఇంకొన్ని రోడ్లు.. భవనాల శాఖ, మరికొన్ని రాష్ట్ర హైవే తదితర శాఖలు, విభాగాల పరిధిలో ఉన్నాయి. దీంతో వీటి పరిధి, విస్తరణ, విస్తీర్ణం, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేయించారు. 60 కిలోమీటర్ల పొడవైన 24 రహదారులను రూ.200 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

**పనులు ఆర్అండ్బీకి..**

ఈ పనులను మున్సిపల్ శాఖతో చేయిస్తే విపరీతమైన జాప్యం అవుతుందని, రెండు శాఖలను సమన్వయం చేసి పనులు చేయించాలన్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తాయని గుర్తించారు. దీంతో హిందూపురం రహదారుల అభివృద్ధి పనులను రోడ్లు భవనాలశాఖకు అప్పగించాలని నిర్ణయించారు. ఇక్కడ ఆర్అండ్బీలో ఒకే ఒక్క ఇంజినీర్ ఉండటంతో రూ.200 కోట్ల పనుల పర్యవేక్షణ సాధ్యం కాదని.. ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసి, మరి కొందరు ఇంజినీర్లను నియమించేలా చూడాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పట్టణంలో రహదారుల విస్తరణకు



అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపు, విస్తరణకు అవసరమైన భూసేకరణను మున్సిపల్ అధికారులు చూడాలని ఆదేశాలిచ్చారు. అభివృద్ధికి గుర్తించిన రహదారుల్లో 13 మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన 11 రోడ్లను కూడా రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ మున్సిపాలిటీ తీర్మానం చేయించి, ఉన్నతాధికా రులకు పంపించారు.

**ప్రధానమైన రోడ్లు ఇవే..**

పట్టణంలోని రైల్వే రోడ్డు, బైపాస్ రోడ్డు, మేళాపురం నుంచి ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి రోడ్, బెంగళూర్ రోడ్, కొటిపి రోడ్, దండు రోడ్డు, వాసవీ ధర్మశాల రోడ్, చర్చి రోడ్, పెనుకొండ రోడ్డు, ఒక్కటో పట్టణ పోలీసుస్టేషన్ రోడ్, పైపులైన్ రోడ్, చిన్న మార్కెట్టు రోడ్డు, కదిరి రోడ్ (కొట్నూరు వరకు) శాసనకోట రోడ్, లేపాక్షి రోడ్డు.


**అప్పగింత దస్త్రం ఉన్నతాధికారులకు- శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**

ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు 24 రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఈ పనులను రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ, కౌన్సిల్ ఆమోదం తీసుకొని దస్త్రాలు పంపాము. బడ్జెట్టు ఆమోదం తరువాత నిధులు వచ్చే అవకాశం ఉంది.

# రూ.కోట్లు కుమ్మరింత.. కళ్లప్పగింత!!

విశాఖపట్నం: 'రేపటి ఆర్థిక నగరాలు' అనే అంశంపై విశాఖలో 2023 మార్చిలో జి-20 సన్నాహక సదస్సు నిర్వహించారు. నగరాల్లో నాణ్యమైన మౌలిక వసతుల కల్పన, ఆదాయ వనరుల పెంపు, ప్రైవేటు భాగస్వామ్యం వంటి అంశాలపై ఇందులో కీలకంగా చర్చించారు. అలాంటి సదస్సు నిర్వహణకు రూ.కోట్ల నిధులు కేటాయించినా.. నగరవాసులకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించలేకపోయారు. కొందరు నేతలు, అధికారుల జేబులు మాత్రం నిండాయనే విమర్శలున్నాయి. వైకాపా హయాంలో చేపట్టిన పనులు రెండేళ్లకే ఆనవాళ్లు కోల్పోయాయి.

కాకిలెక్కలతో: జీవీఎంసీ పరిధిలో 'జి-20' సదస్సు నిర్వహణ పేరుతో రూ.115 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇందులో రహదారి డివైడర్ల గ్రిల్స్‌కు రంగులు వేసేందుకు రూ.3.20 కోట్లు కేటాయించారు. బీచ్ రోడ్డులో తెన్నేటి పార్కు, సీతకొండ వద్ద పెయింటింగ్ వేసేందుకు



రూ.30లక్షలు వెచ్చించారు. తెన్నేటి పార్కు వద్ద బొమ్మలు వేసేందుకు రూ. లక్షలు ఖర్చు చేసినట్లు అప్పట్లో కాకి లెక్కలు చూపించారు. ప్రస్తుతం ఈ బొమ్మలు వెలిసిపోయి కళాహీనంగా దర్శనమిస్తున్నాయి. ఆర్కేబీచ్, సీతకొండ వద్ద రూ.1.40 కోట్లతో సోలార్ ట్రీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయే తప్ప రాత్రిళ్లు దీపాలు పని చేయడం లేదు. సాగర్‌నగర్, మరికొన్ని చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

నిర్వహణలేక మూలకు చేరాయి. బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల మరమ్మతులకు రూ.23 కోట్ల మేర ఖర్చు చేశారు. ప్రస్తుతం చాలా చోట్ల టైల్స్ ధ్వంసమై దర్శనమిస్తున్నాయి. వ్యూపాయింట్ సమీపంలో చేసిన పనులు సైతం దెబ్బతిన్నాయి. కోస్టల్ బ్యాటరీ నుంచి రాడిసన్‌బ్లూ వరకు ప్రత్యేక లైటింగ్‌కు రూ.3కోట్లుపైగా ఖర్చు చేయగా అవీ మూడురోజుల ముచ్చటే అయ్యాయి. సుందరీకరణ పేరుతో నిధులు కుమ్మరించగా కొద్దిరోజులకే అవి చెల్లాచెదురయ్యాయి.

**టెండర్లు ఇష్టారాజ్యంగా**

నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు అప్పగించి నాడు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. టెండర్లు ఆహ్వానించడానికి ముందే గుత్తేదారులతో ఆ పనులు చేయించడం గమనార్హం. మరోవైపు షార్ట్ టెండర్లు పేరుతో పెయింటింగ్స్‌కు నిధులు కుమ్మరించి దుర్వినియోగం చేశారు. రహదారుల పేరిట.. చేసిన పనులే చేసి పైపై పూతలు పూసి నిధులు జేబుల్లో వేసుకున్నారు. వీటిపై విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేయాలంటూ అప్పట్లో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ప్రభుత్వానికి లేఖ రాశారు. వైకాపా నేతల హోటళ్లు, ఆస్తులున్న చోట్ల అభివృద్ధి పనులు పేరిట నిధులు ఎక్కువగా ఖర్చుచేసి, మిగిలిన చోట్ల తాత్కాలిక పనులతో మమ అనిపించారు.

# ఆన్‌లైన్‌లో జూదం.. ప్రాణాలే పణం




ఉరవకొండ : ఉమ్మడి అనంత జిల్లాలో బెట్టింగ్ భూతం పడగవిప్పుతోంది. తొలుత సరదాగా ప్రారంభమై.. వ్యసనంగా మారి, చివరకు ప్రాణాలు బలిగొంటోంది. దీని ఉచ్చులోపడి యువత విలవిల్లాడుతున్నారు. ఏదో ఒకరోజు గెలుస్తామనే ధీమాతో అప్పులు చేసి మరీ బెట్టింగ్ ఆడతారు. వాటిని తీర్చే మార్గం కనబడక ఒత్తిడికి గురవుతున్నారు. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు సులువుగా ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడుతున్నారు. ఆ వ్యసనం నుంచి గట్టెక్కలేక అర్ధాంతరంగా ఉసురు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న బెట్టింగ్ యాప్ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉరవకొండ మేజర్ పంచాయతీకి చెందిన ఓ యువకుడు బెంగళూరులో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. స్నేహితులతో కలిసి డేటా బెట్‌యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. ఆ మొత్తం పోయింది. అంతటితో ఆగకుండా అప్పులు చేసి మరీ ఆడాడు. అవీ పోయాయి. స్నేహితులు సైతం తమ డబ్బులు ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చారు. అప్పులు రూ.8 లక్షలకు చేరుకోవడంతో తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై ఈనెల 8న క్రిమి సంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అప్పుల విషయంలో మిత్రులు అనవసరంగా గొడవ చేయడంతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బెట్టింగ్ భూతానికి కొడుకును కోల్పోయామని వాపోయారు.

విడపనకల్లు మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో ఫజిల్ ఆడితే లభించే గోల్డ్‌కాయిన్ ఆధారంగా రెట్టింపు స్థాయిలో డబ్బు వస్తుందని నిర్వాహకులు వల విసిరారు. ఆశపడి జూదం ఆడాడు. ఇది మోసమని గుర్తించే లోపు రూ.16.31 లక్షలు పోగొట్టుకున్నాడు. వ్యవసాయం చేస్తున్న అతనికి ఆన్‌లైన్ గేమ్ ద్వారా తీరని నష్టం జరిగింది. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. జూదం రైతును కోల్పోలేని దెబ్బతీసింది.

పుట్టపర్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు సాఫ్టవేర్ ఉద్యోగం చేస్తూ నెలకు 70,000 జీతం ఆర్జిస్తూ సంతోషంగా ఉండేవాడు. ఈ సమయంలో ఆన్‌లైన్ జూదానికి అలవాటుపడి జీతం చాలక అప్పులు చేయడం మొదలుపెట్టాడు. చివరికి ఇష్టంగా కొనుక్కున్న ద్విచక్ర వాహనాన్ని కూడా తాకట్టు పెట్టాడు. ఆరంకెలు జీతం సంపాదిస్తున్న కొడుకుని చూసి సంతోషపడిన తల్లిదండ్రులు ఇటీవల అతడి మానసిక పరిస్థితి చూసి విచారిస్తే అప్పుల్లో కూరుకుపోయినట్లు గుర్తించి తల్లడిల్లిపోయారు. గుట్టుచప్పుడు కాకుండా అప్పులుతీర్చి కుటుంబ పరువు కాపాడుకున్నారు. ఇంకెవ్వరూ ఈ మహమ్మారి జోలికి వెళ్లొద్దని కోరుతున్నారు.

**టీ కేఫ్‌లే వేదికలు**

నగరం, పట్టణ పరిసర ప్రాంతాల్లో టీకేఫ్‌లు వేదికగా నిలిచాయి. విద్యార్థులు, యువత కళాశాలలు, పనులు వదులుకుని బృందాలుగా అక్కడికి చేరుకుని గంటలకొద్దీ ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతున్నారు. కొన్ని సందర్భాల్లో బహిరంగంగా గొడవలకు దిగుతున్నారు. అలాంటి వేదికలపై పోలీసులు కొంత నిఘా ఉంచితే ఆన్‌లైన్ గేమ్‌ల నియంత్రణకు అవకాశం ఉంటుంది.

**ఏదో ఒకచోట ఆపగలగాలి- గరుగు బాలాజీ, సైకియాట్రిస్టు, అనంతపురం**

మద్యపానం, జూదం లాగే ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ వ్యసనం. తీవ్రత పెరిగితే వ్యాధిగా మారుతుంది. డబ్ల్యూహెచ్‌వో 'గ్యాంబ్లింగ్ డిజార్డర్'ను వ్యాధిగా గుర్తించింది. ఇది తొలుత కుతూహలంతో ప్రారంభమవుతుంది. ఆ జూదంలో ఉన్న ఉన్నతస్థాయి అనుభూతి (కిక్) మనిషికి హాయిని ఇస్తుంది. డబ్బులు గెలిచినప్పుడు కలిగిన అనుభూతి పదేపదే కావాలని కోరుకుంటారు. ఆటలో డబ్బులుపోయినా వెనక్కు తగ్గరు. అప్పులు చేసైనా ఆడతారు. ఇలా ఆడుతూ ఊబిలోకి దిగుతారు. డిప్రెషన్‌కు గురవుతారు. చివరికి చనిపోవాలనే నిర్ణయం తీసుకుంటారు. వ్యసనాన్ని ఏదో ఒకచోట ఆపగలగాలి. లేదా చికిత్స ఇప్పించాలి. ఇలా చేస్తే ఆత్మహత్యలు ఆపవచ్చు.

# గుంతకల్లుపై గురిపెడితేనే..



అనంతపురం : 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంతకల్లు బ్రాంచి కెనాల్ ఆధునికీకరణ పనులు వైకాపా హయాంలో నిలిచిపోయాయి. దీనికితోడు ఐదేళ్లపాటు నిర్వహణ లేకపోవడంతో కాలువ ఎక్కడికెక్కడ బలహీనపడింది. గట్లు కుంగిపోవడం, గండ్లు పడటం తరచూ సంభవిస్తున్నాయి. అక్విడక్టులు, అండర్ టన్నెల్‌లు పూర్తిగా దెబ్బతిని ఎప్పుడు పడిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఫలితంగా 600 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలువలో కేవలం 320 క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉంటోంది. పంట కీలక దశలో ఉన్న సమయాల్లో కాలువలో గండ్లుపడి నీరు ముందుకు సాగడం లేదు. మరమ్మతులకు ప్రతిసారీ ప్రవాహాన్ని నిలిపేసి పనులు చేయాల్సి వస్తోంది. దీంతో ఆయకట్టులో సాగుచేసిన మిరప తదితర పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి జీబీసీని ఆధునికీకరించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

2017లో ఎమ్మెల్సీగా ఉన్న పయ్యావుల కేశవ్ జీబీసీ అధునికీకరణ పనుల ఆవశ్యకతను అప్పటి తెదేపా ప్రభుత్వానికి వివరించి పనులు మంజూరు చేయించారు. రూ.232 కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. మొదటి ప్యాకేజీలో 29 కిలోమీటర్ల ప్రధాన కాలువ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీల లైనింగ్, కాలువ విస్తరణ దాదాపు పూర్తి చేశారు. రెండో ప్యాకేజీలో కాలువ విస్తరణ చేపట్టారు. 30 కిలోమీటర్ల మేర పనులు జరగాల్సి ఉంది. వైకాపా అధికారంలోకి వచ్చాక పనుల్ని రద్దు చేసింది. అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్ హంద్రీనీవాతో పాటు జీబీసీని బాగు చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగానే జీబీసీలో అత్యవసర మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఇదే సరైన సమయం**


ప్రస్తుతం జీబీసీలో ప్రవాహం ఆగిపోయింది. ఆయకట్టు కింద 4 వేల ఎకరాల్లో పంటలు కీలక దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరో టీఎంసీ నీరు విడుదల చేయాలని తుంగభద్ర బోర్డును కోరారు. దీనిపై టీబీ బోర్డు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ నీరు విడుదలైనా వారం రోజులు మాత్రమే ప్రవాహం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో మార్చి మొదటివారం నుంచి జీబీసీ మరమ్మతు పనులు మొదలుపెడితే జులై నాటికి పూర్తిచేయవచ్చు. ఇప్పుడు ఆలస్యం చేస్తే మరో ఏడాది సమయం వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని పనుల్ని పూర్తిచేయించాలని రైతులు కోరుతున్నారు.

**మరమ్మతులు చేపడతాం- రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ**

జీబీసీకి మరో 0.5 టీఎంసీ నీరు రావాల్సి ఉంది. ప్రవాహం పూర్తిగా తగ్గిపోయిన తర్వాత మరమ్మతులు చేపడతాం. ఇప్పటికే అత్యవసర మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతాం.

# దళారులను నమ్మొద్దు.. నేతల చుట్టూ తిరగొద్దు

తిరుపతి : వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ నియామక ప్రకటనతో దళారులు వసూళ్లకు తెర తీశారు. రూ.లక్ష నుంచి రెండు లక్షలిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని దగా చేస్తున్నారు. ఇప్పటికే కొందరు డబ్బులు ముట్టజెప్పారనే ప్రచారం జరుగుతోంది. స్థానిక నేతల వద్దకు దరఖాస్తుదారులు క్యూకట్టడంతో సిఫార్సు లేఖలిచ్చి ఫోన్ చేస్తున్నట్లు సమాచారం. వైద్య ఆరోగ్యశాఖలో ఒప్పంద, పొరుగు సేవల కింద 66 అటెండర్లు, టెక్నీషియన్లు, పారా మెడికల్ పోస్టులకు 3,800 దరఖాస్తులు అందాయి. ఎస్వీ వైద్య కళాశాల 27, రుయా 27, జీఎన్ఎం స్కూల్ 8, పద్మావతమ్మ నర్సింగ్ కాలేజ్ 1, ప్రసూతి ఆస్పత్రి 3 పోస్టులు భర్తీ చేయనున్నారు. వైకాపా హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాటి మంత్రి అండతో అధికారులు పోస్టుకు ఇంతని డబ్బు



వసూలు చేశారు. ఈ నేపథ్యంలో నియామకాలను రద్దుచేసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎక్కడికక్కడ ప్రకటన ఇచ్చింది. 'ఉద్యోగాల భర్తీలో ఎలాంటి అవినీతి, సిఫార్సులకు అవకాశం ఉండదు. మెరిట్ ప్రాతిపదికను నియామకాలు చేపడతాం. దళారుల మాటలు నమ్మి మోసపోవద్ద'ని ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ తెలిపారు.

# పండగ పూటా పస్తులేనా?

కదిరి : కరవు జిల్లాలో కష్టజీవులకు ప్రధాన ఆధారం ఉపాధి హామీపథకమే. సాధారణ జనంతోపాటు వ్యవసాయం ఉన్న రైతులూ కూలీ పనులపై జీవనం సాగిస్తున్న పరిస్థితి. జీవనోపాధికి కల్పిస్తున్న ఉపాధి హామీ పనులకు సకాలంలో బిల్లులు అందడం లేదు. నెలన్నరగా చేసిన పనులకు కూలి అందక కష్టజీవులు దిక్కుతోచకున్నారు. సంక్రాంతి నుంచి శివరాత్రి పండగ వరకు పనులు చేశాం. అప్పటి నుంచి చెల్లింపులు జరగలేదు. ఈ రోజు గడిస్తే పండగను జరుపుకోవాల్సి ఉంది. జాగరణతో పాటు ఉపవాసం ఉండాల్సిందేనా అని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగకు పస్తులు ఉండకుండా బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

**వారానికోసారి ఇవ్వాల్సి ఉన్నా..**

ఉపాధి పథకం కూలీలకు వారానికోసారి బిల్లులు చెల్లింపులు చేస్తారు.



పండగల సందర్భంగా ఆలస్యం జరుగుతోంది. 45 రోజులు గడిచినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం నెలకొంది. అధికారులు మాత్రం అదిగో ఇదిగో అంటున్నారు. ఇప్పటికే కుటుంబ అవసరాలకు చేతి అప్పులు చేశారు. పండగ సరకులు సమకూర్చుకోవాలంటే అప్పులు పుట్టని పరిస్థితి. కాయకష్టానికి సొమ్ములు అందక పండగ సంతోషమూ లేకుండాపోయిందని కూలీలు వాపోతున్నారు. కనీసం ఒకవారం కూలినైనా చెల్లిస్తే కొంత ఊరట దొరుకుందని కోరుతున్నారు.

**ఐదు వారాల కూలి రావాలి- నారాయణస్వామి, ఉపాధికూలీ**

కూలీ పనులతోనే కుటుంబ జీవనం, భార్యాభర్తలిద్దరం ఐదు వారాలపాటు కూలీ పనులు చేశాం. పండగ నాటికి బిల్లులు ఇస్తారని ఆశపెట్టుకున్నాం. శివరాత్రికి ఒక్కరోజే మిగిలింది. కూలి సొమ్ములు ఇస్తారన్న నమ్మకం లేదు. సంతోషంగా జరుపుకోవాల్సిన శివరాత్రికి అప్పులకు వెళ్లక తప్పేలా లేదు. అవకాశముంటే బిల్లులు ఇచ్చి కూలీలకు సంతోషాన్ని పంచాలి.

**వారంలో బిల్లుల చెల్లింపు- విజయప్రసాద్, ఉపాధిహామీ పథకం పీడీ**

కూలీలకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. ఈ వారంలో వచ్చే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా చేసిన పనులకు బిల్లులు పెట్టాం. నిధులు విడుదల కావాల్సి ఉంది. వచ్చిన వెంటనే చెల్లింపు చేస్తాం.

# వాహనదారుల సహనానికి పరీక్ష

విశాఖపట్నం: ప్రభుత్వ కార్యకలాపాల్లో కృత్రిమమేధ(ఏఐ)ను ఉయోగించి సరికొత్తగా, త్వరగా సేవలు అందిస్తుంటే విశాఖ రవాణాశాఖలో అందుకు విరుద్ధంగా సాగుతోంది. చిన్నపాటి ఆన్‌లైన్ సేవలకు కూడా కార్యాలయం బాట పట్టించి ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారు. అదే అడ్డదారిలో ఏజెంట్ల ద్వారా వస్తే మాత్రం అరగంటలో చేసి పంపేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. దాదాపు అన్ని రకాల సేవల్లో అదే అమలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రజలు విసిగిపోతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుంతో పాటు అదనంగా చెల్లించుకుంటేనే వేగంగా పనులు అవుతున్నాయి. లేకుంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సిందేననే భావన వ్యక్తం అవుతోంది. 'వాహన్' వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక కొందరు అధికారులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లో చేయాల్సిన ఉన్నా కార్యాలయానికి రప్పిస్తున్నారు. వాహనాలకు ఆధార్ లింకు చేయడానికి, వాహనాన్ని మరో వ్యక్తి పేరున మార్చడానికి ఈకేవైసీ అవసరం. ఈ సందర్భాల్లో డీలర్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పుడు రవాణాశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారి పరిశీలించి ధ్రువీకరించాలి. అలా చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి నిమిషాల్లో ధ్రువీకరించే అవకాశమున్నా గాజువాక, విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఆర్టీవో కార్యాలయాల్లో చాలాసార్లు అలా చేయడం లేదు. ఈకేవైసీ నిమిత్తం విశాఖ రవాణాశాఖ కార్యాలయానికి వెళితే.. మొదట క్లర్క్‌ను కలవాలి. ఆ తర్వాత ఆర్టీవో ఒక నంబరిచ్చి తిరిగి క్లర్క్ దగ్గరకు పంపుతారు. ఆ తరువాత ఏవో పరిశీలనకు పంపిస్తున్నారు. ఇక్కడ ఒకటి, రెండు రోజులు గడిస్తేగాని ధ్రువీకరించడం లేదు.




అలా కాకుండా ఏజెంట్ ద్వారా వస్తే వరుసకట్టకుండానే ఆమోదించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బీ ద్విచక్ర వాహనాల బదిలీల్లో సీ-బుక్, రుణ వివరాల పత్రం, బీమా వంటి పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పిస్తే సరిపోతుంది. వాటిల్లో ఏమైనా తప్పిదాలుంటే కార్యాలయానికి పిలిపించాలి. ప్రస్తుతం అలా కాకుండా అన్ని పత్రాలను తీసుకొని నేరుగా హాజరవ్వాలని చెబుతున్నారు. వెళ్లాక కొన్ని పత్రాలు కనిపించడం లేదని, వెబ్‌సైట్ పనిచేయడం లేదంటూ చెప్పి తిరిగి పంపేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా వెళ్తే నిమిషాల్లో పనైపోతుందనే చర్చ సాగుతోంది. కొత్త ఆర్సీల విషయంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. నిబంధనల ప్రకారం రెండు వారాల్లో చేయాల్సినవి నెల రోజులకైనా అవ్వడం లేదు. కొన్నింటిని మూడు, నాలుగు నెలలు పెండింగులో ఉంచేస్తున్నారు. లైసెన్సులు, ఎల్ఎల్ఆర్‌లలోనూ అదే పరిస్థితి. జాప్యం లేకుండా: దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ఈకేవైసీ, ఇతర సేవల్లో జాప్యాన్ని పరిశీలించి వేగంగా అందించేలా చర్యలు తీసుకుంటాం' అని ఇన్‌ఛార్జి డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

చురకలు






# అందాల ఏంజిల్ శ్రీలీల

కన్నడ సినిమాలతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన శ్రీలీల టాలీవుడ్‌లో రాఘవేంద్ర రావు కొత్త సినిమా 'పెళ్లిసందడి'తో అడుగు పెట్టింది. టాలీవుడ్‌లో మొదటి సినిమా నిరాశ పరిచింది. అయినా కూడా తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. రాఘవేంద్ర రావు సినిమా హీరోయిన్ అంటే మినిమం ఉంటుంది. శ్రీలీల మొదటి సినిమా ఫలితంతో పట్టింపు లేకుండా వరుస ఆఫర్లు దక్కించుకుంది. లక్కీగా రవితేజతో నటించిన ధమాకా సినిమాతో సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. ఆ సినిమా తర్వాత ఒక్కసారిగా ఆరు ఏడు సినిమాల్లో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమాలోనూ శ్రీలీల నటించింది. మహేష్ బాబుతో గుంటూరు కారం సినిమాలో చేసిన కుర్చీ మడత పెట్టి డాన్స్‌కి అంతా ఫిదా అయ్యారు. అంతే కాకుండా శ్రీలీల ప్రతి సినిమాలోనూ ఏదో ఒకటి లేదా అంతకు మించిన పాటలతో ఆకట్టుకుంటూ వచ్చింది. సోషల్ మీడియాలో శ్రీలీలకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ చేసిన ఐటెం సాంగ్‌తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు సొంతం చేసుకుంది. ప్రస్తుతం పాన్ ఇండియా



హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తుంది. డాన్స్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకుంటున్న శ్రీలీల సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా వైరల్ అవుతోంది. మరోసారి శ్రీలీల తన అందమైన ఫోటోలను ఇన్‌స్టాలో షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. సన్నగా నాజూకుగా ఉండే శ్రీలీల ఈసారి ఏంజిల్ లుక్‌లో చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు ఫోటో జెనిక్ ఫేస్ అనిపించేంత అందంగా కనిపించే శ్రీలీల ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దేవ కన్య మాదిరిగా లైట్ బ్లూ కలర్‌లో మెరిసి పోతుంది. ఆకాశం నుంచి దిగి వచ్చిన ఏంజిల్ ఈమె అంటూ పలువురు కామెంట్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉండటంతో పాటు డాన్స్‌తో మతి పోగొడుతుంది కనుకే శ్రీలీలకు టాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. శ్రీలీల షేర్ చేసిన ఈ ఫోటోలకు మంచి స్పందన దక్కింది. నిమిషాల వ్యవధిలోనే లక్షకు పైగా లైక్స్ వచ్చాయి. దాదాపుగా 12 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న శ్రీలీల ఇలాంటి ఫోటోలను మరిన్ని షేర్ చేయాలని అభిమానులు కోరుతున్నారు. శ్రీలీల అమెరికాలోని మిచిగాన్‌లో డెట్రాయిట్‌కి చెందిన ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది. బెంగళూరులో పెరిగిన శ్రీలీల తల్లి ఏపీకి చెందిన ఒంగోలుకు చెందిన వారు. దాంతో శ్రీలీల తెలుగు మూలాలు కలిగిన వ్యక్తి. అందుకే తెలుగు చక్కగా మాట్లాడుతుంది. తెలుగు అమ్మాయిలకు తెలుగు సినిమాల్లో ఆఫర్లు రావని, వచ్చినా కేవలం చిన్న సినిమాలకే పరిమితం అనే అభిప్రాయం ఉండేది. కానీ శ్రీలీల పెద్ద సినిమాలు, స్టార్ హీరోల సినిమాల్లో నటించడం ద్వారా స్టార్ హీరోయిన్‌గా నిలిచింది.

ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ శ్రీలీల నటిస్తోంది. ఈ ఏడాది శ్రీలీల నటిస్తున్న మూడు నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## 'ఛావా' కారణంగా నాగ్‌పూర్ అల్లర్లు.. టెన్షన్‌లో నటి!

చాలా కాలంగా పరిశ్రమకు దూరంగా ఉన్న బాలీవుడ్ నటి స్వర భాస్కర్ ఇండస్ట్రీలో పలు అంశాలపై నిరంతరం సోషల్ మీడియాల్లో తన అభిప్రాయం చెబుతున్నారు. వీటిలో కొన్ని వివాదాల్ని కూడా మోసుకొస్తున్నాయి. ఇప్పుడు స్వరా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రెండు ట్వీట్లు దుమారం రేపుతున్నాయి. వీటిలో నాగ్‌పూర్ అల్లర్లకు 'ఛావా' సినిమానే కారణం అని ఒక ట్వీట్ లో పేర్కొనగా, మరొక ట్వీట్‌లో నటుడు కునాల్ కమ్రాను ప్రశంసిస్తూ, ఏక్‌నాథ్ షిండే కి వ్యతిరేకంగా ట్వీట్ చేయడం హాట్ టాపిగ్గా మారింది. స్వరా పోస్ట్‌లలో ఒకదానిలో "ఛావా చిత్రం రెచ్చగొట్టేది. విక్కీ కౌశల్ – నిర్మాతలు నాగ్‌పూర్ అల్లర్లకు బాధ్యులు. ఈ చిత్రాన్ని భారతదేశం అంతటా నిషేధించాలి" అని



రాశారు. అదే సమయంలో రెండవ ట్వీట్‌లో "కునాల్ కమ్రా కామెడీ షో ఒక కళ" అని రాశారు. షిండే మద్దతుదారులే ఈ విధ్వంసానికి బాధ్యులు! అని కూడా ట్వీట్ లో రాసారు. ఈ రెండు ట్వీట్లు ఇంటర్నెట్ లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఇవి ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అయితే నెటిజనుల నుంచి ఊహించని విమర్శలు ఎదురవ్వడంతో స్వరా తాజాగా దీనిపై స్పందించారు. ఈ ట్వీట్‌లను తాను చేయలేదని, ఇవన్నీ నకిలీ ట్వీట్లు అని పేర్కొన్నారు. దయచేసి వాస్తవాలను తెలుసుకోండి అని కూడా స్వరా అభ్యర్థించారు. ఫేక్ పోస్ట్‌లకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్‌లను స్వరా షేర్ చేసారు. మూర?పు రైటిస్టులు మళ్ళీ వారు చేయగలిగినది చేయడం ప్రారంభించారు.. నకిలీ ఫోటోలు, మీమ్‌లను ప్రచారం చేస్తున్నారు" అని రాసింది. స్వర భాస్కర్ పోస్ట్ కి కొందరు మద్ధతుగా నిలిచారు. వారంతా నకిలీ ఫోటోతో స్వరాను సోషల్ మీడియాల్లో బ్యాడ్ చేస్తున్నారని రాసారు.. నిజమైన ప్రొఫైల్ ఫోటో ఇది కాదు. ఈ పోస్ట్‌లోని ఫోటోకి స్వరా ఒరిజినల్ ప్రొఫైల్ ఫోటోకి మధ్య చాలా తేడా ఉందని కూడా నెటిజనులు విశ్లేషించారు. అయితే స్వరాను ఏదో ఒక రకంగా ఇరకాటంలో పెడుతూ కొందరు చాలా గందరగోళం సృష్టిస్తున్నారు.

# ధనుష్ ఇంగ్లీష్ మూవీ వచ్చింది, చూశారా?




ధనుష్ హీరోగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా వరుస సినిమాలు చేస్తున్నాడు. తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగు, హిందీ భాషల్లోనూ ధనుష్ సినిమాలు చేసిన విషయం తెల్సిందే. ధనుష్ ఇండియన్ సినిమాలకే పరిమితం కాకుండా హాలీవుడ్ సినిమాలోనూ నటించాడు. ధనుష్ ముఖ్య పాత్రలో 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్' అనే ఇంగ్లీష్ సినిమా వచ్చింది. 2018లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. వంద కోట్లకు పైగా వసూళ్ల టార్గెట్‌తో వచ్చిన ఆ సినిమా మినిమం వసూళ్లను సొంతం చేసుకోవడంలో విఫలం అయింది. అయితే ఓటీటీలో ఈ సినిమాకు మంచి స్పందన వచ్చింది. ఇంగ్లీష్, తమిళ్ వర్షన్‌లలో ఇన్నాళ్లు అందుబాటులో ఉన్న ఈ సినిమాను తాజాగా తెలుగులోనూ ప్రేక్షకుల ముందుకు ఆహా ఓటీటీ వారు తీసుకు వచ్చారు. ఆహా ఓటీటీ లో ఈ సినిమాను ఇప్పటికే స్ట్రీమింగ్ చేశారు. ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్ సినిమాలో ధనుష్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. కమర్షియల్‌గా నిరాశ పరచినా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంలో ఈ సినిమా సక్సెస్ అయింది. అందుకే ధనుష్ అభిమానులతో పాటు, ప్రేక్షకులు అంతా ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయడం కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సినిమాను ఆహా ఓటీటీ లో స్ట్రీమింగ్ చేయడంతో ధనుష్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ధనుష్ ప్రస్తుతం ఉన్న జోష్ నేపథ్యంలో ఈ సినిమాకు ఓటీటీలో ఈ సినిమాకు మంచి స్పందన వస్తోంది. ధనుష్ ఇటీవల 'నీలావుకు ఎన్ మేల్ ఎన్నడి కోబం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దర్శకుడిగా ఇప్పటికే మంచి పేరు సొంతం చేసుకున్న ధనుష్ ఈ సినిమాతో మరో విజయాన్ని సొంతం చేసుకున్నాడు. జాబిలమ్మ నీకు అంత కోపమా అనే టైటిల్‌తో తెలుగులో ఈ సినిమాను డబ్ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. విభిన్నమైన లవ్ స్టోరీతో ధనుష్ యూత్ ఆడియన్స్‌ను అలరించాడు. తక్కువ సమయంలోనే తమిళనాట మంచి వసూళ్లను ఈ సినిమా రాబట్టిందని తెలుస్తోంది. నటుడిగానూ ధనుష్ చాలా బిజీగా ఉన్న విషయం తెల్సిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన 'కుబేర' సినిమాతో ధనుష్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. కుబేర సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటించిన విషయం తెల్సిందే. ధనుష్ కి సార్ సినిమాతో టాలీవుడ్‌లో బిగ్ హిట్ దక్కింది.

ఇప్పుడు మరో తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ములతో నటిస్తున్న కారణంగా అంచనాలు మరింత పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా కుబేరా ఉంటుంది అని చిత్ర యూనిట్ సభ్యులు నమ్మకంగా చెబుతున్నారు. మరో వైపు ధనుష్ తన దర్శకత్వంలో ఇడ్లీ కడై అనే సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇప్పటికే ప్రారంభం అయి విడుదలకు సిద్ధం అవుతోంది. త్వరలోనే ఆ సినిమా విడుదల తేదీ పై క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# రిటైర్మెంట్ కు ముందే షాక్ ఇచ్చిన స్టార్ హీరో!



తలపతి విజయ్ సినిమాలకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో తమిళనాడు నుంచి బరిలోకి దిగడంతో? సినిమాలకు గుడ్ బై చెప్పి రాజకీయాలకు స్వాగతం పలుతుకున్నాడు. ఇప్పటికే పార్టీ స్థాపించి దాన్ని బలోపేతం చేసే పనిలో ఉన్నాడు. అయితే చివరి సినిమాగా 69వ చిత్రం జన నాయగన్ చేస్తున్నాడు. ఇది పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో చేస్తోన్న చిత్రం. అత్యంత ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తున్నారు. మరి విజయ్ చివరి చిత్రం పారితోషికం ఎంత అంటే? భారీ లెక్క బయటకు వచ్చింది. ఈ సినిమాకు గాను విజయ్ 125 కోట్లు తీసుకుంటున్నాడుట. ఈ చిత్రాన్ని కేవీ ఎన్ ప్రొడక్షన్స్ విజయ్ డిమాండ్ చేయకుండానే ఇంత మొత్తంలో ఇస్తుందిట. అడ్వాన్స్ రూపంలో 50 కోట్లు అందాయని మిగిలిన అమౌంట్ చిత్రీకరణ పూర్తయిన తర్వాత అందించేలా ఒప్పందం చేసు కున్నారుట. విజయ్ మార్కెట్ ఆధారంగానే ఇంత మొత్తంలో చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలోనే విజయ్ ఓ సినిమాకు 150 కోట్లకు పైగా పారితోషికం తీసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. కానీ అందులో క్లారిటీ లేదు. కానీ జన నాయగన్ విషయంలో మాత్రం కోలీవుడ్ మీడియాలో ఇప్పుడీ అంశం హాట్ టాపిక్ గా మారింది.

విజయ్ రాజకీయంగా బిజీ అయ్యే క్రమంలో భారీగా డబ్బు అవసరం పడే అవకాశం ఉండటంతో కేవీఎన్ హీరోపై అభిమానంతో ఇంత మొత్తంలో చెల్లించినట్లు వార్తలొస్తున్నాయి. ఒకవేళ భవిష్యత్ లో విజయ్ మళ్లీ కంబ్యాక్ అయ్యే ఆలోచన ఉంటే తమ సంస్థలోనే సినిమా చేస్తాడనే ఆశ కూడా సదరు సంస్థ వ్యక్తం చేస్తుందిట. పార్టీ నడపాలంటే డబ్బు తప్పని సరి. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ ఎంత ఇబ్బంది పడ్డాడో? తెలిసిందే. సీరియస్ గా సినిమాలు మానేసి రాజకీయాలు చేస్తానని వెళ్లిన పవన్ తిరిగి డబ్బులు కోసం మళ్లీ సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. మరి విజయ్ స్ట్రాటజీ ఎలా ఉండబోతుందో చూడాలి.

# వారం గ్యాప్‌లో ఆమె జాతకం తేలిపోనుంది!

టాలీవుడ్‌లో సుధీర్ బాబుతో కలిసి 'ఎస్ఎంఎస్' సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా. తక్కువ సమయంలోనే తెలుగు, తమిళ్, కన్నడంలో ఎక్కువ సినిమాలు చేసిన ముద్దుగుమ్మగా నిలిచింది. రెజీనా టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచింది. పలువురు టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోలతో సినిమాల్లో నటించింది. కానీ స్టార్ హీరోలతో కలిసి నటించే అవకాశం ఈ అమ్మడికి దక్కలేదు. దాంతో స్టార్ హీరోయిన్ ఇమేజ్ సొంతం చేసుకోకుండానే టాలీవుడ్‌లో మీడియం రేంజ్ హీరోయిన్‌గా నిలిచింది. స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కకున్నా వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు 20 ఏళ్లు అవుతుంది. రెజీనా రెండు మూడు హిందీ సినిమాలు చేసినప్పటికీ పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. సౌత్ సినిమాల్లో ఇప్పటికే ఒక స్థాయిలో గుర్తింపు ఉన్న ఈ అమ్మడు బాలీవుడ్‌లో మరోసారి గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తుంది. రెజీనా త్వరలో రెండు హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ నటుడు సన్నీ డియోల్ నటించిన 'జాట్' సినిమా



విడుదలకు సిద్ధం అయింది. ఆ సినిమాలో రెజీనా కీలక పాత్రలో కనిపించబోతుంది. ఏప్రిల్ 24న జాట్ సినిమా బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో రెజీనా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. జాట్ సినిమాతో పాటు రెజీనా హిందీలో మరో పెద్ద హీరోతో కలిసి నటించింది. సూపర్ హిట్ అయిన కేసరి సినిమా ఫ్రాంచైజీలో రాబోతున్న అక్షయ్ కుమార్ 'కేసరి చాప్టర్ 2' సినిమాలో రెజీనా నటించిందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు చిత్ర యూనిట్ సభ్యులు ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కానీ రెజీనా పాత్రను సస్పెన్స్‌గా ఉంచుతున్నారని తెలుస్తోంది. స్వతంత్ర్య ఉద్యమ సమయంలో జరిగిన జలియన్ వాలాబాగ్ ఊచకోత బాధితుల కోసం పోరాడిన న్యాయవాది, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సి శంకరన్ నాయర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. సి శంకరన్ నాయర్ భార్య పాత్రలో రెజీనా కనిపించబోతుంది అనే వార్తలు వచ్చాయి. కేసరి 2 సినిమాను ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈ రెండు సినిమాలు భారీ అంచనాల నడుమ విడుదల కాబోతున్నాయి. ఐపీఎల్ నుంచి గట్టి పోటీ ఉన్న కారణంగా ఈ రెండు సినిమాలకు ఒక మోస్తరు బజ్ క్రియేట్ అయింది. అయితే సినిమాలు ఎంత మేరకు హిట్ అవుతాయి అనేది తెలియాల్సి ఉంది. ఈ రెండు సినిమాలు వారం గ్యాప్‌లోనే రాబోతున్న నేపథ్యంలో బాలీవుడ్‌లో రెజీనా జాతకం ఏంటి అనేది ఆ వారం రోజుల్లోనే తేలిపోయే అవకాశం ఉంది.

## సంతాన ప్రాప్తిరస్తు: హార్ట్ టచింగ్ గా 'నాలో ఏదో....'

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంతాన ప్రాప్తిరస్తు సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అవుతున్నాయి. టీజర్‌కు వచ్చిన స్పందనతో సినిమా మీద ఆసక్తి నెలకొనగా, తాజాగా విడుదలైన ఫస్ట్ లిరికల్ సాంగ్ 'నాలో ఏదో..' ఈ హైప్‌ను మరింత పెంచింది. రేడియో మిర్చిలో ఈ పాట లాంచ్ ఈవెంట్ జరిగింది. ప్రేమలో పరవశించే మనసుల భావోద్వేగాన్ని ఈ పాట సున్నితంగా చూపించింది. సునీల్ కశ్యప్ అందించిన మెలోడియస్ ట్యూన్, శ్రీజో అందించిన ఎమోషనల్ లిరిక్స్ ఈ పాటను యూత్‌కు దగ్గర చేస్తూ, సూటిగా గుండెను తాకుతున్నాయి. 'నాలో ఏదో మొదలైందని.. నీతో చెలిమే రుజువైందని..' అంటూ సాగే ఈ పాట, ప్రేమలోని భిన్నమైన భావాలను హైలెట్ చేస్తోంది. దినకర్ కల్వల, అదితి భావరాజు గాత్రాల్లో ఈ పాట మరింత వినసొంపుగా అనిపిస్తుంది. విజువల్‌గా కూడా ఇది మంచి లవ్ మూడ్‌ను ట్రాన్స్‌మిట్ చేయనుంది. ఈ పాటను గురించి దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ, సినిమా కథలో ప్రధాన పాత్రల మధ్య మొదలయ్యే ప్రేమను పాట రూపంలో అందించాలన్న ఆలోచనతో 'నాలో ఏదో..' సాంగ్ రూపొందించామని తెలిపారు. మ్యూజిక్ లవర్స్‌కు ఇది ఎప్పటికి గుర్తుండిపోయే




పాట అవుతుందని చెప్పారు. లేటెస్ట్ యువత ఆలోచనకు తగ్గట్లే ముందుకు సాగే ఈ కథకు సంగీతం పెద్ద ప్లస్ అవుతుందనడంలో సందేహమే లేదని అన్నారు. లిరిసిస్ట్ శ్రీజో ఈ పాటకు తన మార్క్ లిరిక్స్ అందించారని, సింగర్ అదితి భావరాజు తెలిపారు. సున్నితమైన భావోద్వేగాల్ని పలికించగలిగే పాట పాడటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్ మాత్రం తన ట్యూన్‌కు మంచి స్పందన రావడం హ్యాపీగా ఉందంటూ పాట చార్ట్‌బస్టర్ అవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. గతంలోనూ మధుర ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలకు ఆయన ఇచ్చిన ట్యూన్స్ గుర్తుండిపోయేలా నిలిచాయి. హీరో విక్రాంత్ మాట్లాడుతూ, సినిమా షూటింగ్ మొత్తం మంచి ఎనర్జీతో జరిగింది. ఈ పాట యూనిట్ మొత్తానికి ఎంతో స్పెషల్‌గా ఉండిందన్నారు. నిర్మాత మధుర శ్రీధర్ మాట్లాడుతూ, 'నాలో ఏదో..' పాట యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌కి కూడా బాగా కనెక్ట్ అవుతుందన్నారు. అంతేకాదు, గతంలో వారి సంస్థకు సునీల్ కశ్యప్ అందించిన 'నిన్నలా లేదే..', 'మెల్లమెల్లగా..' లాంటి పాటల విజయాన్ని గుర్తు చేస్తూ ఈ పాట కూడా అదే లెవెల్‌లో నిలుస్తుందని నమ్మకమన్నారు. ఇక సినిమాలో వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, హర్షవర్ధన్, తాగుబోతు రమేష్ లాంటి వారు ఈ సినిమాలో నటించారు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. 'సంతాన ప్రాప్తిరస్తు' పాటలతోనే కాదు, కథతోనూ ఓ ప్రత్యేకమైన మెసేజ్ ఇవ్వబోతోందని ఇప్పటికే సినిమా ప్రొమోస్ సూచిస్తున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536